

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 223

శుక్రవారం 3-11-2023




## ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

–ఫ్యామిలీ లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 223

శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATI | VISAKHAPATNAM | WARANGAL

● టెక్.. టాక్

## హువావే నోవా 11 ఎస్ఈ



సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

## లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్ /
128జీబి 8జీబి ర్యామ్ / 256 జీబి 8జీబి ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్

## పోట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

## గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవెల్‌కు తీసుకువెళ్లనుంది.



## ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...




● ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి ●టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి ● సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్ ● ట్యాప్-యాక్టివిటీ ● ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాలజీస్ ● ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ

## అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్




చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ


ప్రమోద్ గాడ్గే

'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు, కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహీద్‌లు...


షాహీద్ మెమన్

అన్‌బాక్స్

# అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రొబోటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణె కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీయివో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహీద్ రోబోటిక్స్, ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వార్మ్ ఇంటెలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది.

అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్‌లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

> స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.




# యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్




### ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.

ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

### పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

## సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది.

'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాస లాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులు చెప్పడంలో, సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.


అమిక శైల్


అమిక శైల్

● గేమింగ్



## అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'ఫ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

**గేమ్ ప్లే:** కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
**జానర్స్:** రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
**ప్లాట్‌ఫామ్స్:** ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

# సినిమా


● రామ్‌చరణ్

## ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

## మా వ్యూహం మాకుంది

**- రామ్‌గోపాల్ వర్మ**


● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.

## చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

**- సెబాస్టియన్ నోవా అకోస్టా**



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ– ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.

## లవ్ డ్యూయెట్


● రితిక, ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరదరాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.



"చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను" అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.

## అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

**- హీరో కార్తీ**

● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్తిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు మురుగన్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగ లేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

## ఈ సినిమా నాకో పెద్ద వేడుక

**- 'సత్యం' రాజేశ్**



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

## ఓ కల ఆధారంగా..


● రోహిత్ నందా

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ– ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 223

శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్

# ఉంగరాల గొలుసులు









వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్టన్, వెస్టన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

### బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్టన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

### వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

### స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

## బ్యూటిప్స్

వేకువ జాముకు చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

### శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

## వంటిల్లు

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

# చలిని వెచ్చగా కొరికేద్దాం!



### పొటాటో పాన్‌కేక్స్

**కావలసినవి:** ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

**తయారీ:** ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.



### పోహా వెజ్ కట్‌లెట్

**కావలసినవి:** అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణి – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.


**తయారీ:** ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణి, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.



### పనీర్ కుర్‌కురే

**కావలసినవి:** నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.



### పాలక్ మేథీ పూరీ

**కావలసినవి:** జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.

## పారా హుషార్

# ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?



మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

**ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం:** ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ మగవారు ఎందుకు ఆలోచించరు?

**మ్యాన్ టచింగ్:** ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్లు, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

**మగవాళ్ల దొంగసాకులు:** 1. కొంచెమలా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

**నిలువరించాలి:** స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

**మన ఇంటి మగవారు:** పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్లు మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి– దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

## పురస్కారం

# షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.

వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.


అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్–2023 గెలుచుకుంది...



● నందినీ దాస్




ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.


యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

'ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్– ఛైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 223

శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**దాతృత్వంలో శివ్ నాడార్ టాప్**
రూ.2,042 కోట్ల విరాళం.. ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో ఫస్ట్ - VIలో



**యాపిల్‌కు నోటీసులు**
ఐఫోన్ల హ్యాకింగ్ అలర్ట్‌లపై దర్యాప్తు మొదలుపెట్టిన సీఈఆర్‌టీ-ఇన్ - 6లో



# ఇసుక దందాపై కొరడా

## చంద్రబాబు ముఠా రూ.10 వేల కోట్ల ఇసుక దోపిడీపై కేసు నమోదు

## ఏ-1 పీతల సుజాత, ఏ-2 చంద్రబాబు, ఏ-3 చింతమనేని, ఏ-4 దేవినేని ఉమా

- నాడు 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో భారీ దోపిడీ
- ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల గండి
- గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతరు
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో' ద్వారా దోపిడీకి రాచబాట
- ఇసుక రీచ్‌లన్నీ టీడీపీ ప్రజాప్రతినిధుల హస్తగతం
- ఎక్కడ ఎంత ఇసుక తవ్వారన్న లెక్కలు లేకుండా పక్కా స్కెచ్

1లో



ఎంత ఇసుక అందుబాటులో ఉంది.. ఎంత ఇసుక తవ్వుతున్నాం.. ఎంతకు అమ్ముతున్నాం.. అనే సమాచారం ఏదీ రికార్డుల్లో చూపించాల్సిన అవసరం లేకుండా నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు భారీ దోపిడీకి స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా తెరపైకి తీసుకువచ్చిందే 'ఉచిత ఇసుక విధానం'. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు ఉచితం అని భ్రమ కల్పించారు. కానీ వాస్తవంగా జరిగింది వేరు. ఈ విధానం ముసుగులో రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్ర బాబు తనతోపాటు మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు. తద్వారా వారి దోపిడీకి అంతేలేకుండా పోయింది. తక్కువలో తక్కువ బాబు అండ్ కో రూ.10 వేల కోట్లు కొల్లగొట్టింది.

### అడ్డగోలుగా దోచేశారు

- 2019 ఏప్రిల్ 4న తేల్చి చెప్పిన జాతీయ హరిత ట్రిబ్యునల్
- టీడీపీ పాలనలో ఉచిత ఇసుక విధానంతో విజృంభించిన స్మగ్లర్లు.. రూ.వంద కోట్లు జరిమానా విధించిన ఎన్జీటీ

1లో

### ముసుగు దోపిడీ

- ఎస్‌హెచ్‌జీలకు ఇసుక రీచ్‌ల బాధ్యతలు అప్పగించిన గత సర్కార్.. మహిళా సంఘాల పేరుతో కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- ఒకే బిల్లుపై వందల టన్నులు తరలించి అక్రమంగా విక్రయాలు
- ఆ అక్రమాలను కడిగేసిన 'కాగ్'

1లో

## న్యూస్‌రీల్

### పోస్ట్ ద్వారా రూ.2 వేల నోట్ల మార్పిడి



ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లను ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 రకాల రక్షణ) ఫామ్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో మార్చుకోవచ్చని ఆర్‌బీఐ అధికారులు వెల్లడించారు. అనంతరం ఆ డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందన్నారు.
వివరాలు VIలో ▸

### జాతీయ ఉపకార వేతనాలకు ప్రత్యేక పోర్టల్



కళాశాలలు, యూనివర్సిటీల విద్యార్థులకు అందించే 'సెంట్రల్ సెక్టార్ స్కీం స్కాలర్‌షిప్'లకు దరఖాస్తు కోసం ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. 2023-24 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ కోసం డిసెంబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలి.
వివరాలు 3లో ▸

### మూలపాడులో అంతర్జాతీయ క్రికెట్ టోర్నీ



అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు విజయవాడ సమీపంలోని మూలపాడు వేదిక కాబోతోంది. మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్లలో ఈనెల 13 నుంచి 27 వరకు అండర్-19 పురుషుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు ఏసీఏ తెలిపింది. బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఇండియా-ఎ, ఇండియా-బి జట్లు పాల్గొంటాయని పేర్కొంది.
వివరాలు 1లో ▸

## ఫ్యాక్ట్‌చెక్

### మీరు సుద్దులు చెబితే ఎలా!?

- రుషికొండపై పర్యాటక శాఖ నిర్మాణాలపై రామోజీ విషపు రాతలు
- అన్ని రకాల అనుమతులతో భవన నిర్మాణాలు చేపడుతున్నా నానాయాగీ
- టీడీపీ పాలనలో రుషికొండను తవ్వి, అక్కడున్న చెట్లను నరికి నిర్మాణాలు చేయలేదా?

Vలో



### కొనసాగుతున్న దాడులు

హమాస్ మిలిటెంట్ల కోసం ఇజ్రాయెల్ గాలింపు ముమ్మరం

గాజాలో 9 వేలు దాటిన మృతులు

6లో

అనకాపల్లి జిల్లా మాడుగులలో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



# పేదల సంక్షేమ రాజ్యం

'వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో పేదల సంక్షేమ రాజ్యం వచ్చింది. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో పేద, బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమం అందుతోంది. అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు' అని అనకాపల్లి జిల్లా మాడుగుల సభలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు.

IVలో

### సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైంది

'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ అణగారిన వర్గాలను అక్కున చేర్చుకుని అన్నింటిలోనూ అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైంది. నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో.. అన్ని వర్గాలకు మేలు జరిగింది. బడుగు వర్గాలకు చెందిన ఐదుగురిని డిప్యూటీ సీఎంలను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది' అని చిత్తూరు సభలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ చెప్పారు.

### పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య

'పేదలకు ఉన్నతస్థాయి విద్య, వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేరువ చేశారు. ప్రతి పేద పిల్లవాడు చదువుకోవడానికి అవసరమైన అన్ని వనరులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది. గతంలో చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. కానీ సీఎం జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపించి చరిత్ర సృష్టించారు' అని కృష్ణా జిల్లా అవనిగడ్డ సభలో మంత్రి జోగి రమేశ్ అన్నారు.

# ఆదాయంతోపాటు అభివృద్ధి

## టీడీపీ హయాంతో పోలిస్తే అప్పులూ తక్కువే.. జీఎస్‌డీపీ పెరిగింది: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి గత సర్కారు కంటే అధికంగా వ్యయం.. తప్పుడు లెక్కలతో యనమల లేఖలు.. పరస్పర విరుద్ధంగా పాత ఆరోపణలు
- అప్పులకు కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్బీఐ, కాగ్ గణాంకాలే కొలమానం.. కేంద్ర ఆర్థిక శాఖపైనా ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని పురందేశ్వరి డిమాండ్ చేయగలరా?




- వివరాలు Vలో



## ఇదండీ సంగతి



కొత్తదనం కోసం వెతుక్కుంటూ సారు సంవత్సరానికోసారి పార్టీ మారుతారు!

## క్లుప్తంగా...

### 13 నుంచి మూలపాడులో అంతర్జాతీయ క్రికెట్ టోర్నీ

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు విజయవాడ సమీపంలోని మూలపాడు వేదిక కాబోతోంది. మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్లలో ఈనెల 13 నుంచి 27 వరకు అండర్–19 పురుషుల అంతర్జాతీయ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మూలపాడులో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఆధ్వర్యంలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. మొత్తం నాలుగు జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. బంగ్లాదేశ్, ఇంగ్లండ్‌తో పాటు మన దేశం తరఫున ఇండియా–ఎ, ఇండియా–బి జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 5న ఇంగ్లండ్ జట్టు విజయవాడకు వచ్చి మూలపాడులో 4 రోజుల పాటు ప్రాక్టీస్ చేస్తుందని, బంగ్లాదేశ్ జట్టు 10వ తేదీన విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అలాగే విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23న ఇండియా–ఆస్ట్రేలియా టీ–20 ఇంటర్నేషనల్ మ్యాచ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవీకాలం పొడిగింపు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్(మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ పదవీకాలాన్ని మరో రెండేళ్లు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ ఉత్తర్వులిచ్చారు.

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కేబినెట్ హోదా



సాక్షి, అమరావతి: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావుకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శంకరరావును రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### రూ.8 వేల కోట్ల ఇంధన పొదుపు పెట్టుబడికి కృషి




ఏపీఎస్ఈసీఎం వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు

సాక్షి, అమరావతి: విద్యుత్ పొదుపును మరింతగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ రంగంలో రూ.8 వేల కోట్ల పెట్టుబడులను సృష్టించే దిశగా రోడ్ మ్యాప్ తయారు చేస్తోంది. తద్వారా 2030 నాటికి 3.88 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు (ఎంటీవోఈ)కు సమానమైన ఇంధనాన్ని ఆదా చేయడంతోపాటు 2031 కల్లా 12 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించవచ్చని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించడంలో కీలకపాత్ర పోషించే రాష్ట్ర ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళిక (సీప్)ను ఖరారు చేయడానికి ఇంధనశాఖకు చెందిన ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) గురువారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించింది. కేంద్ర ఇంధనశాఖకు చెందిన బీఈఈ, సీఐఐ సహకారంతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో విద్యుత్, పరిశ్రమలు, రవాణా, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, వ్యవసాయం, హౌసింగ్, ఫిషరీస్ సహా కీలక విభాగాల అధికారులు పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇచ్చారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏపీఎస్ఈసీఎం అధికారులు తుది ప్రణాళిక ఖరారు చేయనున్నారు. దాని ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో రాష్ట్రంలో విద్యుత్‌ను ఆదా చేయగల మార్గాలను ఏపీఎస్ఈసీఎం అన్వేషిస్తుంది. ఇంధన సామర్థ్య పెట్టుబడులపై దృష్టి సారిస్తుంది. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

### నదుల అనుసంధానానికి ఒప్పందం!

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి, బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ప్రాజెక్టు కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి మధ్య ఎంఓయూకి కేంద్రం రంగం సిద్ధం చేసింది. నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ మేరకు ముసాయిదా ఎంఓయూను సిద్ధం చేసింది. గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి ఆయా రాష్ట్రాల నుంచి సమ్మతి పొందడానికి ఎన్‌డబ్ల్యూడీఏ ఈ నెల 10న జలసౌధలో 5వ సంప్రదింపుల సమావేశం నిర్వహించనుంది. దీనిపై ఇప్పటికే ఆయా రాష్ట్రాల సలహాలు, సూచనలను కోరింది.

# ఇసుక దందాపై కొరడా

## చంద్రబాబు ముఠా రూ.10 వేల కోట్ల ఇసుక దోపిడీపై కేసు నమోదు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా సాగిన ఇసుక దోపిడీపై సీఐడీ కొరడా ఝుళిపించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కర్త, కర్మ, క్రియగా వ్యవహరించి, సాగించిన ఇసుక కుంభకోణంపై కేసు నమోదు చేసింది. 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో పచ్చ ముఠా బరితెగించి సాగించిన ఇసుక దోపిడీ గుట్టు రట్టు చేసింది. కేంద్ర ప్రభుత్వ చట్టం, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి, కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో' ద్వారా చంద్రబాబు పన్నిన పన్నాగం ఆధారాలతోసహా బట్టబయలు అయ్యింది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాక, చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది విభ్రాంతి పరుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా పీతల సుజాత (టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి), ఏ–2గా చంద్రబాబు (అప్పటి ముఖ్యమంత్రి), ఏ–3గా చింతమనేని ప్రభాకర్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే), ఏ–4గా దేవినేని ఉమామహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)తోపాటు మరికొందరిని ఏ–5గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానానికి తెలుపుతూ గురువారం పిటిషన్ దాఖలు చేసింది. వీరిపై ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2) ప్రకారం అభియోగం నమోదు చేశారు.

### అంతులేని బాబు ధన దాహం

పదేళ్ల తర్వాత 2014లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి బరితెగించారు. ఆ క్రమంలో ఆయన కన్ను రాష్ట్రంలో ఇసుక రీచ్‌లపై పడింది. యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడాలని పన్నాగం రచించారు. అందుకోసం 2014 నుంచి 2016 వరకు ఓ విధానాన్ని తీసుకువచ్చి, అడ్డూ అదుపు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. అంతటితో ఆయన ధన దాహం తీరలేదు. దాంతో మరింతగా బరితెగించి ఇసుక దోపిడీ సాగించేలా వ్యూహం పన్నారు. అందుకోసం ప్రభుత్వ ఇసుక విధానాన్ని పునఃసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. అనంతరం కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని చంద్రబాబు భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలుగానీ, ఆంక్షలు గానీ విధించదు' అని చెప్పారు. ఈ మేరకు 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకువచ్చారు.

### మెమో 3066తో కనికట్టు

- 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో గత ప్రభుత్వ పెద్దలు మాయాజాలం చేసి, భారీ అవినీతికి పాల్పడ్డారు. కొత్త ఇసుక విధానాన్ని తీసుకువస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో నంబరు 3066'ను జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు.
- రాష్ట్రంలో సహజ వనరులకు సంబంధించి, అందులో రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండా కేవలం ఒక మెమో ద్వారా కథ నడిపించడం చంద్రబాబు అవినీతికి పరాకాష్టగా నిలిచింది. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు.
- అప్పటి వరకు కూలీలతో ఇసుక తవ్వకాలు సాగుతుండగా.. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తీసుకువచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి.. అమ్ముకోసాగింది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత.. రోజుకు ఎంత ఇసుక తవ్వుతున్నారు.. ఎంతకు అమ్ముతున్నారు.. ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోందన్న లెక్కలకు అంతూపొంతూ లేకుండా పోయింది.
- శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకు అంతటా యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఇసుకదోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా, ఈ కుట్రలో అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు.
- అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహశీల్దార్ వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుట్టు పట్టుకుని మరీ దాడికి పాల్పడటం అప్పట్లో తీవ్రంగా చర్చనీయాంశమైంది. ఇది పచ్చ ముఠాల బరితెగింపునకు నిదర్శనం. అంతగా తహశీల్దార్‌పై దాడికి పాల్పడిన తన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను అప్పటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని స్పష్టమైన సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

### టీడీపీ పెద్దల జేబులోకి రూ.10 వేల కోట్లు

2016 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ పెద్దలు సాగించిన ఇసుక దోపిడీ విలువ ఎంతన్నది నిగ్గు తేల్చడం గనుల శాఖ అధికారులకే అంతుపట్టడం లేదు. గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్‌మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తీసుకువచ్చింది. ఆ ప్రకారం 2020 నుంచి 2022 వరకు రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. అంటే చంద్రబాబు 'ఉచిత ఇసుక' అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్లు గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతన్న అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### నిర్భీతిగా నిబంధనలు బేఖాతరు

వేల కోట్ల రూపాయల ఇసుక దందా కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను నిర్భీతిగా ఉల్లంఘించారు. కేవలం ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పాల్పడటం ఆయన కుతంత్రానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే రాష్ట్రాల్లో ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. ఆ మేరకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి. దాంతోపాటు మరో రెండు విధానాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా ఈ మూడింటిలో ఏదైనా ఒకటి కచ్చితంగా పాటించాలి.


- ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి.
- అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి.
- ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి.

కానీ చంద్రబాబు ప్రభుత్వం మోసపూరితంగా తీసుకువచ్చిన 'ఇసుక విధానం' కోసం ఈ మూడు విధానాల్లో ఏ ఒక్కటీ పాటించ లేదు. అంటే జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటించ లేదు. కొత్త విధానం కోసం ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోలేదు. అప్పటి కేబినెట్‌లో కూడా బిల్లు ప్రవేశపెట్టి చర్చించి ఆమోదించ లేదు.

# అడ్డగోలుగా దోచేశారు..

### ఇసుక దోపిడీపై 2019 ఏప్రిల్ 4న తేల్చి చెప్పిన ఎన్జీటీ


- ఉచిత ఇసుక విధానంతో విజృంభించిన స్మగ్లర్లు
- చంద్రబాబు అక్రమ నివాసానికి కూతవేటు దూరంలోనే తవ్వకాలు
- ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో ఎనిమిది చోట్ల పొక్లెయిన్‌లతో తవ్వకాలు
- రోజూ 2,500 ట్రక్కుల్లో 34 వేల టన్నుల ఇసుక తరలింపు
- ఒక్కో ట్రక్కుకు రూ.5 వేల చొప్పున రూ.1.25 కోట్లు అక్రమ ఆర్జన
- ఆ ఎనిమిది రీచ్‌ల ద్వారానే టీడీపీ పెద్దల జేబులోకి ఏటా రూ.450 కోట్లు
- ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని వేల కోట్లో!
- తక్షణమే తవ్వకాలను ఆపేయాలని ప్రభుత్వానికి ఎన్జీటీ అల్టిమేటం
- పర్యావరణానికి విఘాతం కలిగించినందుకు రూ.వంద కోట్లు జరిమానా
- స్మగ్లర్ల నుంచే ఈ జరిమానా వసూలు చేయాలని స్పష్టీకరణ



In Original Application 110(sc) of 2012, *Threat to life arising out of coal mining in south Garo Hills district Vs. State of Meghalaya & Ors.* (supra), this Tribunal held the State of Meghalaya liable to deposit a sum of Rs. 100 Crores with CPCB for inaction in preventing illegal rat hole mining. Damage in the present case is of much higher magnitude. Pending further consideration in the light of reports from CPCB and the Chief Secretary, Andhra Pradesh, we direct the State of Andhra Pradesh to deposit an interim amount of Rs. 100 crores with the CPCB within one month from today which may be recovered from the polluters and the persons responsible for illegal mining or the colluding erring officers. Interest @12% will accrue after one month. The amount is to be spent for restoration of the environment.

The Chief Secretary may also prepare a report about the

అక్రమ ఇసుక తవ్వి పర్యావరణాన్ని చావుదెబ్బ తీసినందుకు ప్రభుత్వానికి రూ.100 కోట్లు జరిమానా విధిస్తూ ఎన్జీటీ ఇచ్చిన ఉత్తర్వులు



7. The extent of mining as per report of the State PCB is 2,500 trucks per day. More than 34,000 metric tons of sand is extracted daily. The value of sand extracted even @ Rs. 5,000 per truck is Rs. 1.25 crores per day i.e. about Rs. 450/- crores per year only at the location in question. According to Mr. Sravan Kumar, Advocate, present before the Tribunal, who

ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో 8 రీచ్‌లలోనే ఇసుక అక్రమ రవాణా ద్వారా ఏడాదికి రూ.450 కోట్లు దోచేశారని పేర్కొన్న ఎన్జీటీ నివేదిక

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో నిబంధనలను ఉల్లంఘించి, జీవనదులను విధ్వంసం చేసి.. పర్యావరణాన్ని చావుదెబ్బ తీస్తూ అడ్డగోలుగా యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగిందని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తేల్చి చెప్పింది. కృష్ణా నదీ గర్భంలో ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో అప్పటి సీఎం చంద్రబాబు నివాసముంటున్న అక్రమ కట్టడానికి కూత వేటు దూరంలో పొక్లెయినర్లతో భారీ ఎత్తున ఇసుకను తవ్వి.. వందలాది ట్రక్కులు, లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను స్మగ్లర్లు తరలిస్తున్నా ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించిందని మండిపడింది. ఈ మేరకు 2019 ఏప్రిల్ 4న స్పష్టం చేసింది. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని 2016 మార్చి 4 నుంచి అమల్లోకి తెచ్చింది. ఆ తర్వాత ఇసుక స్మగ్లర్లు విజృంభించారు. అప్పటి నుంచి ఒక్క ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో ఎనిమిది చోట్ల రోజూ 34 వేల టన్నుల ఇసుకను పొక్లెయిన్‌లతో తవ్వి 2,500 ట్రక్కుల్లో తరలించి.. ఒక్కో ట్రక్కు ఇసుకను కనీసం రూ.5 వేల చొప్పున విక్రయించి రూ.1.25 కోట్ల చొప్పున ఏడాదికి రూ.450 కోట్లను ఇసుక స్మగ్లర్ల ముఠా ఆర్జించిందని ఎన్జీటీ తేల్చింది. శ్రవణ్‌కుమార్ అనే న్యాయవాది వేరే కేసులో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా ఏడాదికి రూ.పది వేల కోట్లను స్మగ్లర్లు సంపాదిస్తున్నారని చెప్పడాన్ని ఎన్జీటీ ఎత్తిచూపింది. అక్రమంగా ఇసుకను తవ్వడం ద్వారా పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిందని.. అందుకు రూ.వంద కోట్ల జరిమానాగా చెల్లించాలని గత ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ రూ.100 కోట్లను ఇసుక స్మగ్లర్ల నుంచే వసూలు చేయాలంటూ 2019 ఏప్రిల్ 4న పేర్కొంది. అప్పట్లో అధికారంలో ఉన్నది టీడీపీ సర్కారే. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలోనే 8 చోట్ల అక్రమంగా ఇసుకను తవ్వి, తరలించి, విక్రయించి ఏడాదికి రూ.450 కోట్లను ఇసుక స్మగ్లర్లు దోచేస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి, పెన్నా, తుంగభద్ర, వంశధార, నాగావళి, చిత్రావతి సహా జీవనదులు, వాగులు, వంకల్లో ఇసుకను అడ్డగోలుగా దోచేయడం ద్వారా ఇంకెన్ని రూ.వేల కోట్లు దోచుకొని ఉంటారో అంచనా వేసుకోవచ్చు. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో కృష్ణా నది గర్భంలో అక్రమంగా పొక్లెయిన్‌లతో ఇసుకను తవ్వి, తరలించడం ద్వారా పర్యావరణానికి విఘాతం కలుగుతోందంటూ 2016లో ఎన్జీటీలో రైతులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎన్జీటీ.. తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని ఆదేశిస్తూ 2017 ఫిబ్రవరి 23న ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. కానీ.. ఎన్జీటీ ఆదేశాలను తుంగలో తొక్కిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలకు దన్నుగా నిలిచింది. ఇదే అంశాన్ని రైతులు మరోసారి ఎన్జీటీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో.. కృష్ణా నది గర్భంలో అక్రమ ఇసుక తవ్వకాలను నిగ్గు తేల్చాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ), రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లను 2018 డిసెంబర్ 21న ఎన్జీటీ ఆదేశించింది. సీపీసీబీ, పీసీబీలకు చెందిన ఏడుగురు అధికారులతో విచారణ కమిటీని నియమించింది.

### దోపిడీ గుట్టు రట్టు చేసిన కమిటీ

ఎన్జీటీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ.. చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ కట్టడానికి కూత వేటు దూరంలో కృష్ణా నది గర్భంలో ఇసుకను తవ్వుతున్న ప్రాంతంతోసహా ఎగువన మరో ఏడు రీచ్‌లను 2019 జనవరి 17, 18న క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసింది. ఆ తనిఖీలో వెల్లడైన అంశాల ఆధారంగా 2019 జనవరి 21న ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. నివేదికలో ప్రధానాంశాలు..

- ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో కృష్ణా నది గర్భంలో అనుమతి లేకుండా.. నదీ పరిరక్షణ చట్టం, పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది చోట్ల భారీ ప్రొక్లెయిన్‌లు, మర పడవల ద్వారా రోజుకు సుమారు 34,650 టన్నుల ఇసుకను తవ్వుతున్నారు. ఇలా తవ్విన ఇసుకను రోజూ 2,500 ట్రక్కులు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రక్కు ఇసుకను కనీసం రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. అంటే రోజుకు ఇసుక అక్రమ అమ్మకాలతో రూ.1.25 కోట్లు ఆర్జిస్తున్నారు. ఏడాదికి ఈ 8 రీచ్‌ల నుంచే రూ.450 కోట్ల చొప్పున కొల్లగొట్టారు. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో అడ్డగోలుగా ఇసుకను తవ్వేయడం వల్ల జీవనది కృష్ణా విధ్వంసమైంది. కృష్ణా నది గర్భంలో 25 మీటర్ల లోతు వరకు ఇసుకను తవ్వడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. అందువల్ల ప్రవాహ దిశ మారే అవకాశం ఉంది. వరద గట్లు, భవానీ ద్వీపం దెబ్బతిన్నాయి.
- ఈ నివేదికను సమగ్రంగా పరిశీలించిన ఎన్జీటీ.. ఇసుక స్మగ్లర్లకు దన్నుగా నిలిచిన అప్పటి టీడీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. రూ.వంద కోట్లను జరిమానాగా విధించింది.
- ఇసుక దందా గురించి 2016 నుంచి హిందూ వంటి జాతీయ పత్రికలతోపాటు టీవీ ఛానెళ్ల వరుస కథనాలను ప్రసారం చేయడాన్ని ఎన్జీటీ తన తీర్పులో ప్రస్తావించింది. ఇసుక స్మగ్లర్లు తవ్వేసిన గుంతల్లో పడి.. ఇష్టారాజ్యంగా ట్రక్కులు నడపడం వల్ల వాటి కింది పడి 14 మంది చనిపోవడాన్ని ఎత్తిచూపింది. ఇసుక స్మగ్లర్లు అడ్డగోలుగా దోచేస్తున్నా.. దానికి అడ్డుకట్ట వేయకుండా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడంలో ఔచిత్యం ఏమిటని చంద్రబాబు సర్కార్‌ను నిలదీసింది.

### బాబు జమానాలో లెక్కలేనన్ని ఇసుక అక్రమాలు

చంద్రబాబు జమానాలో తవ్వినకొద్దీ లెక్కలేనన్ని ఇసుక అక్రమాలు బయటపడ్డాయి. చంద్రబాబు, లోకేశ్ కనుసన్నల్లో అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు సాగించి, ఇసుకను తరలించింది. అప్పటి టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులైన దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నక్కా ఆనందబాబు, జవహర్, చింతమనేని ప్రభాకర్, కూన రవికుమార్, పెందుర్తి వెంకటేష్, బూరుగుపల్లి శేషారావు, ముళ్లపూడి బాపిరాజు, శ్రావణ్ కుమార్, తంగిరాల సౌమ్య, కొమ్మాలపాటి శ్రీధర్, శ్రీరాం తాతయ్య, ఆలపాటి రాజా తదితరులు ఇసుక అక్రమాల్లో చెలరేగిపోయారు. ఈ ముఠా అంతా ఇసుక ద్వారా దోపిడి చేసిన మొత్తంలో నెలవారీ కమీషన్లు ఏకంగా రూ.500 కోట్లు లోకేశ్‌కు ముట్టజెప్పేవారనేది బహిరంగ రహస్యం. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతోపాటు తమ్మిలేరు తదితర నదులు, ఏరుల్లో సైతం అడ్డు అదుపులేకుండా పెద్ద ఎత్తున ఇసుక దందా సాగించారు. స్వయం సహాయక బృందాల పేరుతో టీడీపీ పెద్దల కనుసన్నల్లోనే పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇసుక దందా నడిపారు. ఇసుక విధానంపై ఇష్టానుసారంగా తమకు అనుకూలంగా నిర్ణయాలు మార్చుకుంటూ దాదాపు 19 సార్లు జీఓలు ఇచ్చారు. వాస్తవానికి ఉచితంగా ఇసుక ఎవరికీ అందలేదు. అధిక ధర చెల్లించి కొనుక్కోవాల్సిన దుస్థితి కల్పించారు. పొరుగు రాష్ట్రాలకు సైతం పెద్ద ఎత్తున ఇసుకను లారీల్లో తరలించారు. అడ్డుకున్న వారిపై టీడీపీ నేతలు రెచ్చిపోయి దాడులు చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం బాధితులనే తప్పు పట్టడం అప్పట్లో సర్వత్రా చర్చనీయాంశమైంది.


# ముసుగు దోపిడీ

- ఎస్‌హెచ్‌జీలకు ఇసుక రీచ్‌ల బాధ్యతలు అప్పగించిన గత సర్కార్
- మహిళా సంఘాల పేరుతో కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- ఒకే బిల్లుపై వందల టన్నులు తరలించి అక్రమంగా విక్రయాలు
- ఉచితమంటూ దోపిడీకి రాచబాట వేసిన చంద్రబాబు
- రూ.47.50 కోట్లు రీఫండ్ చేయకుండా ఖజానాకు కన్నం
- ఆ అక్రమాలను కడిగేసిన 'కాగ్'

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు మహిళా సంఘాల ముసుగులో అడ్డగోలుగా ఇసుకను తవ్వేసి ఖజానాకు కన్నం వేశారు. ఒకే ఇసుక బిల్లుపై అక్రమంగా తరలించిన వేలాది టన్నులను అధిక ధరలకు విక్రయించి దోచుకున్నారు. మహిళ సంఘాల పేరుతో ఇసుక దందాపై తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో 2016 మార్చి 4న అప్పటి సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం పేరుతో దోపిడీకి టీడీపీ నేతలకు రాచబాట వేశారు. అప్పటివరకు ఇసుక సరఫరా కోసం బుకింగ్ చేసుకుని డబ్బులు కట్టిన వారికి రూ.47.50 కోట్లను వెనక్కి చెల్లించలేదు. ఆ డబ్బులకు లెక్కలు చెప్పలేక గత ప్రభుత్వం నీళ్లు నమిలిందని 2018లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక పేర్కొంది. తద్వారా టీడీపీ నేతల ఇసుక దోపిడీని ఎండగట్టింది.

### ఎల్లో గ్యాంగ్ కనుసన్నల్లో రీచ్‌లు

మహిళా సాధికారత పేరుతో రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల నిర్వహణ, అమ్మకాలను స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అప్పగిస్తూ 2014లో గత సర్కారు ఇసుక విధానాన్ని ప్రకటించింది. ఇసుక విక్రయాల కోసం రాష్ట్ర స్థాయిలో సెర్ప్ (పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో, జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ శాండ్ మైనింగ్ ఫెసిలిటీ ఏజెన్సీస్(డీఎస్ఎంఎఫ్ఏ)లను ఏర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణలో ఇసుక అమ్మకాలకు పోర్టల్ ఏర్పాటైంది. ఇసుక కోసం పోర్టల్‌లో బుక్ చేసుకుని ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తే మహిళా సంఘాలు ఇసుకను సరఫరా చేసేలా రూపొందించిన విధానం కాగితాలకే పరిమితమైంది. మహిళా సంఘాల ముసుగులో టీడీపీ నేతలు ఇసుక రీచ్‌లను తమ అధీనంలోకి తీసుకున్నారు. పోర్టల్‌లో ఇసుక కోసం బుక్ చేసుకున్న ఒకే బిల్లుపై వేలాది టన్నులు అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం కావడంతో 2016 మార్చి 4న దాన్ని రద్దు చేసి ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించారు. అప్పటివరకు ఇసుక కోసం పోర్టల్‌లో బుక్ చేసుకుని సరఫరా చేయని వారికి డబ్బులు రీఫండ్ చేస్తామని పేర్కొంది. ఇందుకోసం 2016–17లో సెర్ప్ రూ.35.52 కోట్లను విడుదల చేయగా రూ.13.57 కోట్లను రీఫండ్ చేశారు. అంటే మిగతా డబ్బులు మిగుల్చుకున్నట్లు స్పష్టమవుతోంది. 2017 ఫిబ్రవరిలో ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి రీఫండ్ చేసేందుకు మరో రూ.25.55 కోట్లను సెర్ప్ విడుదల చేసింది. వాస్తవానికి రీఫండ్ కోసం అప్పటికే విడుదల చేసిన నిధులు మిగిలి ఉండగా మళ్లీ డబ్బులు విడుదల చేయడాన్ని కాగ్ తప్పుబట్టింది. రీఫండ్‌కి సంబంధించి రూ.47.5 కోట్లకు లెక్కలు చెప్పాలని అడిగితే గత సర్కారు నీళ్లు నమిలిందని కాగ్ స్పష్టం చేసింది. దీన్ని బట్టి టీడీపీ నేతలే ఇసుక బుక్ చేసుకుని ఒకే బిల్లుపై వేలాది టన్నులు అక్రమంగా తరలించి డబ్బులు కాజేసినట్లు స్పష్టమవుతోంది.



School Education (Grant No.XII)

ఇసుక బుకింగ్ కోసం చెల్లించిన రూ.47.50 కోట్లను రీఫండ్ చేయకుండా ప్రభుత్వం లెక్కలు చెప్పలేదని తేల్చిన కాగ్ నివేదిక


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 223

శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది.

- వివరాలు VIలో



### విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ విచారణకు పిలవగా.. ఆయన గైర్హాజరయ్యారు.

వివరాలు 6లో ▸



### మొయిత్రా వాకౌట్

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ నైతిక విలువల కమిటీ ముందు విచారణకు హాజరై.. ఆ తర్వాత వాకౌట్ చేశారు.

వివరాలు 6లో ▸



### కేరళ గవర్నర్‌పై సుప్రీంకోర్టుకు..

బిల్లులను ఆమోదించడంలో గవర్నర్ ఆరిఫ్ తీవ్ర జాప్యం చేస్తున్నారని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

వివరాలు 6లో ▸



### పాక్‌లో ఫిబ్రవరి 8న ఎన్నికలు

పాకిస్తాన్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న సాధారణ ఎన్నికలు జరుపుతామని ఆ దేశ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

# నీటి బొట్టు ఒడిసి పట్టి

## సాగు నీరు, వ్యవసాయంపై ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక దృష్టి

## విశాఖ 'ఐసీఐడీ' సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- నీటి పారుదలపై సదస్సు నిర్వహణ శుభ పరిణామం
- ఈ అవకాశం మాకు దక్కడం మా అదృష్టం
- బేసిన్ - బేసిన్ నీటి బదిలీపై ప్రత్యేక చర్చకు వేదిక ఇది
- సీమ, దక్షిణ కోస్తాలో కొన్ని చోట్ల తరచూ కరువు వస్తోంది
- స్వల్ప కాలమే కురిసే వాన నీటిని సంరక్షించి సాగుకు వాడుకోవాలి
- కేంద్ర మంత్రి షెకావత్‌తో కలసి సదస్సును ప్రారంభించిన ముఖ్యమంత్రి
- హాజరైన 90 దేశాలకు చెందిన ప్రతినిధులు
- ప్రకాశం బ్యారేజీకి 'వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్' అవార్డు

2లో



విశాఖలో ఐసీఐడీ సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. చిత్రంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్, ఐసీఐడీ ప్రెసిడెంట్ డా.రగబ్, మంత్రులు, తదితరులు

### బేసిన్ - బేసిన్ నీటి తరలింపుతో..

- నీటి నిర్వహణ సమస్యలకు పరిష్కారాలు సాంకేతికంగా ఆచరణ సాధ్యం కావడంతో పాటు ఆర్థికంగానూ లాభదాయకంగా ఉండాలి.
- సామాజికంగా ఆమోదయోగ్యమైనవి, పర్యావరణ అనుకూలమైన పరిష్కారాలను అన్వేషించాలి.
- సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం మంచివే అయినా వర్షా కాలంలో నీటి తరలింపుపై మరింత విస్తృతంగా చర్చించాలి.
- వర్షాలతో నదులు పరవళ్లు తొక్కే వేళ నీటిని ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు తరలించడం సవాల్‌తో కూడుకున్నదే అయినా తద్వారా సాగు నీటి కొరతను అధిగమించవచ్చు.
- నిర్ణీత వ్యవధిలో ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించడం ద్వారా ఆయా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవచ్చు.
- రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పశ్చిమ ప్రాంతాలు తక్కువ వర్షపాతంతో తరచూ కరువు బారిన పడటం ప్రజల జీవన స్థితిగతులను దెబ్బతీస్తోంది.
- అధిక వర్షాలు, వరదలతో పరీవాహక ప్రాంతాల్లో సంభవిస్తున్న నష్టాలకు సమర్థ నీటి పారుదల నిర్వహణ మాత్రమే మంచి పరిష్కారం చూపుతుంది.
- ప్రధాని చెప్పినట్లుగా 'మోర్ క్రాప్ పర్ డ్రాప్' విధానాన్ని అనుసరిస్తూ వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు కట్టుబడ్డాం.

- ఐసీఐడీ సదస్సులో సీఎం జగన్

## న్యూస్‌రీల్

### ఈనెలా అరకొర వానలే!



సాధారణంగా రాష్ట్రంలో నవంబర్‌లోనూ భారీ వర్షాలు కురుస్తాయి. అయితే ఈసారి ఆశించిన స్థాయిలో వానలు కురిసే పరిస్థితులు లేవని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో మాత్రం సాధారణంకంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

వివరాలు 5లో ▸

### వన్ నేషన్.. వన్ రిజిస్ట్రేషన్



దేశంలోని వైద్యులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయడానికి నేషనల్ మెడికల్ కమిషన్ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జాతీయ వైద్య రిజిస్టర్ రూపొందిస్తోంది. 2024 చివరికల్లా రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అందరినీ ఎన్ఎంఆర్ గొడుగు కిందకు తెచ్చేలా కసరత్తు చేస్తోంది.

వివరాలు 2లో ▸




అదరగొట్టే ఆటతీరుతో భారత జట్టు వన్డే ప్రపంచకప్‌లో అందరికంటే ముందుగా సెమీఫైనల్‌కు చేరింది. ముంబైలో గురువారం శ్రీలంక జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 302 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత జట్టు 357 పరుగులు చేయగా.. శ్రీలంక 55 పరుగులకే కుప్పకూలింది.

7లో

## నీటి పొదుపుతోనే భవితకు భరోసా

- కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- భూగర్భ జల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రపంచవ్యాప్తంగా వాడకంలో ముందు వరుసలో భారత్
- వాటర్ రీసైక్లింగ్‌తో మురుగునీటి శుద్ధి.. ప్రపంచ బ్యాంకు సహకారంతో డ్యామ్‌ల పరిరక్షణ
- నదుల అనుసంధానం వేగవంతం.. ఎంపీ–యూపీలో సత్ఫలితాలు

- వివరాలు 2లో



## జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ విడుదల

- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఈ నెలాఖరు వరకూ దరఖాస్తులకు చాన్స్.. పరీక్షకు 3 రోజుల ముందు హాల్ టికెట్లు
- మెయిన్‌కు భారీగా తగ్గిన సిలబస్
- ఈసారి కాస్త తేలికగానే పేపర్ కూర్పు.. ఫిబ్రవరి 12న ఫలితాలు వెల్లడిస్తామన్న ఎన్‌టీఏ

2లో

## క్లుప్తంగా...

### నేడు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ కేబినెట్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుంది. ఇందులో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

### స్కేటింగ్ క్రీడాకారిణి గ్రీష్మకు సీఎం అభినందన



సీఎం జగన్‌కు మెడల్స్ చూపిస్తున్న అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి గ్రీష్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): అంతర్జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ క్రీడాకారిణి దొంతర గ్రీష్మను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందించారు. గురువారం విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను మధురవాడ హెలీప్యాడ్ వద్ద గ్రీష్మ తన తండ్రితో పాటు కలిశారు. ఈ సందర్భంగా స్కేటింగ్ విభాగంలో తాను సాధించిన విజయాలను సీఎంకు ఆమె వివరించారు. ఇప్పటివరకు జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు 105 మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల చైనాలో జరిగిన ఆసియా స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో 3 పతకాలు సాధించినట్లు వివరించారు. తను సాధించిన మెడల్స్‌ను చూపించగా.. సీఎం జగన్ ఆమెను అభినందించారు. 'శెభాష్ తల్లీ.. జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలి' అంటూ ఆశీస్సులు అందించారు.

### పోలవరం అంచనాలపై త్వరలో కేంద్ర కేబినెట్ నిర్ణయం

**జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడి**

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయంపై త్వరలో కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు. గురువారం విశాఖలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సవరించిన అంచనాలను కేంద్ర జల్‌శక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం అందజేసిందన్నారు. దీనిపై కేంద్ర కేబినెట్ త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పునరావాసం అంశం రాష్ట్ర పరిధిలో ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికను కేంద్రం పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### 'మంగళగిరి-తాడేపల్లి' పరిధిలోని ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ పెంపు

**12 నుంచి 16 శాతానికి పెంచుతూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు**

సాక్షి, అమరావతి: మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలను కలుపుతూ మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జనాభా నిబంధనల ప్రకారం 2.50 లక్షల మంది జనాభా గల ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్ 16 శాతం వర్తింపజేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ జనాభా 2,53,831 మంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 12 శాతం ఇంటి అద్దె అలవెన్స్‌ను 16 శాతానికి పెంచుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మూల వేతనంలో 16 శాతం కానీ, గరిష్టంగా రూ.17,000 గానీ ఇంటి అద్దె అలవెన్స్ ఈ నెల ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### మడ అడవుల పరిరక్షణకు చర్యలు చేపట్టండి: సీఎస్

సాక్షి, అమరావతి: మడ అడవుల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ అధ్యక్షతన కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా) 20వ స్టీరింగ్ కమిటీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మడ అడవులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడటం, తీర ప్రాంత జిల్లాల్లో అవకాశం ఉన్నచోట్ల మడ అడవుల పెంపకానికి తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు పీసీసీఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అజెండా అంశాలను వివరిస్తూ 2022–23 వార్షిక ప్లాన్ ఆఫ్ ఆపరేషన్స్ అమలుకు తీసుకున్న చర్యలను వివరించారు. కాంపా 2023–24 వార్షిక ప్లాన్ ఆఫ్ ఆపరేషన్స్ సంబంధించి రూ.259 కోట్ల ప్లాన్‌ను నేషనల్ అథారిటీ ఆఫ్ కాంపా ఆమోదానికి సమర్పించామని తెలిపారు. కాంపా పీసీసీఎఫ్ బీకే సింగ్, ఏపీ పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే తదితరులు పాల్గొన్నారు.

# నీటి బొట్టు ఒడిసి పట్టి

**సాగు నీరు, వ్యవసాయంపై ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక దృష్టి ● విశాఖ 'ఐసీఐడీ' సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్**



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్





ప్రకాశం బ్యారేజీకి వచ్చిన వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్ అవార్డును సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా అందుకుంటున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రతి నీటి బొట్టూ ఒడిసి పట్టి సాగు అవసరాలను తీరుస్తూ వ్యవసాయ దిగుబడులను పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి రంగం, వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. నీటి కొరతను అధిగమించేందుకు ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదిలో తక్కువ కాలం మాత్రమే కురిసే వాన నీటిని ఒడిసి పట్టి ఆయకట్టుకు అందించడం ద్వారా కరువును సమర్థంగా నివారించవచ్చన్నారు. గురువారం విశాఖపట్నంలో 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సీఎం జగన్ ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 90 దేశాలకు చెందిన ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. సుస్థిర వ్యవసాయం, నీటి నిర్వహణకు గట్టి కృషి చేస్తున్న ఐసీఐడీ సదస్సును రాష్ట్రంలో నిర్వహించడం గర్వంగా ఉందని, ప్రశాంతమైన విశాఖ నగరం అతిథులకు చక్కటి అనుభూతి అందించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. నీటి నిర్వహణలో సరికొత్త మార్గాలపై సదస్సులో చర్చించడం ద్వారా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

#### సుస్థిర సాగు కోసం

ప్రతిష్టాత్మక 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సును ఈనెల 4 వరకు, 74వ అంతర్జాతీయ కార్యనిర్వాహక కమిటీ (ఐఈసీ) సమావేశాన్ని 5వ తేదీ నుంచి 8 వరకు మొత్తంగా ఎనిమిది రోజులపాటు అందమైన విశాఖ నగరంలో నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం. ప్రతిష్టాత్మక సదస్సు నిర్వహణపై మా ప్రతిపాదనను అంగీకరించినందుకు ఇండియన్ నేషనల్ కమిషన్ ఫర్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐఎన్‌సీఐడీ), కేంద్ర ప్రభుత్వానికి, ఐసీఐడీకి చెందిన ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి కృతజ్ఞతలు. నీటి నిర్వహణ ద్వారా సుస్థిర వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటైన ఈ ఫోరం నీటి పారుదల, డ్రైనేజ్, వరద నిర్వహణలో అందిస్తున్న సహకారం ప్రశంసనీయం.

#### 'మోర్ క్రాప్ పర్ డ్రాప్'

వ్యవసాయం, నీటి పారుదల రంగాల్లో ఆంధ్రప్రదేశ్ శతాబ్దాలుగా గొప్ప వారసత్వాన్ని కలిగి ఉంది. రాష్ట్రంలో ప్రధాన, మధ్య తరహా, చిన్న నదులు 40 వరకు ఉన్నాయి. కరువు పీడిత, మెట్ట ప్రాంతాలలో నీటి పారుదల సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి ప్రధానమంత్రి సూచించిన విధంగా 'మోర్ క్రాప్ పర్ డ్రాప్' అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. తద్వారా ప్రతీ నీటి బొట్టుకు వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.

#### దిగువ రాష్ట్రం కావడంతో

రాష్ట్రానికి సువిశాల తీర ప్రాంతం ఉన్నా రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పశ్చిమ ప్రాంతాలు తక్కువ వర్షపాతం కారణంగా తరచుగా కరువు బారిన పడుతున్నాయి. ఆ ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులను ఇది దెబ్బతీస్తోంది. ఆంధ్రప్రదేశ్ దిగువ నదీ తీర రాష్ట్రం కావడంతో వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా లాంటి ప్రధాన అంతర్రాష్ట్ర నదీ పరీవాహక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు నీటి కొరత సమస్య ఎదురవుతోంది. అధిక వర్షాలు, వరదల వల్ల ఈ నదుల పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర నష్టాలను చవి చూస్తున్నాం. సమర్థ నీటి పారుదల నిర్వహణ మాత్రమే దీనికి మంచి పరిష్కారం చూపుతుంది.

#### అనుసంధానమే పరిష్కారం

నీటి కొరత గురించి ప్రస్తావించినప్పుడు మైక్రో ఇరిగేషన్, స్ప్రింక్లర్స్ గుర్తుకొస్తాయి. నీటిని ఎలా వినియోగించుకోవాలనేందుకు ఈ తరహా ఆలోచనలు అవసరమే. అయితే నా ఉద్దేశం ప్రకారం వర్షా కాలంలో నీటి బదలాయింపు అంశంపై మరింత విస్తృతంగా చర్చ జరగాలి. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలు వర్షా కాలం. ఈ సీజన్‌లో వర్షాలు కురిసి నదులు వరదతో ప్రవహిస్తూ ఉంటాయి. వర్షాలు కురిసే కాలం తక్కువగా ఉన్నా వర్షపాతం అధికంగానే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో నీటిని ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు తరలించడం సవాల్‌తో కూడుకున్నది. అయినప్పటికీ దీని ద్వారా మాత్రమే వ్యవసాయ రంగంలో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చన్నది నా గట్టి నమ్మకం. నిర్ణీత కాల వ్యవధిలో ఇలా ఒక బేసిన్ నుంచి మరొక బేసిన్‌కు నీటిని తరలించగలిగితే ఆయా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చు. కాలువల ద్వారా అత్యంత తక్కువ ఖర్చుతో ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించగలుగుతాం. దీనిపై ఈ సమావేశంలో చర్చ జరగాలని కోరుకుంటున్నా.

#### ఆమోదయోగ్య మార్గాలపై దృష్టి

నీటి నిర్వహణకు సంబంధించిన అన్ని సమస్యలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చిస్తారని భావిస్తున్నా. అయితే సాంకేతికంగా సాధ్యం కావడంతో పాటు ఆర్థికంగా లాభదాయకమైన పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఈ పరిష్కారాలు సామాజికంగా ఆమోదయోగ్యంగా, పర్యావరణ అనుకూలంగా ఉండాలని ఆశిస్తున్నా. నీటి పారుదల, వరద నిర్వహణ రంగాలపై ఈ సదస్సులో జరిగే చర్చలు, ఆలోచనలు, సిఫారసులు భవిష్యత్తుపై శాశ్వత ప్రభావాన్ని చూపుతాయని గాఢంగా విశ్వసిస్తున్నా.

### ప్రకాశం బ్యారేజీకి ప్రతిష్టాత్మక అవార్డు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో డెల్టా రైతాంగానికి సాగునీటిని అందిస్తున్న ప్రకాశం బ్యారేజీకి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ ఏడాది ప్రపంచ వారసత్వ నీటి పారుదల నిర్మాణాల అవార్డుల కోసం అందిన నామినేషన్లలో 19 నిర్మాణాలను ఎంపిక చేశారు. వీటిలో మన దేశం నుంచి నాలుగు నిర్మాణాలకు ఈ అవార్డు దక్కింది. అందులో ప్రకాశం బ్యారేజీకి చోటు దక్కింది. విశాఖలో ఐసీఐడీ సదస్సు సందర్భంగా అవార్డును జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డిలకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సీఎం జగన్ కలసి అందించారు. తమిళనాడులోని శ్రీవైకుంఠం ఆనకట్ట, ఒడిశాలోని బలిదా ఇరిగేషన్ జయమంగళ ఆనకట్టలకు కూడా ఈ అవార్డులు లభించాయి.

# నీటి పొదుపుతోనే భవితకు భరోసా

## కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: పెరుగుతున్న నీటి అవసరాల నేపథ్యంలో భూగర్భ జల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అందించగలమన్నారు. మురుగు నీటిని శుద్ధి చేయడం ద్వారా తిరిగి సాగునీటికి, పరిశ్రమలకు అందించేలా రీ సైక్లింగ్ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. చెరువులు, కుంటలను సంరక్షిస్తూ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో డ్యామ్‌ల పరిరక్షణకు ప్రధాని మోదీ సూచనల మేరకు ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గురువారం విశాఖపట్నంలో 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ (ఐసీఐడీ) సదస్సును సీఎం జగన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. అతి సుందరమైన విశాఖ నగరం దీనికి వేదిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఐసీఐడీ కాంగ్రెస్‌కు ఆతిథ్యమిచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి షెకావత్ ఏమన్నారంటే..

#### 140 బిలియన్ డాలర్ల వ్యయం

వ్యవసాయ రంగంలో నీటి కొరతను అధిగమించేందుకు బహుళ విధానాలతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సాగునీటి రంగంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది. అయితే సరైన ప్రణాళిక లేకుంటే వ్యవసాయ ఉత్పాదకత దెబ్బతినడంతో పాటు కరువు పరిస్థితులు కూడా ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో సాగు నీటికి అనుబంధంగా ఉన్న అన్ని విభాగాలను 2019లో ప్రధాని మోదీ జలశక్తి శాఖ ఆధీనంలోకి తెచ్చారు. 2024 నాటికి సాగునీరు, పారిశుద్ధ్య రంగాలపై 140 బిలియన్ డాలర్లను వెచ్చించాలని నిర్ణయించాం. దేశంలో సాగు విస్తీర్ణం గత 75 ఏళ్లలో మూడింతలు పెరిగి 140 మిలియన్ హెక్టార్లకు చేరింది. దిగుమతి చేసుకునే దశ నుంచి ఈ రోజు తిండి గింజల్లో మిగులు దేశంగా మారడంలో సాగునీటి రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

#### 54 ప్రాజెక్టులు..

నీటి వనరులను అవసరాల మేరకు వినియోగించుకునేందుకు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. దేశంలో 1971లో 111 బిలియన్ క్యూబిక్ మీటర్ల సామర్థ్యం ఉండగా నేడు 250 బిలియన్ క్యూబిక్ మీటర్లకు చేరింది. 2023 మార్చిలో ప్రధాని మోదీ 54 ప్రాజెక్టులను ప్రారంభించి అదనంగా 25 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించడం ద్వారా రెండు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చారు. గత రెండు దశాబ్దాల్లో పట్టణీకరణ, జనాభా పెరుగుదల నేపథ్యంలో దేశంలో తలసరి నీటి లభ్యత 20 శాతం తగ్గింది. 2050 నాటికి మరో 20 శాతం తగ్గనుందని అంచనాలున్నాయి. నీటి వినియోగాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు 2022లో బ్యూరో ఆఫ్ వాటర్ ఎఫిషియన్సీని నియమించాం. 48,500 కి.మీ. మేర మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేశాం. తద్వారా 28,000 హెక్టార్ల భూ సేకరణను తగ్గించాం.

#### నీటి శుద్ధిపై దృష్టి

నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంలో భాగంగా మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి వాడుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నీటిని సాగు నీటికి, పరిశ్రమలకు ఉపయోగించుకోవడంపై దృష్టి సారించాం. ఇందుకోసం దేశవ్యాప్తంగా వాటర్ రీ–సైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నాం. అమెరికా, చైనా కలిపి వినియోగిస్తున్న భూగర్భ నీటి వనరుల కంటే మనం ఎక్కువగా వినియోగిస్తున్నాం. ప్రపంచంలోనే భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్న దేశాల్లో మనం ముందు వరుసలో ఉన్నాం. భూగర్భ జలాలను పెంచేందుకు వీలుగా మొత్తం 2.4 మిలియన్ చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని గుర్తించాం. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచేందుకు మ్యాపింగ్ పూర్తి చేశాం. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు 2019లో జలశక్తి అభియాన్ పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. పూడిక తొలగించి వర్షపు నీటిని ఒడిసిపట్టుకునేందుకు 10 వేల మిలియన్ పనులను పూర్తి చేశాం.

#### నదుల అనుసంధానం..

జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షాలు కురిసే సమయంలో సాధ్యమైనంత నీటిని ఒడిసి పట్టుకునేందుకు నదుల అనుసంధానాన్ని ప్రారంభించాం. నీటి లభ్యత ఎక్కువ ఉన్న ప్రాంతాల నుంచి తక్కువ ఉన్న చోట్లకు తరలించే ప్రయత్నం చేస్తున్నాం. సాగునీటి రంగం రాష్ట్ర పరిధిలోది కావడం వల్ల వాటి సహకారం ఎంతో అవసరం. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయు) చేసుకున్నాయి. కెన్, బెత్వా నదుల అనుసంధానంతో మిలియన్ హెక్టార్లకు సాగునీటితోపాటు వెనుకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని 6.2 మిలియన్ జనాభాకు తాగునీరు లభించనుంది.

#### డ్యామ్‌ల రక్షణకు ప్రత్యేక చర్యలు

దేశంలో జలాశయాల నిర్మాణం ఎప్పటి నుంచో ఉంది. కావేరి నదిపై చోళుల కాలంలో 2 వేల ఏళ్ల క్రితం నిర్మించిన కల్లాని డ్యామ్ ఇప్పటికీ ఉంది. దేశంలో మొత్తం 6,000 భారీ డ్యామ్‌లున్నాయి. 2020లో డ్యాం సేఫ్టీ చట్టాన్ని తీసుకొచ్చాం. ప్రపంచబ్యాంకు సహకారంతో 1.2 బిలియన్ డాలర్లతో దేశవ్యాప్తంగా 736 డ్యాంల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి దశలో ఏడు రాష్ట్రాల్లో 223 డ్యామ్‌ల హైడ్రలాజికల్, స్ట్రక్చరల్, ఆపరేషనల్ రక్షణ చర్యలను పరిశీలించాం. డ్యామ్‌ల రక్షణతో పాటు నీటి వనరుల వినియోగంపై ఐసీఐడీ చర్చించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే సూచనలు చేస్తుందని భావిస్తున్నా.



ఐసీఐడీ ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి షెకావత్ తదితరులు

### నదీ జలాలతో 'జల్ భరో'

విశాఖ ఐసీఐడీ సదస్సు సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ నదుల నుంచి సేకరించిన జలాలను మట్టి కుండల్లో నింపి 'జల్ భరో' పేరుతో ఒకే చోట చేర్చారు. కేంద్ర మంత్రి షెకావత్, ముఖ్యమంత్రి జగన్, మంత్రులు అంబటి రాంబాబు, అమర్‌నాథ్, విడదల రజని మట్టి కుండల్లో ఉన్న నీటిని తరలించి ఒక చోట చేర్చారు. 25 ఐసీఐడీ అంతర్జాతీయ కాంగ్రెస్ యాబ్‌స్ట్రాక్ట్ వాల్యూమ్‌తో పాటు హిస్టారికల్ వాటర్ సస్టైనబిలిటీ, వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్స్ వాల్యూమ్‌ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సదస్సులో తొలి రోజు సంప్రదాయేతర నీటి వనరులు, రైతు సాధికారత, సుస్థిర లక్ష్యాలు, వ్యవసాయ రంగంలో నీటి వనరుల వినియోగం తదితర అంశాలపై వివిధ దేశాలకు చెందిన ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి.

### 56 దేశాలు... 147 పరిశోధన పత్రాలు

1950లో ఏర్పడిన ఐసీఐడీ పరిశోధనలను మనం వినియోగించుకుంటున్నాం. 74 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది. 2025 నాటికి పెరగనున్న 9.8 బిలియన్ జనాభాకు అనుగుణంగా నీటి వనరులను వాడుకోవడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంపై సదస్సులో చర్చించాలి. నీటి వినియోగంపై 56 దేశాలకు చెందిన ప్రతినిధులు 147 పరిశోధన పత్రాలను సమర్పిస్తారు. సమస్యను పరిష్కరించేందుకు ఇవి ఎంతో దోహదం చేస్తాయని విశ్వసిస్తున్నాం. ఈ సదస్సుకు సుందర నగరం విశాఖ కేంద్రం కావడం ఎంతో సంతోషంగా ఉంది.

–ప్రొఫెసర్ డాక్టర్ రగబ్, ఐసీఐడీ ప్రెసిడెంట్

### పర్యావరణ సమతుల్యతపై దృష్టి

నీటి వనరులను పొదుపుగా వాడుకునేందుకు ఈ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తిండి గింజల ఉత్పత్తిని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి.

–కుష్విందర్ వోహ్రా, ఐసీఐడీ వైస్ ప్రెసిడెంట్

# కేసీఆర్‌వి ఎన్నికల వ్యాఖ్యలే

- రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్నారు
- పెన్షన్ విషయంలో వైఎస్ జగన్‌ని అనుసరిస్తున్నట్లు కేసీఆరే చెప్పారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నందునే ఆ రాష్ట్ర సీఎం కేసీఆర్ ఏపీ గురించి మాట్లాడుతున్నారేమో అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన గురువారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని వస్తుండగా మీడియా ప్రతినిధులు కేసీఆర్ వ్యాఖ్యల గురించి ప్రశ్నించారు. దీనికి సజ్జల స్పందిస్తూ.. ఎన్నికల్లో గొప్పగా చెప్పుకోవడానికి కేసీఆర్ చిన్నచిన్న రోడ్ల గురించి మాట్లాడి ఉండవచ్చని అన్నారు. మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో సుపరిపాలన అందిస్తోందని, ప్రజల ప్రశంసలు అందుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో తెచ్చిన పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పింఛన్ పథకాన్ని కేసీఆరే మెచ్చుకొన్నారని, వైఎస్ జగన్‌లాగా పెన్షన్ అందిస్తామని ఈమధ్యనే చెప్పారని అన్నారు. పోలవరం విలీన మండలాల ప్రజలను మళ్లీ తెలంగాణలో కలుస్తారా.. అని అడిగితే వెళ్లబోమని అంటున్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు నచ్చాయని వారు చెబుతున్నారని చెప్పారు. తాము పక్క వారి గురించి ఎప్పుడూ మాట్లాడబోమని తెలిపారు.

#### బాబు ర్యాలీలో అంతా అదే వర్గం

బుధవారం హైదరాబాద్‌లో చంద్రబాబు ర్యాలీకి వచ్చిన వారంతా పచ్చ కార్యకర్తలు మాత్రమేనని సజ్జల చెప్పారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అంతకంటే ఎక్కువ మంది ప్రజలు వస్తున్నారని తెలిపారు. లోకేశ్ పాదయాత్రలో ఏనాడైనా జనం కనిపించారా అని ప్రశ్నించారు. రోగం వచ్చిందని కోర్టుకు చెప్పి జైలు నుంచి బయటకు వచ్చిన వ్యక్తి 14 గంటలపాటు కారులో ఎలా కూర్చున్నారని మాత్రమే తాము అడిగామన్నారు. జబ్బులు ఉన్నాయని, ఆరోగ్యం బాగోలేదని కోర్టుకు అబద్ధాలు చెప్పారన్నారు. కోర్టు నిబంధనలను చంద్రబాబు పాటించలేదని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు.

# వన్ నేషన్.. వన్ రిజిస్ట్రేషన్

- దేశంలోని ప్రతి డాక్టర్‌కు విశిష్ట గుర్తింపు ఐడీ
- జాతీయ వైద్య రిజిస్టర్ అమల్లోకి తేనున్న ఎన్‌ఎంసీ
- త్వరలో పైలట్ ప్రాజెక్టుగా రిజిస్ట్రేషన్‌ల ప్రారంభం

సాక్షి, అమరావతి: దేశంలోని వైద్యులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయడానికి నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జాతీయ వైద్య రిజిస్టర్ (ఎన్‌ఎంఆర్) రూపొందిస్తోంది. వన్ నేషన్.. వన్ రిజిస్ట్రేషన్ తరహాలో 2024 ఆఖరుకు దేశంలోని రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అందరిని ఎన్‌ఎంఆర్ గొడుగు కిందకు తెచ్చేలా కసరత్తు చేస్తోంది. చాలా రోజులుగా ఈ విధానం అమలు చేయాలనే ప్రతిపాదన ఉంది. అయితే, ఎన్‌ఎంఆర్ పైలట్ ప్రాజెక్ట్‌ను ఆరు నెలల్లో చేపడతామని ఎన్‌ఎంసీ బోర్డ్ సభ్యుడు డాక్టర్ యోగేంద్ర మాలిక్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఇండియన్ మెడికల్ రిజిస్టర్ స్థానంలో ఎన్‌ఎంఆర్ అమల్లోకి రానుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో 13 లక్షల మందికిపైగా డాక్టర్లు వైద్య మండలిలో నమోదు చేసుకున్నారు. ఎన్‌ఎంఆర్ అమల్లోకి వస్తే కేంద్రీకృత డేటాబేస్ అందుబాటులోకి వస్తుంది. ఇప్పటివరకు నమోదు చేసుకున్న 13లక్షల మంది వైద్యుల్లో ప్రస్తుతం ఎంతమంది క్రియాశీలకంగా సేవలు అందిస్తున్నారన్న దానిపై ఒక అవగాహన రావడంతోపాటు నమోదులో డూప్లికేషన్స్, నకిలీలకు చెక్ పడనుంది.

# నాపై భూకబ్జా ఆరోపణలు టీడీపీ వాళ్ల పనే

- సీఎంను కలసి అన్నీ వివరించాను
- కబ్జాలపై సిట్ విచారణ కోరిందే నేను
- ముఖ్యమంత్రి జగన్ వెంటే ఉంటాను
- మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



సాక్షి, అమరావతి: తమ జిల్లా ప్రజలకు న్యాయం జరిగితే తాను సంతృప్తి చెందినట్లేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శాసన సభ్యుడు బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను గతంలోనే ఖండించానని చెప్పారు. గురువారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. 'ఒంగోలులో భూకబ్జాకు సంబంధించి నాపై వచ్చిన ఆరోపణలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరణ ఇచ్చాను. పార్టీలో నాకు వ్యతిరేకంగా కొందరు వ్యవహారాలు చేస్తున్నారని సీఎంకు చెప్పాను. ప్రకాశం జిల్లా రాజకీయాలపై చర్చించాను. జిల్లాలో నాకున్న రాజకీయ ఇబ్బందులు వివరించాను. ఒంగోలులో నకిలీ స్టాంపులు తయారు చేసి భూములు ఆక్రమించారు. ఈవిషయంలో ఎస్పీని నేను అడిగితే సిట్ వేశారు. కొన్ని రోజులు విచారణ చేశాక టీడీపీ వాళ్లు నాపై ఆరోపణలు చేశారు. భూకబ్జాల్లో నా అనుచరులు ఉన్నారని, నాకు, మా అబ్బాయికి సంబంధం ఉందని కొందరు మీడియాకు చెప్పారు. ఎవరో చేసిన దానికి నాపై కొందరు దుష్ప్రచారం చేశారు. భూకబ్జా కేసులో సిట్ ఇప్పటికే 30 నుంచి 40 మందిని అరెస్టు చేసింది. వైఎస్ విజయమ్మ మా ఇంటికి వచ్చినప్పుడు ఓ చానల్లో వచ్చిన ఆరోపణలను ఆరోజే ఖండించాను. నేను టీడీపీలోకి వెళతాను అనే అనుమానం ఆపార్టీ నేత దామచర్ల జనార్దన్‌కే ఉన్నట్టుంది. ఆయనకు టీడీపీలో సీటు ఇవ్వరేమో అని నాపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. నేను సీఎం జగన్ వెంటే ఉంటా' అని చెప్పారు.

# జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ విడుదల

- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఈ నెలాఖరు వరకూ దరఖాస్తులకు చాన్స్
- పరీక్షకు 3 రోజుల ముందు హాల్ టిక్కెట్లు
- మెయిన్స్‌కు భారీగా తగ్గిన సిలబస్
- ఈసారి కాస్తా తేలికగానే పేపర్ కూర్పు
- ఫిబ్రవరి 12న ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బుధవారం అర్ధరాత్రి విడుదల చేసింది. గురువారం ఉదయం నుంచి మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగుతుంది. పరీక్ష కేంద్రాలను జనవరి రెండో వారంలో వెల్లడిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరీక్షకు మూడు రోజుల ముందు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. దేశంలోని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ప్రవేశానికి రెండు దశల ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌కు అర్హత కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకును బట్టి ఐఐటీల్లో సీట్లు వస్తాయి. మిగతా జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. తొలి దశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకూ ఉంటుంది. రెండో దశ ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏ సెషన్‌కైనా, లేదా రెండింటికీ దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫలితాలను ఫిబ్రవరి 12వ తేదీన వెల్లడిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. తెలుగు సహా మొత్తం 13 భాషల్లో జేఈఈ మెయిన్ పరీక్ష ఉంటుంది.

#### ప్రతీ సబ్జెక్టులోనూ 10 టాపిక్స్, ఫిజిక్స్‌లో 12 టాపిక్స్ తీసివేత

కోవిడ్ సమయంలో ఎన్‌సీఈఆర్టీ, సీబీఎస్ఈ సిలబస్‌ను కుదించారు. దీంతో కొన్ని టాపిక్స్‌లో బోధన జరగలేదు. ఇది దృష్టిలో ఉంచుకుని జేఈఈ మెయిన్ సిలబస్‌లోనూ ఈసారి భారీ మార్పులు చేశారు. మేథ్స్, కెమెస్ట్రీ సబ్జెక్ట్‌ల్లో పది చొప్పున, ఫిజిక్స్‌లో 12 చొప్పున టాపిక్స్‌ను జేఈఈ మెయిన్స్‌లో ఇవ్వకూడదని నిర్ణయించారు. జేఈఈ పరీక్ష కఠినంగా ఉంటోందనే సంకేతాలు రావడంతో ఈసారి పరీక్ష పేపర్ కూర్పులోనూ మార్పులు చేశారు. ముఖ్యంగా గణితంలో సుదీర్ఘ పద్ధతిలో సమాధానాలు రాబట్టే ప్రశ్నల నుంచి కొంత వెసులుబాటు ఇచ్చారు. మేథ్స్‌లో కఠినంగా భావిస్తున్న ట్రిగ్నామెట్రిక్స్ ఈక్వేషన్స్, మేథమెటికల్ రీజనింగ్‌ను తొలగించారు. దీనివల్ల సమాధానాలు రాబట్టేందుకు సమయం కలిసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## ఏపీ విద్యా సంస్కరణలకు ప్రపంచ దేశాల ప్రశంస


ఏపీ విద్యా సంస్కరణలను వివరిస్తున్న సురేష్ కుమార్

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలను అనేక దేశాల మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ అధికారులు ప్రశంసిస్తున్నారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. నెదర్లాండ్స్‌లోని యుట్రెచ్ట్‌లో జరుగుతున్న 'గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్ కాన్ఫరెన్స్–2023'లో భారత ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. గురువారం జరిగిన ప్యానెల్ చర్చలో ఈజిప్ట్, బుర్కినఫాసో, ఫిలిప్పీన్స్, కిర్గిజిస్తాన్‌తోపాటు భారత్ తరఫున పాల్గొన్న సురేష్‌కుమార్ విద్యాభివృద్ధికి మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు, ఆవిష్కరణలు, సాధించిన ఫలితాలను ఆయా దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. విద్యారంగంలో 'ఆంధ్రప్రదేశ్ ఎలా విజయం సాధించగలిగింది' అని ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు.. బదులిస్తూ 'ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అద్భుతమైన ఎస్సీఈఆర్టీ, జిల్లా విద్యా శాఖాధికారులు, డీఎస్‌వోలతో పాటు భాగస్వామ్య సంస్థలైన అఫ్లాటౌన్ ఇంటర్నేషనల్, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, రీప్ బెనిఫిట్ సహకారంతో సాధ్యమైంద'ని చెప్పారు. అనంతరం సురేష్‌కుమార్ యునిసెఫ్, ది గ్లోబల్ ఫైనాన్షియల్ లిట్రసీ ఎక్సలెన్స్ సెంటర్ చర్చల్లో పాల్గొన్నారు.

## 'స్కిల్' శిక్షకులకు ఆహ్వానం

**ఏపీఎస్ఎస్‌డీసీలో 2,000మంది నైపుణ్య శిక్షకులు అవసరం**

- 20 రంగాలకు చెందిన 44కు పైగా జాబ్ రోల్స్‌లో శిక్షణ
- ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్న ఏపీఎస్ఎస్‌డీసీ
- శిక్షణ కోసం ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి: ఎండీ వినోద్

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన 192 స్కిల్ హబ్స్, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుచేసిన మరో 26 స్కిల్ కాలేజీలు, ఒక స్కిల్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి ఔత్సాహికుల నుంచి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రతి జాబ్ రోల్‌కు ఒక సర్టిఫైడ్ ట్రైనర్ చొప్పున మొత్తం 2,000 మంది శిక్షకులు అవసరమవుతారని ఏపీఎస్ఎస్‌డీసీ అంచనా వేసింది. అర్హత కలిగిన అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ తరగతులపై ట్రైనింగ్ ఇచ్చి శిక్షకులుగా ఎంపిక చేస్తామని, ఇందుకు సంబంధించిన నిర్వహణ విధివిధానాలు (ఎస్‌వోపీ)ని రూపొందించినట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో వినోద్‌కుమార్ గురువారం 'సాక్షి'కి తెలిపారు. ఆసక్తిగలవారికి కేంద్ర నైపుణ్య శిక్షణ ఎన్ఎస్‌క్యూఎఫ్ ప్రమాణాల ప్రకారం నైపుణ్య శిక్షణ ఇచ్చే విధంగా ఉచితంగా ట్రైనింగ్ ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత శిక్షకులుగా సర్టిఫికెట్ జారీచేసి ఏపీఎస్ఎస్‌డీసీ ఎంపానల్‌మెంట్‌లో నమోదు చేస్తామని చెప్పారు. మొత్తం 20 రంగాలకు చెందిన 44 జాబ్ రోల్స్‌లో శిక్షకులను నియమించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏపీఎస్ఎస్‌డీసీ పోర్టల్ https://skilluniverse.apssdc.in/user&registrationలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకుని ఎంపికైన అభ్యర్థులను ఏపీ స్కిల్ యూనివర్సల్ పోర్టల్ లేదా యాప్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణ అవసరమైనప్పుడు వీరు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని, శిక్షణా వ్యయంలో సుమారు 13 శాతం వరకు శిక్షకులకు పారితోషికంగా ఇస్తామని, కోర్సును బట్టి వీటి ఫీజులు మారుతుంటాయని వినోద్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టం తీసుకురావడమే కాకుండా దానికి అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడానికి పిరమిడ్ ఆకృతిలో ఒక ఎకో సిస్టమ్‌ను రూపొందించారు. ఇంటర్మీడియెట్‌లోపు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ హబ్స్, ఆపైన విద్యార్థులకు స్కిల్ కాలేజీలు, హైఎండ్ స్కిల్ శిక్షణ కోసం స్కిల్ యూనివర్సిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## డిసెంబర్‌లో కేఎల్ వర్సిటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

**అమరావతి:** 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి విజయవాడ, హైదరాబాద్‌లలో కేఎల్ వర్సిటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను నిర్వహించనుంది. గురువారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కార్యాలయంలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తొలి విడతలో డిసెంబర్ 15–18 వరకు జాతీయస్థాయిలో ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు తెలిపారు.



## విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం తోడ్పాటు

**ఏపీ విదేశీ విద్య కో–ఆర్డినేటర్ డాక్టర్ అన్నవరపు కుమార్**


మాట్లాడుతున్న డాక్టర్ అన్నవరపు కుమార్

**కనిగిరి రూరల్:** అమెరికాలో చదువుకోవడానికి అపారమైన అవకాశాలతోపాటు స్కాలర్‌షిప్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విదేశీ విద్య కో–ఆర్డినేటర్ డాక్టర్ కుమార్ అన్నవరపు అన్నారు. ప్రకాశం జిల్లా సీఎస్ పురంలోని కదిరి బాబూరావు అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కాలేజీలో గురువారం 'అమెరికా విద్య–సలహాలు–సూచనలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు విదేశీ విద్యను చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూర దృష్టితో విదేశీ విద్యా విభాగాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా విదేశాల్లో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఏం చదవాలి.. ఎక్కడ చదవాలి... ఎక్కడెక్కడ ఏయే అవకాశాలు ఉన్నాయి... వంటి అంశాల్లో విదేశీ వర్సిటీలకు, విద్యార్థులకు మధ్య ఏపీ విదేశీ విద్యా విభాగం అనుసంధానకర్తగా వ్యవహరిస్తోందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, కదిరి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనాలకు ప్రత్యేక పోర్టల్

**డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం**

**సాక్షి, అమరావతి:** కళాశాలలు, యూనివర్సిటీల విద్యార్థులకు అందించే 'సెంట్రల్ సెక్టార్ స్కీం స్కాలర్‌షిప్'లకు దరఖాస్తు కోసం ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి వచ్చినట్లు ఇంటర్మీడియెట్ విద్యామండలి కమిషనర్ సౌరభ్ గౌర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సెంట్రల్ సెక్టార్ స్కీం స్కాలర్‌షిప్ కోసం డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ సమాచారాన్ని డీవీఈవోలు, ఆర్ఐవోలు అన్ని మేనేజ్‌మెంట్స్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు తెలియజేయాలన్నారు. విద్యార్థుల డేటాను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని, వివరాల ఆధారంగా http://www.scholarships.gov.in వెబ్‌సైట్‌లో స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎవరు విశ్వాసి అయి, పరలోక సుఖాన్ని కోరి దానికై చేయవలసిన విధంగా కృషి చేస్తాడో, అలాంటివారి కృషి స్వీకరించబడుతుంది.
– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 3 నవంబర్ 2023

# మరో నిఘా నేత్రం?

నిత్యం ఏవో కళ్ళు మనల్ని గమనిస్తున్నాయంటే ఎలా ఉంటుంది? చేతిలోని మన చరవాణి సైతం చటుక్కున ప్రత్యర్థిగా మారిపోయే ప్రమాదం ఉందని తెలిస్తే ఏమనిపిస్తుంది? ఫోన్లలోని కీలక సమాచారాన్ని చేజిక్కించుకొనేందుకు 'పాలకవర్గ ప్రాయోజిత ఎటాకర్లు' ప్రయత్నిస్తున్నారంటూ ఆపిల్ సంస్థ అక్టోబర్ 31న పంపిన అప్రమత్తపు ఈ-మెయిల్స్‌తో అదే జరిగింది. ఐ-ఫోన్లు వాడుతున్న పలువురు ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులే కాదు... ప్రపంచమంతా ఉలిక్కిపడింది. వ్యక్తిగత డేటా, గోప్యతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందంటూ దేశవ్యాప్తంగా ఆపిల్ ఐ-ఫోన్ వినియోగదారులు పలువురికి ఇలా పారాహుషార్ సందేశాలు అందడం తేలికైన విషయమేమీ కాదు. సహజంగానే కేంద్ర ఐటీ శాఖ మంత్రి ప్రభుత్వం హ్యాకింగ్‌కు పాల్పడుతోందనే ఆరోపణల్ని కొట్టిపారేశారు. దీనిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. ఈ అప్రమత్తత నోటిఫికేషన్లు పంపిన టెక్ దిగ్గజం ఆపిల్‌కు నోటీసులిచ్చి, సహకరించాల్సిందిగా కోరారు.

ఫోన్లు – కంప్యూటర్ల హ్యాకింగ్, పాలకపక్షాల గూఢచర్యం ఆధునిక సాంకేతిక యుగం తెచ్చిన అతి పెద్ద తలనొప్పి. ఇది అనేక దేశాల్లో గుట్టుగా సాగుతూనే ఉంది. పులు కడిగిన ముత్యాలమని చెప్పుకొనే పాలకవర్గాలు ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నా యన్నది కీలకం. డేటా లీకేజీలు, గూఢచర్య సాఫ్ట్‌వేర్ వినియోగాలు మనకూ కొత్త కావు. దేశంలో ఇజ్రాయెలీ గూఢచర్య సాఫ్ట్‌వేర్ 'పెగసస్' వినియోగం సహా పలు ఆరోపణలపై గతంలో విచారణలు జరిగాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగబోవని హామీలూ వచ్చాయి. అన్నీ నీటిమూటలే. పెగసస్ సాఫ్ట్‌వేర్ కొనలేదని ప్రభుత్వం తోసిపుచ్చినా, కొత్త గూఢచర్య సాఫ్ట్‌వేర్ల కొనుగోలుకు భారత్ ఉత్సుకత చూపుతుందని విదేశీ పత్రికల్లో విశ్వసనీయ కథనాలు వచ్చాయి. సుప్రీం కోర్ట్ నియమించిన కమిటీ కొన్ని ఫోన్లను పరిశీలించి, పెగసస్ వినియోగంపై కచ్చితమైన సాక్ష్యాధారాలు లభించలేదని చెబుతూనే, ఈ దర్యాప్తులో కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని కుండబద్దలు కొట్టింది. అందుకే, తాజా విచారణపైనా అపనమ్మకం వ్యక్తమైతే తప్పుపట్టలేం.

తాజా అప్రమత్త సందేశాలు పంపడానికి కారణాలను ఆపిల్ వివరించిన తీరూ అస్పష్టంగా ఉంది. అది సమగ్రంగా కారణాలను వివరించాల్సింది. అసలు 'పాలకవర్గ ప్రాయోజిత' ఎటాకర్లు అనే పదానికి ఆ సంస్థ చెబుతున్న వ్యాఖ్యానం, జనానికి అర్థమవుతున్న టీకా తాత్పర్యం వేర్వేరు. పుష్కలంగా నిధులు, వ్యవస్థీకృత సామర్థ్యం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలున్నవన్నీ ఆ వర్గం కిందకు వస్తాయన్నది ఆపిల్ మాట. ప్రభుత్వ జోక్యం లేనిదే అది అసాధ్యమనేది అందరికీ తెలుసు. అందుకే, తాజా రగడపై అటు భారత అటు ప్రభుత్వం, ఇటు ఆపిల్ క్రియాశీలంగా వ్యవహరించాలి. వినియోగదారుల్ని అప్రమత్తం చేయడమే నేరమన్నట్టు ప్రభుత్వం, ఆపిల్ చెవులు మెలేస్తే దేశంలో పెట్టుబడులకు ప్రతికూల వాతావరణమే మిగులుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 శాతం మంది ఆపిల్ ఐ-ఫోన్లు వాడుతుంటే, వారిలో 7 శాతం మన దేశంలోనే ఉన్నారు. తమ ఉత్పత్తులు పూర్తి సురక్షితమనీ, హ్యాకింగ్ అవకాశం అత్యల్పమనీ, ఆ యా దేశాల ప్రభుత్వాల పక్షాన తాము గూఢచర్యానికి ఎన్నడూ పాల్పడబోమనీ ఆపిల్ కూడా నమ్మకం కలిగించాలి.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఏర్పాటైన పార్లమెంటరీ సంఘం తక్షణం సమావేశమై, ఆపిల్ సందేశాలపై విచారణ జరపాలంటూ ప్రతిపక్ష సభ్యులు ఇప్పటికే ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టారు. అయితే, ప్రతిపక్షాలు చేస్తున్న ఈ ఫోన్ల హ్యాకింగ్ వాదనను 'యాక్సెస్ నౌ' సంస్థ సమర్థిస్తోందనీ, కోటీశ్వరుడైన అమెరికన్ ఫైనాన్షియర్ జార్జ్ సోరోస్‌కు ఆ సంస్థలో పెట్టుబడులున్నాయి గనక ఆయనకు ఈ హ్యాకింగ్ వివాదంతో సంబంధం ఉందనీ అధికార బీజేపీ ఐటీ విభాగాధిపతి ఆరోపించారు. పాలక వర్గాలపై ఆరోపణలు వచ్చినప్పుడు అవి నిరాధారమని నిరూపించి, నిజాయతీని నిరూపించుకోవాలి. అది వదిలేసి బోడిగుండుకూ, మోకాలుకూ ముడిపెడితే ప్రయోజనం శూన్యం. అదే సమయంలో ఇచ్చిన సమాచారంపై దృష్టిపెట్టకుండా, తెచ్చిన వార్తాహరుడిపై కత్తులు నూరితే కష్టం.

ఆపిల్ అప్రమత్తతకు సరిగ్గా ఒక రోజు ముందరే మన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్' నుంచి దాదాపు 80 కోట్ల మంది పౌరుల ఆధార్ వివరాలు లీకయ్యాయి. దీనిపైనా లోతైన విచారణ జరపాల్సి ఉంది. ఆధార్ వివరాలు నమోదు చేసే 'యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా' సర్వర్ కట్టుదిట్టమైనదే. కానీ, ఇతర మార్గాల్లో వివరాలు బయటకు పొక్కుతున్నాక ఇక గోప్యతకు అర్థమేముంది! వ్యక్తిగత డిజిటల్ డేటా రక్షణపై ఇటీవలే చట్టం చేసిన ప్రభుత్వం సమాచార సేకరణ, నిల్వ, వినియోగంపై కట్టుదిట్టమైన నియమావళి సత్వరం తీసుకురావాలి.

ప్రజాస్వామ్యానికి కీలకమైన ప్రతిపక్షాలు, పాత్రికేయులపై నిఘా పెట్టి, పౌరుల ప్రాథమిక హక్కయిన గోప్యతను తుంగలో తొక్కాలనుకుంటే అది ఘోరం. ఈ వ్యవహారంపై ప్రజల్లో చైతన్యం పెంచి, ఇలాంటి ఉల్లంఘనల్ని ప్రతిఘటించేలా సంసిద్ధం చేయాలి. పాలకపక్షాలు ఈ ఆరోపణల్లోని నిజానిజాల నిగ్గు తేల్చాలి. పదేపదే ఆరోపణలు వస్తున్నందున వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం వాటిల్లకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిష్కార మార్గాల అన్వేషణే కాదు... ఆచరణలోనూ ప్రజలందరికీ నమ్మకం కలిగించాలి. గోప్యత ఉల్లంఘన జరిగినట్టు తేలితే, కఠిన చర్యలు చేపట్టాలి. అలాకాక, రెండేళ్ళ క్రితం నాటి 'పెగసస్' లానే దీన్ని కూడా చాప కిందకు నెట్టేయాలని పాలకులు ప్రయత్నిస్తేనే చిక్కు. రాజకీయ రచ్చగా మారుతున్న తాజా వ్యవహారంలో అసలు సంగతి వదిలేసి, కొసరు విషయాలు మాట్లాడుకుంటే ఎన్నటికీ ఉపయోగం లేదు.

# మార్క్స్ అవగాహన రుజువవుతోందా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**పార్లమెంటులో, శాసన సభల్లో వందలాది మంది ఎలా కోట్ల ఆస్తులకు పడగలెత్తారని 'ఏడీఆర్' నివేదికలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను 'ఐదేళ్ల కాంట్రాక్టు'గానే పార్టీలు చూస్తున్నాయి. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ధనికవర్గ సమాజాలు నేరస్థుల్ని, వారి వెంటనే నేర చట్టాల్ని, వాటిని సమర్థించే శక్తుల్ని ఎలా సృష్టించుకుంటూ పోతాయో కార్ల్ మార్క్స్ ఎప్పుడో చెప్పారు. అలాంటి సమాజంలో ఒక తత్వవేత్త అందుకు తగిన భావాల్ని అందజేస్తాడు. ఒక కవి తన కవితల్ని అల్లుకుంటూ పోతాడు. ఒక మతాధికారి తన వంతుగా ప్రవచనాల్ని అందిస్తాడు. వర్గ రహిత సోషలిస్టు వ్యవస్థ ఏర్పడేవరకూ ఈ పరిస్థితిలో మార్పు ఉండదు!**

"మన దేశంలో ప్రజల కోసం కాకుండా పవర్ (అధికారం) కోసమే పథకాలు పుట్టుకొస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను 'ఐదేళ్ల కాంట్రాక్టు'గానే పార్టీలు చూస్తున్నాయి. కార్పొరేట్ విధాన రాజకీయాలనే అన్ని పార్టీలు అనుసరిస్తున్నాయి. ఇంతకూ మన దేశంలో భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను చదివిన నాయకులెందరు?"
– తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి వి. నాగిరెడ్డి (28.10.2023)

"దేశంలో చట్టాలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' వల్ల ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు వాటిల్లుతోంది. దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల అధీనంలో ఉండవలసిన ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రయివేట్ రంగ సన్నిహితులకు కట్టబెట్టడానికి మారుపేరు 'ఆశ్రిత పెట్టుబడి'!"
– సీనియర్ పాత్రికేయులు పరాంజయ గుహ ఠాకుర్తా (29.10.2023)

'పాలన సాగించే సివిల్ సర్వెంట్లను ప్రచార సాధనాలుగా ఉపయోగించుకునేలా– దేశంలోని 765 జిల్లాలకు జాయింట్ సెక్రటరీ, లేదా అంతకన్నా తక్కువ స్థాయి అధికారులను 'రథ్ ప్రభారీ'లుగా నామినేట్ చేయాలని అన్ని మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడంపై కేంద్ర మంత్రి మండలి మాజీ కార్యదర్శి కె.ఎం. చంద్రశేఖర్ తీవ్ర నిరసన తెలిపారు.' (30.10. 2023)

పాలనా యంత్రాంగంలో అవినీతి భాగోతం అంతటితోనే ఆగలేదు. రాజకీయ పార్టీలకు ఎన్నికలలో డబ్బు ఎక్కడినుంచి వస్తోందీ, ఎటు పంపిణీ అవుతోందన్న వివరాలను తెలుసుకునే హక్కు దేశ పౌరులకు 'లేదు పొమ్మని' మోదీ ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సుప్రీంకోర్టు ముఖం మీదనే చెప్పారు. తెలుసుకునే హక్కు దేశ పౌరులకు లేదు పొమ్మంటున్న కేంద్ర పాలకుల ఎత్తుగడను సుప్రీం కోర్టు ప్రత్యేక ధర్మాసనం ప్రశ్నిస్తోంది.

భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలు స్థిరపడి నిలదొక్కుకునేటట్లు చేసేందుకు ఏర్పడిన సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్'... కొంతకాలంగా పార్లమెంటు, రాష్ట్రాల శాసన సభల్లో ప్రవేశిస్తున్న వివిధ పార్టీల, రాజకీయ నాయకుల, ప్రతినిధుల ఆదాయ వ్యయాల వివరాలను వెల్లడిస్తూ దేశ ప్రజల్ని హెచ్చరిస్తోంది. 'అందరూ శాకాహారులే అయిన చోట రొయ్యల బుట్ట ఎలా ఖాళీ అవుతోంద'ని ప్రశ్నిస్తోంది. పార్లమెంటులో 250 మంది సభ్యులకు పైగా, రాష్ట్రాల శాసన సభల సభ్యులలో వందలాది మంది ఎలా వందల కోట్ల ఆస్తులకు పడగలెత్తుతూ వచ్చారని 'ఏడీఆర్' సాధికార నివేదికలు గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నా సమాధానం లేదు. సగానికి పైగా పార్లమెంట్ సభ్యులలో, రాష్ట్రాల శాసన సభ్యులలో, పాలకులలో పేరుకు పోతున్న అవినీతికి, క్రిమినల్ కేసులకు అంతులేని పరిస్థితిని ఏడీఆర్ సాధికార నివేదికలు బయట పెడుతున్నాయి. క్రమంగా ఇలాంటి పరిస్థితులు ధనికవర్గ సమాజాలు నేరస్థుల్ని, వారి వెంటనే నేర చట్టాల్ని, వాటిని సమర్థించే శక్తుల్ని ఎలా సృష్టించుకుంటూ పోతాయో చరిత్రలో మొదటిసారిగా విశ్లేషించినవాడు శాస్త్రీయ సోషలిజం సిద్ధాంత ప్రవక్త కార్ల్ మార్క్స్. అలాంటి దోపిడీ వ్యవస్థ ఉనికిని కాపాడటానికి వివిధ శక్తులు ఏ స్థాయిల్లో ఎలా చేదోడు వాదోడు అవుతాయో మార్క్స్ ఇలా విశ్లేషించి చూపాడు:

అలాంటి సమాజంలో ఒక తత్వవేత్త అందుకు తగిన భావాల్ని అందజేస్తాడు. ఒక కవి తన కవితల్ని అల్లుకుంటూ పోతాడు. ఒక మతాధికారి లేదా పూజారి తన వంతుగా ప్రవచనాల్ని అందిస్తాడు. ఓ ప్రొఫెసర్ గారు ఇందుకు తగిన గ్రంథ రాజాల సారాంశాన్ని అందజేస్తుంటాడు. ఓ నేరగాడు యథేచ్ఛగా అలా నేరాలు చేస్తూనే పోతాడు. నేరానికి పాల్పడటం కూడా ధనిక, దోపిడీ వర్గ సమాజ వస్తూత్పత్తి క్రమంలో భాగంగానే సాగిపోతుంది. అటు సరుకుల ఉత్పత్తి క్రమానికి, ఇటు సమాజానికి మధ్య నెలకొనే అవినాభావ సంబంధాన్ని పరిశీలించినట్లయితే–అనేక భ్రమలు, దురభిమానాలు పటాపంచలై పోతాయి. ఎందుకంటే, మన 'లా ప్రొఫెసర్' గారు ఆ భ్రమలపై ఆధారపడి ఓ గ్రంథ రాజాన్ని తయారు చేసుకొని మార్కెట్‌లోకి ఓ అమ్మకపు సరుకుగా వదులు తాడు. ఆ పుస్తకాన్ని తమ వంతు 'జాతీయ సంపద'గా భావించి ధనిక వర్గం పంచుకోవడానికి దోహద పడుతుంది. మరో వైపున దాన్ని తయారు చేసిన 'లా ప్రొఫెసర్' గారిలో ఇది వ్యక్తిగత మైన ఆనందాన్నీ, తృప్తినీ పెంచేస్తుంది. ఇలా మన ప్రొఫెసర్ ధనికవర్గ ప్రయోజనాలకు ఉపయోగపడే ఓ క్రిమినల్ చట్టం రూపొందడానికి చేయూత నివ్వడమేగాక, ఆ చట్టానికి గొడుగు పట్టే 'పీనల్ కోడ్స్' (శిక్షా స్మృతి)ను, దానితోపాటే ధనికవర్గ ప్రయోజనాలు ఈడేర్చిపెట్టే శాసన కర్తలు, కళాకారులు రూపొందేలా, ఆ చట్టానికి వత్తాసు పలికే సాహిత్యానికి, నవలలకు, చివరికి సమాజంలో అనంతమైన విషాదకర సన్నివేశాలకు కారణమవుతాడు. కనుకనే, అలాంటి సమాజాల్లో పరస్పర వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఒక వైపు నుంచి ధనికవర్గమూ, మరో వైపు నుంచి శ్రామికులు ఆచరణలో ప్రయివేట్ ఆస్తి ఉనికిని కాపాడు తున్నట్టు అవుతోందని కూడా మార్క్స్ ప్రభృతులు అరమరికలు లేకుండా చెప్పారు. వర్గ రహిత సోషలిస్టు వ్యవస్థ ఏర్పడేవరకూ ఈ పరిస్థితిలో మార్పు ఉండదు!

అందుకే అన్నాడా, శ్రమ విలువ తెలిసిన వేమన?


"భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను"!

కాగా, అసలు జీవితమంటే ఏదో 'సినారె'ను అడిగితే చెబుతాడు:

"ఉప్పెనలో తలవొగ్గక నిలువున ఉబికొచ్చే జీవితం
ఓటమిలో నిట్టూర్చక రివ్వున ఉరికొచ్చేదే జీవితం
చచ్చేదాకా బతికి వుండటం జాతకాల్లో ఉన్నదే –
ఒరిగిపోయినా తన కంఠం నలుగురు మెచ్చేదే జీవితం
ప్రలోభాలు పైబడినా నీతికి పడి చచ్చేదే జీవితం"!

abkprasad2006@yahoo.co.in

రెండో మాట



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

### బతకలేని నగరం



ఢిల్లీ చుట్టుపక్కల వ్యాపించిన పొగ మంచు దారుణంగా ఉంది. మందంగా, అమ్లంగా. బిల్డింగులు స్పష్టంగా కనబడటం లేదు. కళ్లు మండుతున్నాయి. అతిశయోక్తి కాదు. యుగాంతపు అనంతర దృశ్యంలా ఉంది. దీపావళికి ఇంకా రెండు వారాలు ఉంది.
– ప్రియ, సీనియర్ ఫెలో

### అభిమానులకు వందనం



చాలామంది అర్ధరాత్రి నాకు (జన్మదిన) శుభాకాంక్షలు చెప్పడానికి రావడం నమ్మశక్యంగా లేదు. నేను ఒక నటుడిని మాత్రమే. మీకు కొంత వినోదం కలిగించడం కంటే నాకు ఇంకేమీ సంతోషం కలిగించదు. మీకు వినోదం కలిగించేలా చేస్తున్నందుకు ధన్యవాదాలు.
– షారుఖ్‌ఖాన్, నటుడు

### సాహిత్య నగరం



అందమైన కోళిక్కోడ్‌ను యునెస్కో సాహిత్య నగరంగా ప్రకటించడం కేరళకు గౌరవం. ఇండియాలో ఇంత ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కిన మొదటి నగరం కోళిక్కోడ్ కావడం మనందరికీ గొప్ప గర్వకారణం. నగరపు ఘన సాహిత్య వారసత్వం, సజీవ సాంస్కృతిక దృశ్యానికి ఇదొక సాక్ష్యం. సాహిత్యం, సృజనల పట్ల మన ప్రేమను కొనసాగిద్దాం.
– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

### వేరే లోకపు మనుషులు



ఐజాక్ న్యూటన్ ఒక రసవాది. అలన్ ట్యూరింగ్ టెలిపతి నిజమని నమ్మారు. అత్యంత ప్రజ్ఞ కలిగినవాళ్లు అర్ధ – మార్మికవాదులన్న విషయం కాదనలేనిది. జడ అణువులతో తయారైన విశ్వం, కేవలం సగటు ప్రజ్ఞ కలిగినవాళ్ల కోసమే!
– జశ్ ధోలానీ, చదువరి

### మా వైఖరి



హమాస్ అసహ్యపు తీవ్రవాదాన్ని కెనడా నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది; తనను తాను రక్షించుకునే ఇజ్రాయెల్ హక్కుకు మద్దతిస్తోంది. అదే సమయంలో, పాలస్తీనా పౌరుల ఎడతెగని బాధ ఈ న్యాయానికి మూల్యం కాకూడదు.
– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

### పడిపోయిన ప్రపంచం



నేనొక మాజీ స్టాండప్ కమెడియన్‌ను... అందరికీ తెలిసిన సత్యాలు చెప్పడం ద్వారా కెరియర్‌ను సృష్టించుకున్నాను. వాటిని చెప్పినందుకే జనాలు నన్ను 'సాహసి', 'మేధావి' అనుకుంటారు. అది నిజం కాదు. ప్రపంచం మూర్ఖపుదయ్యింది. జనాలు పిరికివాళ్లయ్యారు.
– కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యంగ్య వ్యాఖ్యాత

### కావాల్సిన వివేకం



కొందరి పాపాలకు తెల్లవాళ్లందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు నల్లవాళ్లందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు అరబ్బులందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు యూదులందరూ బాధ్యులు కారు... ఇంకా దీన్ని పొడిగించగలను. ఇలాంటివి చెప్పాల్సిన అవసరం రానేకూడదు. కానీ ప్రపంచానికి ఇలాంటివి జ్ఞాపకం చేయాలి. మూకుమ్మడి పశ్చాత్తాపాలు, మూకుమ్మడి శిక్షలు చాలు.
– జూజీ, ర్యాపర్

# చరిత్రను మారుస్తారా?

ఎన్‌సీఈఆర్‌టీ నియమించిన కమిటీ పాఠ్యపుస్తకాలలో ఇండియాకు బదులు భారత్ అనే పదాన్ని చేర్చాలనీ, ప్రాచీన చరిత్ర స్థానంలో సంప్రదాయ (క్లాసికల్) చరిత్ర చేర్చాలనీ, హిందూ రాజుల విజయాలను చరిత్రలో ఎక్కువగా చెప్పాలనీ సిఫారసు చేయటం నయవంచనతో కూడినది. ఈ సిఫారసులను పరిశీలిస్తే, ఆ కమిటీలో ఒక్కరికి కూడా భారతదేశంపై గానీ, భారత ప్రజల ఆలోచనా విధానంపై గానీ, భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు, భారత రాజ్యాంగముపై గానీ ఏ మాత్రం అవగాహన లేదని అర్థమవుతోంది. ఇటువంటి వ్యక్తులతో కమిటీ వేసిన ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్‌నూ, సభ్యులనూ కూడా తప్పు పట్టవలసి వస్తుంది. విద్యారంగంలో భారతదేశానికి దిక్సూచిగా పని చేయవలసిన సంస్థ నేడు అజ్ఞానులతో నిండిపోయిందా అనిపిస్తుంది.

పాఠశాలల్లో ప్రతిజ్ఞాపాఠంలో 'భారతదేశం నా మాతృభూమి' అని తెలుగులో, 'భారత్ మేరా దేశ్ హై' అని హిందీలో, 'ఇండియా ఈజ్ మై కంట్రీ' అని ఇంగ్లీష్‌లో ఉన్నది. భారత రాజ్యాంగంలో కూడా 'ఇండియా దటీజ్ భారత్' అని ఉంది. ఇప్పటికిప్పుడు 'ఇండియా' పదం పాఠ్యపుస్తకాలలో కన్పించకూడదంటే, సిఫారసు చేసిన కమిటీ ఏ స్థాయిలో దిగజారిందని భావించాలి?

గతంలో జరిగిన దానిని చెప్పేది చరిత్ర. కల్పించి చెప్పేది పుక్కిటి పురాణం. చరిత్ర వాస్తవాలను చెప్పాలి గానీ, ప్రస్తుత కేంద్ర పాలకులకు ఇష్టమైన రీతిలో చెప్పేది చరిత్ర కాదు. అలెగ్జాండర్ జీలం నది దాటి పోరస్ రాజును ఓడించటానికి సహకరించింది ఓ హిందూ రాజు అనేది వాస్తవం. ఘోరీ మహ్మద్‌ను 17 సార్లు ఓడించిందీ రాజపుత్రులనే నిజాన్నీ చరిత్ర చెప్పుంది. మౌర్యుల చరిత్ర, గుప్తుల చరిత్ర, శాతవాహనుల చరిత్ర, విజయనగర సామ్రాజ్య చరిత్ర చెబుతున్న క్రమంలోనే మొఘలుల చరిత్ర, శివాజీ చరిత్ర చెబుతున్నాం.

నేడున్న పాఠ్యపుస్తకాలలో 'జరిగిన చరిత్ర'నే చేర్చారు. ఏ రాజు విజయం సాధిస్తే వారి పేరే చరిత్రలో ఉన్నది. కాకతీయుల చరిత్ర, పాండ్యుల చరిత్ర, చోళుల చరిత్ర, కుతుబ్ షాహీల చరిత్ర, అసఫ్ జాహీల చరిత్ర అని చదువుకుంటున్నాం. ఇది వాస్తవం. ఎక్కడా హిందూ రాజుల చరిత్ర, ముస్లిం రాజుల చరిత్ర అని ఆనాడు లేదు. లేనిది చేర్చాలని కమిటీ సిఫారసు చేయటమంటే, వారిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? దేశ సమైక్యతకు భంగం కలిగించే ఇలాంటి సిఫారసులను వెనక్కు తీసుకోవాలి.

– అలుగుబెల్లి నర్సిరెడ్డి
తెలంగాణ శాసనమండలి సభ్యులు

# విదేశాంగ నీతిలో కొరవడిన మూల సూత్రాలు

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

యుద్ధంలో పరాజితులే తప్ప విజేతలెవరూ ఉండరని టాల్‌స్టాయ్ తన 'వార్ అండ్ పీస్' నవలలో ఎప్పుడో చెప్పాడు. చరిత్ర దానిని అనేక మార్లు రుజువు పర్చింది కూడా! ఏడాది దాటిన ఉక్రెయిన్ రష్యా యుద్ధం, నెల రోజులుగా పాలస్తీనా (హమాస్) – ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న యుద్ధంలో 'పరాజిత'... యావత్ ప్రపంచం అంటే అతిశయోక్తి కాబోదు. అయితే, పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య రాజుకొన్న యుద్ధ మూలాలు 40వ దశకం చివర్లోనే ఏర్పడ్డాయి.

1948లో ఇజ్రాయెల్ సార్వభౌమాధికారం కలిగిన దేశంగా ఏర్పడి, ఆక్రమిత ప్రాంతాల నుంచి అరబ్బులను తరిమికొట్టడంతోనే పశ్చిమాసియాలో శాంతికి విఘాతం ఏర్పడింది. 'పాలస్తీనా విమోచన సంస్థ' (పీఎల్‌ఓ) ఏర్పడి ఆక్రమిత ప్రాంతాలను తమకు అప్పగించాల్సిందిగా ఇజ్రాయెల్‌ను కోరింది. అందుకు భారత్‌తో సహా వివిధ దేశాల మద్దతు కోరింది. అయితే, స్వప్రయోజనాలు, రాజకీయ కారణాలతో అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ఇజ్రాయెల్‌ను బలపర్చడమే కాకుండా, భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌ను మందలించే తీర్మానాలన్నింటినీ వీటో చేశాయి. ఈ నేపథ్యంలోనే అరబ్బులు ఇస్లామ్ ఏకత్వ నినాదాన్ని ఎత్తుకొని ఇస్లామిక్ దేశాలను తమకు అనుకూలంగా చేసుకోవాలని ప్రయత్నించారు. కానీ, మత దృష్టితో ఏకం కావడం అన్నది తాత్కాలిక ప్రయోజనాలనే తీరుస్తుందన్నది పాలస్తీనా విషయంలో అనేకసార్లు రుజువయ్యింది.

యుద్ధం అన్నది ఓ ఆకస్మిక పరిణామం కాదు. దానికి అనేక కారణాలు ఉంటాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధం అయినా, పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధమైనా వాటికి చారిత్రక కారణాలు ఉన్నాయి. ఈ పరిణామాలకు గల మూల కారణాలను అర్థం చేసుకొని తగిన చొరవతో పరిష్కారానికి ప్రయత్నిస్తేనే యుద్ధాలు నివారించబడతాయి. కానీ, ఆ చొరవ ఎవరు తీసుకోవాలి? ఐక్యరాజ్య సమితా? పేరుకు తటస్థం అయినప్పటికీ ఐక్యరాజ్య సమితి కొన్ని దేశాలకు కొమ్ముకాసే జేబు సంస్థగా మారిపోయిందన్న అపప్రథను ఎప్పుడో మూటగట్టుకొంది. ఐరాస తన అంతర్జాతీయ కర్తవ్యాలను నెరవేర్చడంలో వెనుకబడింది. గాజాలోని ఆసుపత్రిపై బాంబులు పడి వందలాది మంది మరణిస్తే.. ఆ క్షణాన్నే ఇజ్రాయెల్ భూభాగంపై కాలుమోపిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ బాంబులు వేసింది ఇజ్రాయెల్ సైన్యం కాదనీ, ఉగ్రవాదుల పనేననీ ఇజ్రాయెల్ తరఫున వకాల్తా పుచ్చుకొని ఆ దేశాన్ని వెనకేసుకొచ్చారు. జనావాసాలపై, ఆసుపత్రులపై, విద్యా సంస్థలపై దాడులు చేయకూడదని 'జెనీవా ఒప్పందం' ఉన్నా... వాటిని ఇజ్రాయెల్ బేఖాతరు చేస్తుంటే, నోరు విప్పలేని ఐరాస అశక్తత అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇజ్రాయెల్‌పై 'హమాస్' చేసిన దాడిని ఎవ్వరూ సమర్థించరు. కానీ, ఉగ్రవాదుల ఏరివేత ముసుగులో గాజాలోని సామాన్య పౌరులను, ముఖ్యంగా పసి పిల్లలను హతమార్చడాన్ని ఎవరు హర్షించగలరు?!



ప్రపంచీకరణ వల్ల ప్రపంచంలోని అన్ని దేశాలూ పరస్పర ఆధారితమైపోయిన నేపథ్యంలో... ఆ యా దేశాల ప్రాధాన్యతలలో గణనీయమైన మార్పు చోటుచేసుకొంది. ఐరాస భద్రతా మండలి వంటి అంతర్జాతీయ వ్యవస్థలతో పాటు ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి వ్యవస్థ పుట్టుకొచ్చి ఆ యా దేశాల ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలను శాసించే స్థాయికి చేరుకొన్న తర్వాత, అంతర్జాతీయ పరిణామాలు కొన్ని దేశాలకు కొత్త సవాళ్లను తెచ్చి పెట్టాయి. ప్రపంచీకరణతో లాభం పొందిన చైనా... దక్షిణాసియా దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం పరిపాటిగా మారింది. బలహీనదేశాలకు ఆర్థిక సాయం అందించే నెపంతో కొన్ని దేశాల విదేశాంగ ప్రతిపత్తిని దెబ్బతీసే యత్నాలు గతంలోనూ జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి.

కాగా, భారత్‌కు సంబంధించినంతవరకు పాలస్తీనా – ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధాన్నీ, ఏడాదికి పైగా సాగుతున్న ఉక్రెయిన్–రష్యా నడుమ జరుగుతున్న యుద్ధాన్నీ ఏ దృక్కోణంలోంచి చూడాలన్న అంశంలో దేశంలోని పాలక పార్టీ బీజేపీకీ, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకీ మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం అంతర్జాతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారింది.

జవహర్‌లాల్ నెహ్రూ దేశ తొలి ప్రధానిగా ఉన్నప్పుడు విదేశాంగ వ్యవహా రాలను కూడా ఆయనే నిర్వహించేవారు. సహజీవన సూత్రం ఆధారంగా అంతర్జాతీయ వ్యవహారాలను చూస్తామనీ; దానికి అనుగుణమైనదే దేశ తటస్థ వైఖరి అంటూ ఆ ప్రాతిపదికననే అలీన విధా నాన్ని (నాన్ అలైన్డ్) రూపొందించారు. అంతేకాదు... వివిధ దేశాల మధ్య సహృద్భావం, అవగాహనతోనే సమస్యలు పరిష్కారం అవుతాయితప్ప సైనిక ఒప్పందాలు (పాక్ట్స్), సైనిక కూటములలో తీసుకునే సభ్యత్వాలు పరిష్కారం అందించ వని నిర్ద్వంద్వంగా చెప్పేవారు. నెహ్రూ అవలంబించిన విదేశాంగ విధానం నుంచి ఆ తర్వాత ఏ ఒక్క ప్రధానమంత్రీ... చివరకు వాజ్‌పేయి కూడా భిన్నంగా వ్యవహరించలేదు. 1999– 2004 మధ్య దాదాపు ఐదేళ్ల పాటు భారతదేశానికి ప్రధాన మంత్రిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి పలుమార్లు పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. అయితే, తాజాగా ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి తెగబడి వందలాది మంది అమాయక ప్రజల్ని విచక్షణా రహితంగా చంపివేసిన దారుణాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఖండించి ఇజ్రాయెల్‌కు సంఘీభావం ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాలస్తీనాకు మద్దతు ఇస్తూ తీర్మానం చేసింది. సాధారణంగా, విదేశీ వ్యవహారాలకు సంబంధించి దేశంలోని అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. కేంద్రానికి బాసటగా నిలవాలి. అయితే, దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల మద్దతు పొందడమే లక్ష్యంగా పాలస్తీనాకు మద్దతు ఇచ్చినట్లు అర్థమవుతోంది.

ఉక్రెయిన్–రష్యా యుద్ధం పట్ల అనుసరిస్తున్న తటస్థ వైఖరినే పాలస్తీనా–ఇజ్రాయెల్ అంశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ఓ ఉగ్రవాద చర్య. దీనిని ఖండిస్తూ ఇజ్రాయెల్‌కు బాసటగా నిలుస్తామని దేశ ప్రధానీ, విదేశాంగ మంత్రీ ఇరువురూ స్పష్టంగా వెల్లడించారు. మరోపక్క గాజా ప్రాంతంలోని బాధితులకు అవసరమైన ఆహారం, ఔషధాలను భారత్ తరలించడాన్నీ బాధ్యతాయుతమైన చర్యగా చూడాలి. ఇటీవల ఐరాస సర్వప్రతినిధి సభలో 'ప్రజల భద్రత, న్యాయమైన మానవీయ బాధ్యత కోసం' అంటూ జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. దీనిపై వచ్చిన విమర్శలూ గమనార్హమే. నిజానికి, కీలకమైన ఇటువంటి అంశాలపై ఏకాభిప్రాయ సాధన కోసం పాలక బీజేపీ, అన్ని ప్రధాన రాజకీయ పక్షాలను పిలిచి సమావేశం నిర్వహించాలి.

గత 8 ఏళ్లుగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని పలు రాజకీయ పార్టీలు తప్పుబడుతున్నాయి. అమెరికా అంతర్గత రాజకీయాలలో జోక్యం చేసుకోవడం, అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దుల్ని ఆక్రమించిన చైనాను నిలువరించలేకపోవడం, నేపాల్‌తో గత దౌత్యపరమైన సంబంధాలను చెడగొట్టుకోవడం, ఇటీవల కెనడాతో సంబంధాలు క్షీణించడం వంటి అంశాలను చూపించి విదేశాంగ విధానంలో ఎన్డీఏ విఫలమైనట్లు కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. అయితే, ఓట్ల రాజకీయంతో కాంగ్రెస్ పార్టీ కొన్ని వర్గాలకు కొమ్ము కాస్తోందని అది దేశ అంతర్గత భద్రతకు ముప్పు అని బీజేపీ తిప్పికొడుతోంది. కారణాలేవైనా, విదేశీ వ్యవహారాలకు సంబంధించి మునుపటిలా దేశంలో రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం ఓ చేదు వాస్తవం!

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.12.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.8.02 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.8.50 నుండి 10.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.20 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.07 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.03, **సూర్యాస్తమయం:** 5.26.

## బాధిత మహిళలకు ఎస్టీ కమిషన్ బాసట



బాధితులకు డీడీలు అందజేస్తున్న వడిత్యా శంకర్‌నాయక్, రాజాబాబు

చిలకలపూడి (మచిలీపట్నం): రాష్ట్రంలో గిరిజనులకు ఎలాంటి ఆపద వచ్చినా ఎస్టీ కమిషన్ ముందుండి సహకారం అందిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. మచిలీపట్నం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో మత్తి రాజాచంద్ అనే వ్యక్తి ముగ్గురు గిరిజన మహిళలపై దాడి చేశాడన్నారు. ఈ విషయాన్ని తెలుసుకుని తాను బాధితులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించి ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించానని ఇందులో 25% (రూ.50,000) డీడీలను బాధితులకు కలెక్టర్ రాజాబాబు, తాను అందజేసినట్లు చెప్పారు.

## రైల్లో అలారం చైన్‌కు లగేజీ తగిలిస్తే కేసు



ఎమర్జెన్సీ అలారం సిగ్నలింగ్ పరికరానికి తగిలించిన సెల్‌ఫోన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులు తమ వ్యక్తిగత వస్తువులు, లగేజీ బ్యాగులు, సెల్‌ఫోన్లను అలారం చైన్ పుల్లింగ్ పరికరానికి వేలాడదీయడం చట్టరీత్యా తీవ్ర నేరమని రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో హెచ్చరించారు. పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల కోచ్‌లను ఎల్‌బీహెచ్ కోచ్‌లుగా ఆధునీకరించారు. అత్యవసర పరిస్థితిలో రైలును ఆపేందుకు గతంలో ఉపయోగించిన అలారం చైన్ స్థానంలో పాసింజర్స్ ఎమర్జెన్సీ అలారం సిగ్నలింగ్ డివైజ్ (పీఈఏఎస్‌డీ) అమర్చారు. ఈ పరికరం ఎరుపు రంగుతో హ్యాండిల్‌ను పోలి ఉండటంతో ప్రయాణికులు తమ వ్యక్తిగత వస్తువులు, లగేజీలు, సెల్‌ఫోన్‌ను వేలాడదీస్తున్నారు. ఈ కారణంగా పరికరం ఆటోమేటిక్‌గా లాక్ అయ్యి రైలు నిలిచిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు తెలిపారు. ఈ తరహా ఘటనలు అక్టోబరు వరకూ డివిజన్ వ్యాప్తంగా 2,159 జరిగినట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు సరైన కారణం లేకుండా అలారం చైన్ ఉపయోగించడం తీవ్ర నేరమని, రైల్వే చట్టం 141 సెక్షన్ ప్రకారం రూ.1000 జరిమానా, లేదా ఒక ఏడాది జైలు శిక్ష లేదా రెండు విధించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# ఈనెలా అరకొర వానలే!

## రాష్ట్రంలో వర్షపాతం సాధారణంకంటే తక్కువే

- స్పష్టం చేసిన భారత వాతావరణ శాఖ
- రాష్ట్రానికి చేటు చేసిన హమూన్ తుపాన్
- ప్రస్తుతం బంగాళాఖాతంలో ద్రోణి, ఆవర్తనాలు
- ఆ ప్రభావంతో ఈనెల 6 వరకు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభమై దాదాపు పది రోజులవుతోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో వానలు సమృద్ధిగా కురవాల్సి ఉంది. కానీ వాటి జాడ కనిపించకుండా పోతోంది. ఇప్పటికే నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్–సెప్టెంబర్) కూడా రాష్ట్రంపై మిశ్రమ ప్రభావాన్ని చూపింది. కొన్ని ప్రాంతాల్లో సంతృప్తికరంగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ సీజనులో 521.6 మి.మీలకు గాను 454.6 మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. కురవాల్సిన దానికంటే 13 శాతం తక్కువ కురిసిందన్న మాట. సెప్టెంబర్‌లోనూ 16 శాతం తక్కువగా సాధారణ వర్షపాతం (20 శాతం కంటే తక్కువ నమోదైతే సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తారు) రికార్డయింది. ఇక ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఉండే అక్టోబర్‌లో వర్షాలు మరింతగా ముఖం చాటేశాయి. ఈ నెలలో ఏకంగా 90 శాతం భారీ లోటు నమోదైంది. అక్టోబర్ 1 నుంచి 31 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే.. 99 శాతం లోటుతో కర్నూలు జిల్లా అట్టడుగున నిలిచింది. ఆ జిల్లాలో అక్టోబర్‌లో 112.2 మి.మీలు కురవాల్సి ఉండగా కేవలం 0.1 మి.మీలు మాత్రమే కురిసింది. ఈశాన్య రుతుపవనాల ఆగమనం వేళ (అక్టోబర్ మూడో వారం) బంగాళాఖాతంలో ఏర్పడిన హమూన్ తుపాను వాటి చురుకుదనానికి బ్రేకు వేసింది. గాలిలో తేమను ఆ తుపాను బంగ్లాదేశ్ వైపు లాక్కుని పోవడంతో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా మారాయి. అప్పట్నుంచి అవి చురుకుదనాన్ని సంతరించుకోలేక వర్షాలు కురవడం లేదు.

**నవంబర్‌లోనూ అంతంతే..**

సాధారణంగా రాష్ట్రంలో నవంబర్‌లోనూ భారీ వర్షాలు కురుస్తాయి. అయితే రాష్ట్రంలో ఈ నెలలోనూ ఆశించిన స్థాయిలో వానలు కురిసే పరిస్థితుల్లేవని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. నవంబర్‌లో దక్షిణాది రాష్ట్రాల్లో సగటున సాధారణ వర్షపాతం నమోదవుతుందని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాధారణంకంటే తక్కువ వర్షపాతం రికార్డవుతుందని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా 'సాక్షి'కి చెప్పారు.



**వచ్చే మూడు రోజులు వానలు..**

తాజాగా గురువారం నైరుతి బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై అల్పపీడన ద్రోణి ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 1.5 కి.మీల ఎత్తులో విస్తరించి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి శ్రీలంక పరిసరాల్లో కొనసాగుతోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌పైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా ఈనెల ఆరో తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. శుక్ర, శనివారాల్లో ఉత్తరకోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాలో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

## రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

రైలు ప్రమాదంలో మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: ఇటీవల విజయనగరం జిల్లా కంటకాపల్లి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం అందజేశారు. ప్రమాదంలో అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన ముర్రు లక్ష్మి (52) ఆదివారం రాత్రి రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం పరామర్శించి రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

తెలంగాణ

# హైదరాబాద్‌లో చంద్రబాబు ర్యాలీపై కేసు

- బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంపై చర్యలు

సనత్‌నగర్: తాత్కాలిక బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంలో అనుమతి లేకుండా ఆ పార్టీ నేతలు ర్యాలీ నిర్వహించడంపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యారని, దీనివల్ల రెండు గంటలకుపైగా ప్రజలు ఇబ్బంది పడ్డారంటూ బేగంపేట ఎస్‌ఐ జయచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం 5.45 గంటలకు చంద్రబాబు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 50 బైక్‌లు, 20 కార్లతో పాటు సుమారు 400 మంది కార్యకర్తలు ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీ నిర్వహించారు. దీంతో బేగంపేట నుంచి పంజగుట్ట వరకు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడంతో పాటు ప్రజలను ఇబ్బంది పెట్టినందుకు టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి జీవీజీ నాయుడుతో పాటు మరికొంతమందిపై ఐపీసీ 341, 290 (ఆర్/డబ్ల్యూ), 34, 21 (ఆర్/డబ్ల్యూ) 76 సీపీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

## 'ఘన, ద్రవ వ్యర్థాల పైలెట్ ప్రాజెక్టు'కు శ్రీకారం

జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామాల భౌగోళిక పరిస్థితులను బట్టి డ్రైనేజీ టు డైమండ్ పథకంలో భాగంగా జూపూడి గ్రామంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ పైలెట్ ప్రాజెక్టుకు గురువారం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, జూపూడిలో ఏర్పాటు చేసిన ఈ పైలెట్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీ రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌తో కలసి గురువారం సందర్శించారు.

## వ్యూహం సినిమాకు అనుమతివ్వొద్దు

సెన్సార్ బోర్డుకు లోకేశ్ లేఖ

సాక్షి, అమరావతి: రాంగోపాల్‌వర్మ తీసిన వ్యూహం సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని టీడీపీ నేత నారా లోకేశ్ సెన్సార్ బోర్డుకు లేఖ రాశారు. సీఎం జగన్ పదవీకాలం వచ్చే ఏడాది జూన్‌తో ముగియనుందని, ఈ నేపథ్యంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే లక్ష్యంతో జగన్‌పై వ్యూహం చిత్రాన్ని తీస్తున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఇందులో తన తండ్రి చంద్రబాబుతో పాటు తననూ కించపరిచేలా పలు సన్నివేశాలు ఉన్నాయని, ఇవి పరువు నష్టం దావా కిందకు వస్తాయని తెలిపారు. కాగా, అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరని, ఎన్ని వ్యూహాలు పన్నినా వ్యూహాంనీ ఆపలేరని దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలిపారు.

## పారిశ్రామికవేత్త మునగాలకు అరుదైన గౌరవం

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్‌కు అరుదైన గౌరవం లభించింది. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. ×ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న తమిళనాడు రాజ్‌భవన్‌లో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపార దిగ్గజాలను సత్కరించగా.. మినపగుళ్ల వ్యాపారంలో వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించిన మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్‌కు ఈ గౌరవం లభించింది.

## 23 నుంచి ఇంద్రకీలాద్రిపై భవానీ మండల దీక్షలు



వివరాలు వెల్లడిస్తున్న దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, తదితరులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నవంబర్ 23 నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో కేఎస్.రామారావు తెలిపారు. ఆలయం మహామండపం ఆరో అంతస్తులో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, వైదిక కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ దీక్షలు 27 వరకు స్వీకరించవచ్చన్నారు. 23న మూలవిరాట్‌కు పూజలు నిర్వహించి పగడాల మాలాధారణ చేస్తారని, అనంతరం ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తిని మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకువచ్చి అఖండ జ్యోతి ప్రజ్వలనతో దీక్ష స్వీకరణ మహోత్సవం ప్రారంభమవుతుందని వివరించారు. అర్ధమండల దీక్షలు డిసెంబర్ 13–17 వరకు స్వీకరించవచ్చన్నారు. 26న అమ్మవారి కలశజ్యోతి మహోత్సవం సత్యనారాయణపురంలోని శ్రీశివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమవుతుందన్నారు. జనవరి 3–7 వరకు దీక్ష విరమణలు కొనసాగుతాయని తెలిపారు.

**14 నుంచి కార్తీక మాసోత్సవాలు**

ఇంద్రకీలాద్రిపై ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం మల్లేశ్వర స్వామి, నటరాజ స్వామి వారి ఆలయాల వద్ద ఆకాశదీపాన్ని వెలిగించనున్నారు. 26న కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, 27న కార్తీక పౌర్ణమి గిరి ప్రదక్షిణ, బిల్వార్చన చేపడతారు. 15న దుర్గమ్మను గాజులతో అలంకరిస్తారు. 16న సరస్వతి యాగాన్ని, 17న నాగుల చవితి నిర్వహిస్తారు.

## గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టులో ప్రైవేటు వసూళ్లు

గరికపాడు (జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని గరికపాడులోగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వాహనాల ట్యాక్స్ వసూళ్లకు ఆన్‌లైన్ విధానం ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర చెప్పారు. ఆ సమయంలో చెక్‌పోస్టులో విధుల్లో ఉన్న చెక్‌పోస్టు ఇన్‌చార్జ్, ఎంవీఐ శేఖర్ వ్యక్తిగత డ్రైవర్‌తో పాటు నలుగురు వ్యక్తులు వాహనాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని వివరించారు. వారి వద్ద నుంచి రూ.76,116 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎంవీఐపై కేసు నమోదు చేశామని, వ్యక్తిగత డ్రైవర్‌తో పాటు నలుగురు సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని వివరించారు. ఏసీబీ డీజీ రాజానందరెడ్డి ఆదేశాల మేరకు చేసిన ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ సత్యానందం, సీఐలు శివకుమార్, రవిబాబు, నాగరాజు, శరత్‌బాబు, అంజిబాబు, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి మరో 5 లక్షల ఇళ్లు

గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్

సాక్షి, అమరావతి: వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో మరో ఐదులక్షల పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులను గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ ఆదేశించారు. ఆయన గురువారం విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంపై సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి పక్కా గూడు కల్పించాలనే దృఢసంకల్పంతో ఈ పథకాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ పథకం కింద ఐదులక్షలకు పైగా నిర్మించినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహించవద్దన్నారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల్ని కూడా వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఆప్షన్–3 ఇళ్లను నిర్మిస్తున్న లేబర్ ఏజెన్సీలు తమ పనితీరును ఇంకా మెరుగు పరుచుకోవాలని ఆయన కోరారు. గృహనిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ ఐదులక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడంలో నిరంతరం శ్రమించిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే తరహాలో భవిష్యత్‌లో కూడా ముందుకు వెళ్లాలని సూచించారు. గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ పనులను వేగవంతంగా చేపట్టడంతోపాటు లబ్ధిదారులకు బిల్లులను సకాలంలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, వైఎస్సార్ జగనన్న కాలనీల్లో స్వాగత ఆర్చ్‌ల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్, ఓఎస్డీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## స్ట్రే వేకెన్సీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి స్ట్రే వేకెన్సీ సీట్ల భర్తీలో భాగంగా కొత్త దరఖాస్తులు ఆహ్వానిస్తూ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు సీ కేటగిరీ ఎంబీబీఎస్, 60 బీ కేటగిరీ బీడీఎస్ సీట్లలో ప్రవేశాలు పొందడానికి నీట్ యూజీ–2023లో అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 9 గంటలలోగా https://ugmq.ysruhs.com వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

## బాబును కాపాడేందుకే అమరావతి ఉద్యమం

1,131వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: అమరావతి రైతుల ముసుగులో ఉద్యమం చేస్తున్న చంద్రబాబు బినామీలు.. ఆ ప్రాంత రైతుల ప్రయోజనాలను గాలికొదిలి బాబు అవినీతిని కాపాడేందుకే తాపత్రయ పడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,131వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. ఐదు సంవత్సరాల్లో అమరావతిని అడ్డుపెట్టుకుని రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేసిన చంద్రబాబు.. తన సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఉద్యమం పేరుతో రోడ్డెక్కారని విమర్శించారు.

## పొగాకు బోర్డు చైర్మన్‌గా యశ్వంత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



కొరిటిపాడు(గుంటూరు): పొగాకు రైతుల ఆదాయం పెంచేందుకు... వారి అభివృద్ధి, శ్రేయస్సుకు బోర్డు నిరంతరం కృషి చేస్తోందని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ తెలిపారు. భారత పొగాకు బోర్డు చైర్మన్‌గా గుంటూరు జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

# చెప్పింది చేసే ఏకైక సీఎం జగన్

- విజయవాడలో సీఎం జగన్‌కు బేడ (బుడ్గ) జంగాల కృతజ్ఞత సభ
- మాట్లాడిన పలువురు వక్తలు, నేతలు



సభకు హాజరైన బేడ (బుడ్గ) జంగం నాయకులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): చెప్పింది చేసే ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇచ్చిన మాట ప్రకారం బేడ (బుడ్గ) జంగాలను ఎస్సీ కులాల జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సాహసోపేతమైన నిర్ణయం అని బేడ (బుడ్గ) జంగాల నేతలు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌కు బేడ (బుడ్గ) జంగాలు కృతజ్ఞతలు తెలియజేస్తూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. సామాజిక సాధికారత కోసం ఆలోచన చేసే ఏకైక సీఎం జగన్ అన్నారు. సంచార జాతులైన బేడ (బుడ్గ) జంగం కులాలకు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మంచి చేశారని, తరువాత వచ్చిన ప్రభుత్వాలు వారిని నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. మళ్లీ సీఎం జగన్ వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. పెత్తందార్ల వ్యవస్థను చంద్రబాబు ప్రోత్సహిస్తే.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలందరూ నావాళ్లే అనుకునే నాయకుడు సీఎం జగన్ అన్నారు. పేదలు ఏ కులంలో ఉన్నా వారికి మేలు చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు.

**మా కళను గుర్తించాలి**

ఏపీ రాష్ట్ర బేడ (బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలమర్తి మధు మాట్లాడుతూ.. ఎస్సీల్లో చేర్చే అంశంపై పార్లమెంట్‌లో కూడా తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కులాల్లోని కళను గుర్తించి గుమ్మెట తంబూర కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని, శ్రీశైలంలో తమ సామాజికవర్గీయుల అన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలని కోరారు.

**పేదల పక్షాన ఈ ప్రభుత్వం: సజ్జల**

సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం మేలు చేసిందని చెప్పారు. ఓట్ల కోసం రాజకీయం చేసే వ్యక్తి చంద్రబాబు అయితే.. అట్టడుగు వర్గాల ప్రజల కోసమే రాజకీయం అన్న వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అన్నారు. తండ్రి బాటలోనే సీఎం జగన్ నడుస్తున్నారని, ఆయన వద్ద చేయిచాచాల్సిన పని లేదని, హక్కుగా ఆయన దగ్గరకు రావచ్చన్నారు. గతంలో సంపన్న వర్గాలకు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ ఉండేవారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ ఉండేలా ఏర్పాటు చేశారని అన్నారు. రోగాల పేరుతో జైలు నుంచి తాత్కాలిక బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు వెనుక పెత్తందార్లు తప్ప బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు మాట్లాడారు. బీజెహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు సిరిగిరి మన్యం అధ్యక్షత వహించిన ఈ సభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన బేడ, బుడ్గ, జంగం కులాల నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### ఫిబ్రవరి 8న పాకిస్తాన్ ఎన్నికలు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన సాధారణ ఎన్నికలు జరుపుతామని అధ్యక్షుడు అరిఫ్ అల్వీ గురువారం ప్రకటించారు. దేశంలో ఆర్థిక అస్థిరత తీవ్రరూపం దాల్చిన ఈ సమయంలో అధ్యక్షుడితో చర్చించి, ఎన్నికల తేదీని ఖరారు చేయాలంటూ అంతకుముందు ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్(ఈసీపీ) చీఫ్ కమిషనర్ సికందర్ సుల్తాన్ రజా, కమిషన్‌లోని నలుగురు సభ్యులు, అటార్నీ జనరల్ ఉస్మాన్ అవాన్ కలిసి అధ్యక్షుడు అరిఫ్ అల్వీని కలిశారు. ఎన్నికల నిర్వహణపై చర్చలు జరిపారు. అనంతరం ఎన్నికల తేదీని 2024 ఫిబ్రవరి 8గా నిర్ణయించినట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

### కాంగ్రెస్ అంటే కోత, అవినీతి, కమీషన్: మంత్రి అమిత్ షా

**కర్నాల్(హరియాణా):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా కాంగ్రెస్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఆ పార్టీని ఆయన కోత, కమీషన్, అవినీతి(కట్, కమీషన్, కరప్షన్) పార్టీగా పేర్కొన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలోని 27 పార్టీల నేతలు స్వలాభం కోసమే చేతులు కలిపారని ఆరోపించారు. తమ బీజేపీ మాత్రం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తోందని చెప్పారు. గురువారం హరియాణా ప్రభుత్వం నిర్వహించిన అంత్యోదయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దేశంలో శాంతి భద్రతలను మెరుగుపర్చిందని, అవినీతిని, బంధుప్రీతిని నిర్మూలించిందని చెప్పారు.

### గవర్నర్‌పై సుప్రీంకోర్టులో కేరళ పిటిషన్

**న్యూఢిల్లీ:** రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలపడంలో రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ విపరీతమైన జాప్యం చేస్తున్నారని కేరళ ప్రభుత్వం ఆక్షేపించింది. బిల్లులకు త్వరగా అంగీకారం తెలిపేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రజల హక్కులను గవర్నర్ అగౌరవపరుస్తున్నారని పేర్కొంది. ప్రస్తుతం 8 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. వాటిపై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని తెలియజేసింది. ఇవన్నీ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులేనని ఉద్ఘాటించింది.

### కాంగ్రెస్ వల్లే 'ఇండియా'లో వేడి తగ్గింది: నితీశ్ కుమార్

**పట్నా:** విపక్ష 'ఇండియా' కూటమి స్తబ్దుగా మారిపోయిందని, ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీయే అందుకు కారణమని జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మునిగిపోయిందని, దాంతో ఇండియా కూటమిలో వేడి తగ్గిందని అన్నా రు. గురువారం బిహార్ రాజధాని పట్నాలో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన సభలో నితీశ్ ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ పాలనను వ్యతిరేకించే పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయని, ఆ కూటమిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు.

### ఇండోనేసియాలో భూకంపం

**జకార్తా:** ఇండోనేసియా ఆగ్నేయప్రాంతంలో గురువారం ఉదయం భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైంది. ఈస్ట్ నుసా తెంగ్గారా ప్రావిన్స్ రాజధాని కుపంగ్‌కు 21 కిలోమీటర్ల దూరంలో భూమికి 36 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. దీని తీవ్రతతో కుపంగ్ నగరంలోని ఇళ్లు, ఇతర భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పేర్కొంది.

### దీక్ష విరమించిన జరంగే

**జాల్నా:** మరాఠా కోటా కోసం 9 రోజులుగా నిరశన దీక్ష కొనసాగిస్తున్న మనోజ్ జరంగే గురువారం దీక్ష విరమించారు. మరాఠాలకు రిజర్వేషన్ల అంశాన్ని రెండు నెలల్లోగా తేల్చకుంటే మరింత తీవ్రంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. భారీగా జనంతో ముంబైకి తరలివస్తామని, అక్కడి జనానికి నిత్యావసరాలు కూడా అందకుండా చేస్తామని హెచ్చరించారు. జాల్నా జిల్లాలోని అంతర్వాలి సరటిలో దీక్షలో ఉన్న జరంగే వద్దకు గురువారం నలుగురు రాష్ట్ర మంత్రులు వచ్చారు. నిరాహార దీక్ష విరమించాలని జరంగేను వారు కోరడంతో దీక్ష విరమించారు.

### బెనారస్ ఐఐటీలో విద్యార్థినిపై దురాగతం

**వారణాసి:** ఐఐటీ-బీహెచ్‌యూ(బెనారస్ హిందూ యూనివర్సిటీ) విద్యార్థినిపై కొందరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు విద్యార్థినిని వేధించడంతోపాటు బట్టలు విప్పించి, వీడియో చిత్రీకరించారు. బాధిత విద్యార్థిని బుధవారం రాత్రి స్నేహితుడితో కలిసి హాస్టల్‌కు సమీపంలోని కర్మన్‌బాబా ఆలయం వద్దకు వెళ్లింది. అప్పుడే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై అక్కడికి వచ్చారు. బాధితురాలిని బలవంతంగా ఓ మూలకు తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారు. ఆమెను బట్టలూడదీయించి, వీడియో చిత్రీకరించారు. ఫొటోలు తీశారు. 15 నిమిషాల అనంతరం ఆమె సెల్ నంబర్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ అమానుషంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

# ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

**ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు, దురుద్దేశంతో సమన్లు పంపారు**

**సమన్లు ఉపసంహరించుకోండి ● ఈడీకి లేఖ రాసిన కేజ్రీవాల్**



సింగ్రౌలీ నియోజకవర్గంలో ఎన్నికల రోడ్‌షోలో పాల్గొన్న కేజ్రీవాల్, భగవంత్ మాన్

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో నూతన మద్యం విధానంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై వివరాలు రాబట్టేందుకు ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తమ కార్యాలయానికి పిలవగా గరువారం ఆయన గైర్హాజరయ్యారు. దీంతో ఆయనకు మరో తేదీతో సమన్లు జారీచేసే అవకాశముంది. విచారణకు పిలిచి కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేస్తుందన్న ఆప్ ఆరోపణల నడుమ గురువారం ఢిల్లీలోని ఈడీ ఆఫీస్ ఎదుట పెద్దసంఖ్యలో ఆప్ కార్యకర్తలు గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితుల నివారణ కోసం ముందస్తుగా కేంద్రం పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను ఈడీ ఆఫీస్, బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించింది. ఈ కేసును వచ్చే 6–8 నెలల్లోగా తేల్చేయాలని సుప్రీంకోర్టు ప్రాసిక్యూషన్ వారికి సూచించిన నేపథ్యంలో ఈడీ ఈ కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసే అవకాశముంది.

### చట్టవ్యతిరేకం, కక్షపూరితం

ఈడీ ఆఫీస్‌కు గైర్హాజరైన సందర్భంగా దర్యాప్తు సంస్థకు కేజ్రీవాల్ ఒక లేఖ రాశారు. ' నాకు పంపిన ఈ సమన్లు పూర్తిగా చట్టవిరుద్ధం. కక్షపూరితం. రాజకీయ ప్రేరేపితం. బీజేపీ చేస్తున్న తీవ్ర ఒత్తిళ్లతో ఈడీ నోటీసులు పంపించింది. వీటిని ఉపసంహరించుకోండి. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నన్ను అడ్డుకునేందుకు ఇప్పుడీ సమన్లు పంపారు. ఈ కేసుతో నాకు ఎలాంటి సంబంధం ఉందని సమన్లు పంపారు? సాక్షిగానా లేక నిందితుడిగానా అనేది అందులో లేదు. ఢిల్లీకి ముఖ్యమంత్రిగా ఉన్నందుకు పంపారా? లేదంటే ఆప్ కన్వీనర్ అయినందుకు పంపారా?' అని లేఖలో కేజ్రీవాల్ ప్రశ్నించారు. 'కేజ్రీవాల్‌కు సమన్లు పంపి అరెస్ట్ చేస్తారని బీజేపీ నేతలు అక్టోబర్ 30న అన్నారు. అదేరోజు సాయంత్రం యాధృచ్ఛికంగా ఈడీ సమన్లు ఇచ్చింది' అని లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, ఈడీ ఆఫీస్‌కు రాకుండా కేజ్రీవాల్ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి సింగ్రౌలీ నియోజకవర్గంలో ఎన్నికల రోడ్‌షోలో పాల్గొని ప్రసంగించారు. 'నన్ను అరెస్ట్‌చేస్తారని ఢిల్లీ కోడైకూస్తోంది. ఈడీ అధికారులు నన్ను అరెస్ట్ చేయగలరుగానీ నా ఆలోచనలను అరెస్ట్ చేయలేరుకదా. నా సిద్ధాంతాలతో ఏకీభవించే దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది, కోట్లాది అభిమాన కేజ్రీవాల్‌లను అరెస్ట్ చేయలేరు' అని ర్యాలీలో కేజ్రీవాల్ అన్నారు.

#### 'ఇండియా' కూటమిని దెబ్బతీసేందుకు యత్నం: ఆప్

'ఇండియా' కూటమిని దెబ్బ కొట్టాలంటే ఢిల్లీలో కొరకరాని కొయ్యలా ఉన్న కేజ్రీవాల్‌ను ముందు అరెస్ట్‌చేయాలనేది బీజేపీ ప్రణాళిక. అలా అయితేనే ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ బలహీనమై సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతుందని బీజేపీ కుట్ర పన్నుతోంది' అని ఆప్ ఆరోపించింది.

#### నిజాన్ని ఎదుర్కోలేక పారిపోయారు: బీజేపీ

కేజ్రీవాల్ గైర్హాజరుపై బీజేపీ ఎద్దేవాచేసింది. ' ఎక్సైజ్ పాలసీ విధానంలో నిజాలను వెల్లడించే ధైర్యం లేకనే కేజ్రీవాల్ ఈడీ ఆఫీస్‌కు రాకుండా పారిపోయారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కింగ్ ఆయనే' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు. ' సాక్ష్యాలు, ఆధారాలుంటేనే ఈడీ సమన్లు జారీచేసి విచారణకు పిలుస్తుంది. మద్యం విధానం గురించి బాగా కేజ్రీవాల్‌కు బాగా తెలుసు. నిజాలు కప్పిపుచ్చే సమర్థత లేకనే, భయంతోనే ఆయన ఈడీ ఆఫీస్‌కు వెళ్లలేదు' అని ఆయన ఆరోపించారు.



విలేకరి ప్రశ్నకు బదులిస్తూ.. 'నా కళ్లల్లో నీళ్లున్నాయా? అంటూ ఎదురు ప్రశ్నిస్తున్న మొయిత్రా

# మొయిత్రా వాకౌట్

- ఆమెకు మద్దతుగా బయటికొచ్చిన విపక్ష సభ్యులు
- తొలుత కమిటీ ఎదుట తన వాదనలు వినిపించిన మొయిత్రా
- కమిటీలో దారుణ ప్రశ్నలు వేశారని ఆరోపణ

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు నగదు తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ నైతిక విలువల కమిటీ ముందు హాజరై తర్వాత వాకౌట్ చేశారు. కమిటీ భేటీలో తీవ్ర అభ్యంతర, వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారంటూ ఆమె మధ్యలోనే బయటికొచ్చారు. ఆమెకు మద్దతు పలుకుతూ విపక్ష ఎంపీలు సైతం అర్ధంతరంగా బయటికొచ్చారు. కాగా, 'ఎథిక్స్ కమిటీని మొయిత్రా తప్పుదోవ పట్టించే ప్రయత్నంచేశారు. కమిటీ తప్పుడు విధానాలను అవలంబిస్తోందంటూ, కమిటీ నిర్వహణ పద్ధతిని మొయిత్రా తప్పుగా చిత్రించే దుస్సాహసం చేశారు' అని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఆరోపించారు. 'నగదుకు ప్రశ్నలు' ఆరోపణలుసహా తన పార్లమెంట్ లాగిన్ వివరాలను పారిశ్రామికవేత్త దర్శన్ హీరానందానీకి మొయిత్రా ఇచ్చారని, దుబాయ్ నుంచి చాలా సార్లు లాగిన్ అయ్యా, విదేశాల్లో లాగిన్ అవడంతో దేశభద్రత ప్రమాదంలో పడిందని దూబే తీవ్ర ఆరోపణలు చేయడం తెల్సిందే. లోక్‌సభ స్పీకర్ బిర్లాకు దూబే ఫిర్యాదుచేయడంతో వివరణ కోరుతూ పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ మొయిత్రాను గురువారం పిలిచింది. ఈ భేటీ దాదాపు నాలుగు గంటలపాటు సాగింది.

### అసభ్యమైన ప్రశ్నలు వేస్తున్నారు: మొయిత్రా

'అసలు అవేం ప్రశ్నలు?. తీవ్ర అభ్యంతరకరమైన, అసభ్యమైన ప్రశ్నలు అడుగుతున్నారు. అందుకే బయటికొచ్చేశా' అని అక్కడ ఉన్న మీడియాతో అన్నారు. 'మీ కళ్లలో నీళ్లు తిరుగుతున్నట్లు ఉన్నాయిగా' అని అక్కడున్న ఒక విలేకరి ప్రశ్నించగా.. 'ఏమిటా చెత్త ప్రశ్న. చూడు నా కళ్లలో నీళ్లు కనిపిస్తున్నాయా?' అంటూ మొయిత్రా తన రెండు కళ్లను చూపించారు. 'అసలు ఇది ఎథిక్స్ కమిటీయేనా?. ముందే సిద్ధంచేసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారు' అంటూ కమిటీపై మొయిత్రా ఆరోపణలు చేశారు. ''కమిటీలో చైర్మన్ నన్ను మాటలతో 'వస్త్రాపహరణం' చేశారు'' అని ఫిర్యాదు చేస్తూ స్పీకర్ బిర్లాకు మొయిత్రా ఒక లేఖ రాశారు.

### మొయిత్రా, కమిటీ చైర్మన్, సభ్యులు ఏమన్నారు?

మొయిత్రా వాకౌట్ తర్వాత ఎథిక్స్ కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకార్ మీడియాతో మాట్లాడారు. ' నిజానికి కమిటీ విధివిధానాలు, నిర్వహణ పద్ధతిపై మొయిత్రా తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. తర్వాత ఆమె, విపక్ష సభ్యులు చర్చ జరుగుతుండగానే మధ్యలో బయటికొచ్చేశారు' అని చెప్పారు. ' మొయిత్రాను అడిగిన ప్రశ్నలు అగౌరవనీయం, అనైతికంగా ఉన్నాయి. ఎక్కడెక్కడ తిరిగారు. ఎవరితో మాట్లాడారు. మీ ఫోన్ రికార్డింగ్‌లు ఇవ్వాలని కమిటీ అడిగింది' అని కాంగ్రెస్ ఎంపీ, ప్యానెల్ సభ్యుడు అయిన ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. 'రాత్రిళ్లు ఎవరితో మాట్లాడతారు? ఎలాంటి విషయాలు మాట్లాడతారు? అని ఆమెను ప్రశ్నించారు. మహిళా ఎంపీని చైర్మన్ ప్రశ్నలు అడిగే పద్ధతి ఇదేనా? ద్రౌపది వస్త్రాపహరణం తరహాలో విచారణ కొనసాగింది' అని కమిటీ సభ్యుడు డ్యానిష్ అలీ ఆరోపించారు.

#### ఆ లాయర్ వల్లే ఇదంతా !

బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేకు బలమైన సాక్ష్యాలు ఇచ్చారంటూ వార్తల్లో నిలిచిన న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ గతంలో మొయిత్రాకు బాగా తెలుసు. వీరిద్దరూ కొన్నాళ్లు సహజీవనం చేసి విడిపోయారు. విడిపోయేటపుడు జరిగిన గొడవకు ప్రతీకారంగానే జై అనంత్ ఇవన్నీ చేస్తున్నారని మీడియాలో వార్తలొచ్చాయి. కమిటీ ముందు ఇవే అంశాలను మొయిత్రా ప్రస్తావించారని తెలుస్తోంది. అయితే, దేహద్రాయ్‌తో బంధం విడిపోయిన విషయం పక్కనబెట్టి 'నగదుకు ప్రశ్నలు' అంశంపై వివరణ ఇవ్వాలని కోరినా ఆమె పట్టించుకోలేదని బీజేపీ ఎంపీ, కమిటీ సభ్యుడు విష్ణుదత్ శర్మ ఆరోపించారు.

# కొనసాగుతున్న దాడులు

- హమాస్ మిలిటెంట్ల కోసం గాలింపు ముమ్మరం
- గాజా సిటీ దిశగా ఇజ్రాయెల్ సైనిక దళాలు

**జెరూసలేం:** గాజాలో హమాస్ మిలిటెంట్ గ్రూప్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఇజ్రాయెల్ పదాతి దళాలు మరింత ముందుకు చొచ్చుకెళ్తున్నాయి. మిలిటెంట్ల కోసం వీధుల్లో ముమ్మరంగా గాలిస్తున్నాయి. హమాస్ మిలిటెంట్లకు గట్టి పట్టున్న గాజా సిటీ దిశగా సైన్యం కదులుతోంది. గాజా భూభాగంలో వైమానిక దాడులు సైతం యథావిధిగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి సెంట్రల్ గాజాలో బురీజ్ శరణార్థి శిబిరంలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో 15 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో జనం శిథిలాల కింద చిక్కుకున్నారు. గాజాలో తమ సైన్యంపై హమాస్ మిలిటెంట్లు యాంటీ ట్యాంక్ మిస్సైళ్లు, గ్రనేడ్లు ప్రయోగించారని ఇజ్రాయెల్ వెల్లడించింది. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆపడానికి దౌత్యపరమైన ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ విషయంలో అమెరికాతోపాటు అరబ్ దేశాలు చొరవ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తోపాటు హమాస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. యుద్ధానికి కనీసం విరామం అయినా ఇవ్వాలని ఇరుపక్షాలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, సాధారణ ప్రజల ప్రాణాలను హరించడం తగదని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నారు. జోర్డాన్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌లోని తమ రాయబారిని వెనక్కి రప్పించింది. యుద్ధం ముగిసే దాకా తమ దేశానికి రావొద్దని ఇజ్రాయెల్ రాయబారికి సూచించింది.

**గాజాలో 9 వేలు దాటిన మృతులు**

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 9,061 మంది పాలస్తీనియన్లు మరణించారని, 32,000 మందికిపైగా గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి డాక్టర్ అష్రాఫ్ అల్–ఖుద్రా గురువారం వెల్లడించారు. మృతుల్లో 3,760 మంది 18 ఏళ్లలోపు వారేనని చెప్పారు. ఇవన్నీ అధికారిక గణాంకాలే. వాస్తవానికి ఇంకా ఎంతమంది చనిపోయారో అధికారులు చెప్పలేకపోతున్నారు. గాజాలో వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారంతా మరణించి ఉండొచ్చని తెలుస్తోంది. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడులతోపాటు అంతర్గత ఘర్షణల్లో 130 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా బలయ్యారు.

**ఈజిప్టుకు మరో 100 మంది..**

విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉన్నవారు గాజా నుంచి ఈజిప్టుకు వెళ్లిపోతున్నారు. బుధవారం 335 మంది వెళ్లగా, గురువారం మరో 100 మంది రఫా సరిహద్దును గుండా ఈజిప్టులో అడుగుపెట్టారు. అంతేకాకుండా గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన 76 మంది పాలస్తీనియన్లు వారి సహాయకులతో కలిసి ఈజిప్టు చేరుకున్నారు. వారికి ఈజిప్టులో చికిత్స అందించనున్నారు. గాజాలో ప్రస్తుతం దాదాపు 400 మంది అమెరికన్లు ఉన్నారు. వారందరినీ క్షేమంగా స్వదేశానికి చేర్చడానికి అమెరికా ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది.



రఫా సరిహద్దు మీదుగా దక్షిణ గాజాలోకి వచ్చిన సరకుల పెట్టెలను లూటీ చేస్తున్న స్థానికులు



వాహనాలకు ఇంధనం కొరత కారణంగా ఖాన్ యూనిస్ పట్టణంలో గాడిదలు లాగే బండ్లపై ప్రయాణిస్తున్న పాలస్తీనియన్లు



ద్వంద్వ పౌరసత్వం ఉండి గాజాను వీడుతున్న పాలస్తీనియన్లు, విదేశీయుల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న పాలస్తీనియన్ సరిహద్దు బలగాలు.

# 'మై లార్డ్' అనకండి..

**సగం వేతనం ఇచ్చేస్తా! ● సీనియర్ న్యాయవాదితో సుప్రీంకోర్టు జడ్జి**



**న్యూఢిల్లీ:** కోర్టులో వాదోపవాదాల సమయంలో పదేపదే మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్స్'అంటూ లాయర్లు తమను సంబోధిస్తుండటంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మై లార్డ్స్ అని ఎన్నిసార్లు అంటారు? ఇలా అనడం ఆపేస్తే, నా వేతనంలో సగం మీకిచ్చేస్తా'అని జస్టిస్ పీఎస్ నరసింహ పేర్కొన్నారు. బుధవారం జస్టిస్ ఏఎస్ బొపన్నతో కలిసి ఆయన ఓ కేసు విచారణలో పాల్గొన్నారు. వాదోపవాదాల సమయంలో ఓ సీనియర్ లాయర్ పదేపదే 'మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్స్' అంటుండటంపై పైవిధంగా ఆయన స్పందించారు. వాటికి బదులుగా సర్ అని అనొచ్చు కదా అని తెలిపారు. లేకుంటే ఆ మాటలను ఎన్నిసార్లు వాడేదీ లెక్కపెడ తానని చెప్పారు. 'మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్'అనే మాటలు వలస పాలన ఆనవాళ్లని, కోర్టు ప్రొసీడింగ్స్ సమయంలో వాడరాదంటూ 2006లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీర్మానం చేసింది.

### ఉద్యోగ మేళాల పేరిట మోదీ డ్రామాలు: ఖర్గే

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం విమర్శించారు. ఉద్యోగ మేళాల పేరిట మోదీ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఉద్యోగాలు, ప్రమోషన్లు వచ్చినవారికి మళ్లీ నియామక పత్రాలు ఇస్తూ ప్రచారం కోసం పాకులాడుతున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగాల కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువత ఆశలపై ప్రధానమంత్రి నీళ్లు చల్లుతున్నారని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగిత శాతం రెండేళ్ల గరిష్టాన్ని అధిగమించిందంటూ 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ లిమిటెడ్' తాజాగా విడుదల చేసిన నివేదికను ఖర్గే ప్రస్తావించారు. మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో 90 లక్షలకుపైగా ఉద్యోగాలు మాయమయ్యాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థిత మరింత దారుణంగా ఉందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం డిమాండ్ 20 శాతం పెరిగిందని తెలిపారు. మొత్తానికి దేశంలో నిరుద్యోగం 10.8 శాతానికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువతలో నిరుద్యోగం 13.4 శాతంగా ఉందని, ప్రభుత్వ సర్వేలోనే ఈ విషయం బయటపడిందని పేర్కొన్నారు. ఉద్యోగాల విషయంలో తప్పుడు ప్రకటనలు, ట్రిక్కులు ఎక్కువ కాలం చేయవని తేల్చిచెప్పారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసిన వారిపై యువత ప్రతీకారం తీర్చుకుంటారని, ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతున్నారన్నారు.

# విరాళాల వివరాలివ్వండి

- రాజకీయ పార్టీలు అందుకున్న విరాళాలపై ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎలక్టోరల్ బాండ్ల చట్టబద్ధత కేసులో వాదనలు పూర్తి
- తీర్పును రిజర్వ్‌చేసిన సర్వోన్నత న్యాయస్థానం

**న్యూఢిల్లీ:** రాజకీయ పార్టీలు విరాళాలు అందుకునేందుకు తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం చట్టబద్ధతను సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై వాదనలు గురువారం ముగిశాయి. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ' ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న విరాళాల సమగ్ర డేటాను సీల్డ్ కవర్‌లో మాకు రెండు వారాల్లోగా అందజేయండి' అని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)ను ధర్మాసనం ఆదేశించింది. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు. బాండ్ల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్, సీపీఐ(ఎం) నేత, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)లు విడివిడిగా పిటిషన్ల వేయడం తెల్సిందే. బాండ్లను విక్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను విరాళాల దాతల వివరాలు అడగబోము. కానీ ఎన్ని బాండ్లు విక్రయించారు, ఎంత మొత్తం పార్టీల ఖాతాల్లో జమ అయిందనే వివరాలు ఇవ్వండి' అని ఈసీకి కోర్టు సూచించింది.

**'పరస్పర సహకార' ధోరణికి ఈ బాండ్ పనిముట్టుగా మారొద్దు:** అధికార పార్టీ నుంచి ప్రయోజనం పొందే వారు.. అధికార పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో భారీగా విరాళాల ద్వారా లబ్ధి చేకూర్చడం, ఆతర్వాత అధికార పార్టీ నుంచి వారు అదే స్థాయిలో లబ్ధిపొందటం వంటి ధోరణి ఉండొద్దు. లబ్ధిదారులు, అధికారి పార్టీ మధ్య నీకిది నాకది(క్విడ్ ప్రో కో) తరహా విధానానికి ఎలక్టోరల్ బాండ్ అనేది పనిముట్టుగా మారకూడదు' అని వాదోపవాదనల సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ' దాత వివరాలు గ్రహీత పార్టీకి తెలుసు. తాను ఎవరికి విరాళమిచ్చేది ఇంకో పార్టీకి తెలియకూడదని దాత కోరుకుంటున్నాడు. విరాళాల బదిలీ వ్యవహారం దాతకు, ఆ రాజకీయ పార్టీకి ముందే తెలిసినప్పుడు ఈ వివరాలు సాధారణ పౌరుడికి మాత్రం తెలియాల్సిన పని లేదని కేంద్రం వాదించడంలో ఆంతర్యమేంటి?' అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది.

### యాపిల్‌కు నోటీసులు

**ఐఫోన్ల హ్యాకింగ్ అలర్ట్‌లపై దర్యాప్తు మొదలుపెట్టిన సీఈఆర్‌టీ–ఇన్**

**న్యూఢిల్లీ:** విపక్ష ఎంపీల ఐఫోన్లకు వచ్చిన హ్యాకింగ్ అలర్ట్‌ల ఉదంతంలో కేంద్ర సైబర్‌సెక్యూరిటీ దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. భారత కంప్యూటర్ అత్యవసర స్పందనా బృందం(సీఈఆర్‌టీ–ఇన్) సంస్థ తన దర్యాప్తు ఇప్పటికే ప్రారంభించిందని కేంద్ర సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ గురువారం చెప్పారు. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు ఐఫోన్ల దాడికి యత్నించినట్లు ఏమైనా ఆధారాలుంటే సమర్పించాలని ఐఫోన్ తయారీసంస్థ యాపిల్‌ను కోరుతూ కేంద్రం నోటీసులు పంపింది. సీఈఆర్‌టీ–ఇన్ ఆధ్వర్యంలో జరిగే దర్యాప్తుకు యాపిల్ సంస్థ సహకరించనుందని కృష్ణన్ చెప్పారు. సీఈఆర్‌టీ అనేది జాతీయ నోడల్ ఏజెన్సీ. కంప్యూటర్ భద్రతను సవాల్ చేసే ఘటనలు సంభవించినపుడు వెంటనే సీఈఆర్‌టీ స్పందించి తగు సూచనలు, సలహాలు ఇస్తుంది.

**45** వన్డే ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా షమీ అవతరించాడు. షమీ ఈ ఘనతను 14 మ్యాచ్‌ల్లోనే అందుకోవడం విశేషం. జహీర్ ఖాన్ (23 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు), జవగళ్ శ్రీనాథ్ (34 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును షమీ అధిగమించాడు.

**357** వన్డే ప్రపంచకప్‌లో ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ లేకుండా అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. పాకిస్తాన్ (348/8; 2019లో ఇంగ్లండ్‌పై) పేరిట ఉన్న రికార్డును భారత్ సవరించింది.

**8** వన్డే ఫార్మాట్‌లో ఒకే ఏడాది కనీసం 1000 పరుగులు పూర్తి చేయడం విరాట్ కోహ్లికిది 8వసారి. సచిన్ టెండూల్కర్ (7 సార్లు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి అధిగమించాడు.

**2** ఒకే ప్రపంచకప్‌లో భారత జట్టు వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో గెలుపొందడం ఇదే రెండోసారి. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో నెగ్గింది.

**8** ప్రపంచకప్ టోర్నీలో భారత్ సెమీఫైనల్ దశకు అర్హత సాధించడం ఇది ఎనిమిదోసారి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా ఎనిమిదిసార్లు చొప్పున సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

**4** భారత్ తరఫున వన్డేల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను అత్యధికంగా నాలుగుసార్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. జవగళ్ శ్రీనాథ్, హర్భజన్ సింగ్ మూడుసార్లు చొప్పున ఈ ఘనత సాధించారు.

### ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ × నెదర్లాండ్స్
వేదిక: లక్నో
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

# సూపర్ సెవెన్‌తో సెమీస్‌కి భారత్

## శ్రీలంకపై 302 పరుగులతో టీమిండియా ఘనవిజయం

అదరగొట్టిన గిల్, కోహ్లి, అయ్యర్ • ఐదు వికెట్లతో హడలెత్తించిన షమీ
మెరిపించిన సిరాజ్, బుమ్రా • ఆదివారం దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'

**మన టాప్ స్టార్లు పరుగు పెడితే... పేసర్లు పడగొడితే... ఏ ప్రత్యర్థి అయినా ఏం చేస్తుంది... చిత్తుగా ఓడటం తప్ప! మాజీ విశ్వవిజేత శ్రీలంకది కూడా అదే పరిస్థితి. మొదట... శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌ల ధాటికి సింహళ బౌలింగ్ కళ తప్పింది. తర్వాత కొండంత లక్ష్యం ఛేదించబోతే మన పేస్ దళం నిప్పులు చెరిగింది. అంతే నాలుగో ఓవర్ అయినా ముగియకముందే శ్రీలంక 3/4 స్కోరుతో పరాభవానికి వికెట్ల గేట్లెత్తి కేవలం 55 పరుగులకే ఆలౌటై చిత్తుగా ఓడిపోయింది.**


షమీ

ముంబై: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో 10 జట్లు తలపడుతున్నాయి. నెదర్లాండ్స్, బంగ్లాదేశ్‌లాంటి చిన్న జట్లు... న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలాంటి మేటి టీమ్‌లు... ఐదుసార్లు జగజ్జేత ఆస్ట్రేలియా, డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ బరిలో ఉన్నా... ఒకే ఒక్క జట్టు, నంబర్‌వన్ భారత్ అప్రతిహత జైత్రయాత్ర ముందు ఏ ఒక్కటీ నిలువలేకపోతున్నాయి. తాజాగా భారత్ బల ప్రదర్శనకు 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక కుదేలైంది. టీమిండియా ఆల్‌రౌండ్ ఆటతీరుకు లంక అతలాకుతలమైంది. బ్యాటింగ్ ధాటికి తట్టుకోలేక, బౌలింగ్ దాడిని ఎదుర్కోలేక శ్రీలంక 302 పరుగుల భారీ తేడాతో భారత్ చేతిలో ఓడింది. వరుసగా ఏడో విజయంతో రోహిత్ శర్మ బృందం 14 పాయింట్లతో ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 5న కోల్‌కతాలో దక్షిణాఫ్రికా జట్టుతో ఆడుతుంది.

అంతకుముందు శ్రీలంక కెప్టెన్ కుశాల్ మెండిస్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన రోహిత్ బృందం 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీస్కోరు చేసింది. గిల్ (92 బంతుల్లో 92; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), కోహ్లి (94 బంతుల్లో 88; 11 ఫోర్లు), అయ్యర్ (56 బంతుల్లో 82; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) చెలరేగారు. మదుషంకకు 5 వికెట్లు దక్కాయి. తర్వాత శ్రీలంక కనీసం టి20 ఫార్మాట్‌కు తగ్గ ఓవర్లయినా ఆడలేకపోయింది. 19.4 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలి ప్రపంచకప్ చరిత్రలో తమ అత్యల్ప స్కోరును నమోదు చేసింది. పదో స్థానంలో దిగిన కసున్ రజిత (14) టాప్‌స్కోరర్ అంటే భారత బౌలింగ్ ప్రత్యర్థి బ్యాటర్లను ఎంతగా బయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా ఇన్నింగ్స్ తొలి బంతికే శ్రీలంక పతనానికి నాంది పలికితే... మరుసటి ఓవర్లలో సిరాజ్ (3/16) చావు దెబ్బ తీశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (5/18) బంతినందుకున్నాక శ్రీలంక ఆలౌట్ కావడానికి ఎంతోసేపు పట్టలేదు.


కోహ్లి, గిల్


అయ్యర్


సిరాజ్
మాథ్యూస్ క్లీన్‌బౌల్డ్

### శతకం లేకపోయినా చితగ్గొట్టారు...

మ్యాచ్ మొదలవకముందు టాస్ నెగ్గిన ఆనందం, భారత ఇన్నింగ్స్ ఆరంభించగానే కెప్టెన్ రోహిత్ శర్మ (2 బంతుల్లో 4; 1 ఫోర్) అవుటైన సంబరం ఈ పోరులో లంకకు లభించిన అల్ప సంతోషాలు. తదనంతరం ఓపెనర్ గిల్ దూకుడు టాపార్డర్ బ్యాటర్ కోహ్లి క్లాసిక్ ఇన్నింగ్స్ వాంఖెడేలో క్రికెట్ ప్రియుల్ని ఆనంద పరవశం చేశాయి. ఇద్దరే 29.4 ఓవర్లు బ్యాటింగ్ చేశారు. లంక బౌలర్ల పని పట్టి స్కోరు బోర్డును పరుగు పెట్టించారు. దీంతో 16వ ఓవర్లోనే భారత్ 100కు చేరింది. ముందుగా కోహ్లి (50 బంతుల్లో), కాసేపటికే గిల్ (55 బంతుల్లో) అర్ధ సెంచరీలు పూర్తిచేసుకున్నారు. ఆ తర్వాత కూడా బ్యాటింగ్ ధాటి కొనసాగడం, లంక బౌలింగ్ తేలిపోవడంతో సెంచరీల దిశగా సాగారు. కానీ సఫలం కాలేకపోయారు. రెండో వికెట్‌కు 189 పరుగులు జోడించాక గిల్, కోహ్లి మూడు పరుగుల వ్యవధిలో పెవిలియన్ చేరారు. దీంతో వన్డేల్లో అత్యధిక సెంచరీల చేసిన ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ (49) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సమం చేయలేకపోయాడు.

### అయ్యర్ సూపర్

నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ వాళ్లిద్దరి ఇన్నింగ్స్‌లను తలపించేలా బ్యాటింగ్ చేశాడు. అది కూడా దూకుడు జతచేసి! భారీ సిక్సర్లతో అయ్యర్ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. వేగంగా 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. రాహుల్ (21; 2 ఫోర్లు), సూర్యకుమార్ (12) చేసింది తక్కువే అయినా అయ్యర్ మెరుపులతో 45వ ఓవర్లోనే భారత్ 300 మార్కు దాటింది. శ్రేయస్ చితగ్గొట్టాడు... కానీ గిల్, కోహ్లిలలాగే శతకం మాత్రం కొట్టలేకపోయాడు. జడేజా (24 బంతుల్లో 35; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు.

### ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే. |
|---|---|---|---|---|---|
| భారత్ | 7 | 7 | 0 | 14 | 2.102 |
| దక్షిణాఫ్రికా | 7 | 6 | 1 | 12 | 2.290 |
| ఆస్ట్రేలియా | 6 | 4 | 2 | 8 | 0.970 |
| న్యూజిలాండ్ | 7 | 4 | 3 | 8 | 0.484 |
| పాకిస్తాన్ | 7 | 3 | 4 | 6 | -0.024 |
| అఫ్గానిస్తాన్ | 6 | 3 | 3 | 6 | -0.718 |
| శ్రీలంక | 7 | 2 | 5 | 4 | -1.162 |
| నెదర్లాండ్స్ | 6 | 2 | 4 | 4 | -1.277 |
| బంగ్లాదేశ్ | 7 | 1 | 6 | 2 | -1.446 |
| ఇంగ్లండ్ | 6 | 1 | 5 | 2 | -1.652 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి) మదుషంక 4; గిల్ (సి) మెండిస్ (బి) మదుషంక 92; కోహ్లి (సి) నిసాంక (బి) మదుషంక 88; అయ్యర్ (సి) తీక్షణ (బి) మదుషంక 82; రాహుల్ (సి) హేమంత (బి) చమీర 21; సూర్యకుమార్ యాదవ్ (సి) మెండిస్ (బి) మదుషంక 12; జడేజా (రనౌట్) 35; షమీ (రనౌట్) 2; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 357. వికెట్ల పతనం:** 1-4, 2-193, 3-196, 4-256, 5-276, 6-333, 7-355, 8-357. **బౌలింగ్:** మదుషంక 10-0-80-5, చమీర 10-2-71-1, కసున్ రజిత 9-0-65-0, ఏంజెలో మాథ్యూస్ 3-0-11-0, తీక్షణ 10-0-67-0, హేమంత 8-0-52-0.

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 0; కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; కుశాల్ మెండిస్ (బి) సిరాజ్ 1; సమరవిక్రమ (సి) అయ్యర్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) జడేజా (బి) షమీ 1; మాథ్యూస్ (బి) షమీ 12; హేమంత (సి) రాహుల్ (బి) షమీ 0; చమీర (సి) రాహుల్ (బి) షమీ 0; తీక్షణ (నాటౌట్) 12; రజిత (సి) గిల్ (బి) షమీ 14; మదుషంక (సి) అయ్యర్ (బి) జడేజా 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 55. వికెట్ల పతనం:** 1-0, 2-2, 3-2, 4-3, 5-14, 6-14, 7-22, 8-29, 9-49, 10-55. **బౌలింగ్:** బుమ్రా 5-1-8-1, సిరాజ్ 7-2-16-3, షమీ 5-1-18-5, కుల్దీప్ యాదవ్ 2-0-3-0, జడేజా 0.4-0-4-1.



# అజేయంగా భారత్

## కొరియాపై 5–0తో ఘనవిజయం

రాంచీ: సొంతగడ్డపై తొలిసారి జరుగుతున్న ఆసియా హాకీ మహిళల చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. దక్షిణ కొరియా జట్టుతో గురువారం జరిగిన చివరిదైన ఐదో లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున సలీమా టెటె (6వ, 36వ ని.లో) రెండు గోల్స్ చేయగా... నవ్‌నీత్ కౌర్ (36వ ని.లో), వందన కటారియా (49వ ని.లో), నేహా (60వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తొమ్మిది పాయింట్లతో చైనా రెండో స్థానంలో, జపాన్ మూడో స్థానంలో, ఏడు పాయింట్లతో కొరియా నాలుగో స్థానంలో నిలిచి భారత్‌తోపాటు సెమీఫైనల్‌కు అర్హత పొందాయి. శనివారం జరిగే సెమీఫైనల్స్‌లో జపాన్‌తో చైనా; కొరియాతో భారత్ తలపడతాయి.

# ముంబైకు చుక్కెదురు

ముల్లన్‌పూర్ (చండీగఢ్): సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు కథ క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బరోడా జట్టు మూడు వికెట్ల తేడాతో ముంబైను ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ముందుగా ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. శివమ్ దూబే (36 బంతుల్లో 48; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సర్ఫరాజ్ ఖాన్ (22 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం బరోడా జట్టు 18.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి నెగ్గింది. విష్ణు సోలంకి (30 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) బరోడా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో పంజాబ్ ఐదు వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, ఢిల్లీ 39 పరుగుల తేడాతో విదర్భ జట్టుపై, కేరళ జట్టుపై అస్సాం ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్ చేరుకున్నాయి.


విష్ణు సోలంకి

# తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో చెక్ పోస్టులు

- కేంద్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ జవహర్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** ఈ నెలలో ఎన్నికలు జరగనున్న తెలంగాణ రాష్ట్ర అధికారులతో సమన్వయంతో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. ఈ నెలలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అంతర్ రాష్ట్ర సరిహద్దు అంశాలపై గురువారం ఢిల్లీ నుంచి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ఇతర కమిషనర్లతో కలిసి ఆయా రాష్ట్రాలు, సరిహద్దు రాష్ట్రాల సీఎస్, డీజీపీ, సీఈవో, ఇతర అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ మద్యం, డబ్బు అక్రమ రవాణాను నియంత్రించేందుకు తెలంగాణతో సరిహద్దు గల జిల్లాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ రాష్ట్ర అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ రాష్ట్రాల సరిహద్దు రాష్ట్రాలు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా, స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్త, జీఎస్టీ చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్, ఎస్ఈబీ డైరెక్టర్ రవిప్రకాష్, ఆర్.పి.మీనా తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ జవహర్‌రెడ్డి, అధికారులు

**రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం**

**చిల్లకల్లు (జగ్గయ్యపేట):** తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టం చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు సమీపంలోగల భీమవరం జీఎమ్మార్ టోల్‌ప్లాజాలో గురువారం ఏపీ, తెలంగాణలకు చెందిన ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ మద్యం, నగదు అక్రమ తరలింపు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. 

# సాక్షి
# విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 3 । నవంబర్ । 2023






## దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిభాస్ రంజన్ దే దంపతులు గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



## రేపటి నుంచి సంగీత మహోత్సవాలు

విజయవాడ దుర్గాపురంలోని సంగీత కళాశాలలో 4 నుంచి ప్రారంభం కానున్న 30వ వార్షిక సంగీత మహోత్సవాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. –IIలో▸



## డిజిటల్ క్లాస్ రూం ప్రారంభం

మొగల్రాజపురం: విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ బి.నవ్య గురువారం ప్రారంభించారు.

## న్యూస్‌రీల్

### జిల్లాలో 89.51 శాతం పింఛన్ పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక 89.51 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,36,986 మందికి గాను 2,12,120 మంది పింఛన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 95.13 శాతం, విజయవాడ రూరల్‌లో 92.61 శాతం, నందిగామ అర్బన్‌లో 92.34 శాతం, తిరువూరు అర్బన్‌లో 91.2 శాతం, విజయవాడ అర్బన్‌లో 91.09 శాతం పంపిణీ పూర్తయ్యింది.

### తలనీలాల హక్కునకు బహిరంగ వేలం




మోపిదేవి: స్థానిక వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించుకునే తలనీలాలు పోగుచేసుకునే హక్కును ఏలూరుకు చెందిన ఉమాశ్రీ ఎంటర్ ప్రైజెస్ కై వసం చేసుకుంది. ఆలయ ప్రాంగణంలో గురువారం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలపరిమితికి వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలంలో రూ. 50,01,039లకు తలనీలాలు పోగుచేసుకునే హక్కును ఉమాశ్రీ ఎంటర్ ప్రైజెస్, దేవస్థానంలో అల్యూమినియం ఫ్రేమ్ వర్క్ కౌంటర్లు నిర్మించేందుకు గుడివాడకు చెందిన దోసపాటి హరిప్రసాద్ లైసెన్స్ పొందినట్లు ఆలయ ఏసీ వివరించారు.

### కార్తికేయుని సేవలో మంత్రి కారుమూరి



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మంత్రి కారుమూరి నాగేశ్వరావు, లక్ష్మీకిరణ్ దంపతుల పేరున రూ. 50 వేలు విరాళంగా అందించారు.

### హోరాహోరీగా బ్యాడ్మింటన్ టోర్నీ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు రెండో రోజైన గురువారం ఉత్కంఠగా సాగాయి. బందరురోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం, గురునానక్ కాలనీలోని సాయి సందీప్ అకాడమీల్లో క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. బాయ్స్ సింగిల్స్ అండర్–15లో హర్షవర్ధ్ షాదీష్(కర్ణాటక), సుజల్ రక్షిత్ (జార్ఖండ్), సుమిత్ చహర్ (ఉత్తరప్రదేశ్) రెండో రౌండ్‌లో విజయం సాధించి మూడో రౌండ్‌కు ఎంపికయ్యారు. బాలికల విభాగం సింగిల్స్ అండర్–15 విభాగంలో సౌమ్య (బీహార్), దేవాన్షి దలాల్ (హరియానా) శాంతి శ్రీ (ఆంధ్రప్రదేశ్), ఆనందన్(తమిళనాడు) మూడో రౌండ్‌కు ఎంపిక అయ్యారు. అండర్ –17 బాలికల విభాగంలో లెనిన్ తాయానిజమ్ (మధ్యప్రదేశ్), యుక్తి చావన్(మహారాష్ట్ర), లక్ష్య రాజేష్ (కర్ణాటక), నక్షత (ఆంధ్రప్రదేశ్) మూడో రౌండ్‌కు ఎంపిక అయ్యారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

జనమే బలం.. జనమే ధనం..

కలిసి అడుగేస్తే ఓ ప్రభంజనం.. కలిసి నినదిస్తే సామాజిక సంబరం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా అవనిగడ్డలో సామాజిక సాధికార బస్సు యాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. ఊరూవాడా ఉత్సవమై కదిలి వచ్చింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన జనాలతో అవనిగడ్డ ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది.



సామాజిక హోరు.. అశేష జనవాహిని మధ్య సాగుతున్న సామాజిక సాధికారత బస్సు యాత్ర

# సామాజిక జైత్రయాత్ర

## అవనిగడ్డలో హోరెత్తిన జై జగన్ నినాదం

- సామాజిక సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన జనం
- ప్రధాన రహదారిలో కిలో మీటర్ మేర జనసందోహం
- సీహెచ్‌సీతో పాటు డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- సభలో అతిథుల ప్రసంగాలకు అమోఘ స్పందన



సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

అవనిగడ్డ: సామాజిక సాధికార బస్సు యాత్రకు అవనిగడ్డ ప్రజానీకం బ్రహ్మరథం పట్టారు. అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల వరకూ, అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకూ 1.5 కి.మీ మేర సాగిన బస్సు యాత్రలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీలు నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని వెంకట్రామయ్య(నాని), కైలే అనిల్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు పార్టీ కార్యాలయం నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకూ పాదయాత్ర చేశారు. అక్కడ నుంచి సభాస్థలికి బస్సు యాత్రగా వచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా కేరింతలు కొడుతూ ఉత్సాహంగా బస్సు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్‌తో పాటు రూ.3.20 కోట్లతో ఆధునికీకరించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రులు ప్రారంభించారు.

**కిక్కిరిసిన ప్రధాన రహదారి..**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలఅభ్యున్నతికి ప్రభుత్వం చేసిన కృషిని వివరించేందుకు చేపట్టిన ఈ బస్సు యాత్రలో దారి పొడవునా జై జగన్ నినాదాలు మార్మోగాయి. అవనిగడ్డ, నాగాయలంక ప్రధాన రహదారి కిలో మీటర్ మేర జనంతో నిండిపోయింది. మహిళలు సైతం పెద్ద ఎత్తున బస్సు యాత్ర ముందు నడిచారు. కుర్రకారు ఈలలు, కేకలు వేస్తూ బస్సు యాత్రలో సందడి చేశారు. నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నేత గార్లపాటి గోపీ యువకులతో కలిసి డ్యాన్స్ చేశారు.

**దద్దరిల్లిన సభ..**

సామాజిక సాధికార బస్సు యాత్రను పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభ నేతల ప్రసంగాలతో దద్దరిల్లింది. మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ నందిగం సురేష్ చేసిన ప్రసంగాలు జనాన్ని ఉత్తేజ పరిచాయి. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ చేసిన ప్రసంగం వీక్షకులను ఆలోచింపజేసింది. మంత్రులు, ఎంపీలు, నాయకులు ప్రసంగాలు గంటన్నర సేపు జరగ్గా సభకు వచ్చిన జనాలు ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో అవనిగడ్డలో పండుగ వాతావరణం నెలకొంది.

**హోరెత్తిన నృత్యాలు..**

సామాజిక సాధికార బస్సుయాత్రను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తీన్మార్ డప్పుల మోత కుర్రకారుని ఉత్తేజ పరిచాయి. డప్పు విన్యాసాలు, థింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సామాజిక సాధికార బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

### జగనన్నతో మనం..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు. భారత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్నారు. 8 మందిని జెడ్పీ చైర్మన్‌లుగా బీసీలను నియమించి, బడుగు బలహీన వర్గాలకు తోడుగా ఉంటున్నారు. అటువంటి జగనన్నకు మనం అండగా నిలవాలి

– ఉప్పాల హారిక, జెడ్పీ చైర్ పర్సన్ కృష్ణా జిల్లా

### బీసీ జనగణన సాహసోపేతం..



ఆవులు, గేదెలు, మేకలు ఇతర జంతువులకు గణన చేస్తున్నారు. ఎప్పటి నుంచో బీసీ జనగణన చేయమంటే ఎవరూ పట్టించుకోలేదు. సామాజిక న్యాయం చేయాలనే సంకల్పంతో సీఎం జనగణన చేయాలని నిర్ణయించారు. ఇది సాహసోపేతమైన నిర్ణయం.

– జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ

### కుటుంబ సభ్యులుగా..



నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అంటూ ఎంతో ఆప్యాయంగా పిలవడం ద్వారా సీఎం రాష్ట్ర ప్రజలందరినీ కుటుంబ సభ్యులుగా చేసుకున్నారు. చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీలను వాడుకున్నారు. సీఎం జగన్ వారిని అన్ని విధాలా పైకి తీసుకొచ్చేలా పనిచేస్తున్నారు.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

### అసలైన సాధికారత ఇది..



చంద్రబాబు అవినీతి అక్రమాలకు పెట్టింది పేరు అయితే.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి న్యాయం ధర్మం వైపు ఉంటారు. 95 శాతం హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి పొత్తులతో పనిలేదు. ఆయన రాష్ట్ర ప్రజలను, పైన దేవుడిని నమ్ముకున్నారు. మంత్రివర్గంలో పది బీసీలకు, ఐదు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు ఇచ్చి అసలైన సామాజిక సాధికారత చూపించారు.

– సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్యే అవనిగడ్డ



రోగులకు భరోసా.. డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రులు కారుమూరి, జోగి



జోరు.. హుషారు.. థింసా నృత్యం చేస్తున్న కళాకారులు




శుభారంభం.. జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హారిక, ఎమ్మెల్సీ సునీత

## దుర్గమ్మ దసరా ఆదాయం రూ. 14.71 కోట్లు

- 5 లక్షల మందికి పైగా అన్న ప్రసాదం
- రికార్డు స్థాయిలో లడ్డూ ప్రసాదాల విక్రయాలు
- మీడియా సమావేశంలో దేవస్థానం చైర్మన్, ఈవో



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించామని చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు తెలిపారు. దసరా ఉత్సవాలను దిగ్విజయంగా ముగిసిన నేపథ్యంలో చైర్మన్, ఈవోలు సంయుక్తంగా గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేశామన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది చేసిన ఏర్పాట్లతో భక్తులకు అతి తక్కువ సమయంలోనే చక్కటి దర్శనాన్ని కల్పించామన్నారు. నిరంతరం పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు, సూచనలు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరంతరం భక్తులు, భవానీలకు అన్న ప్రసాదం, అల్పాహారం అందజేశామని చెప్పారు. సుమారు 5 లక్షల మందికి అన్న ప్రసాదం అందజేశామని, రికార్డు స్థాయిలో 25 లక్షలు పైబడి లడ్డూ ప్రసాదాలను విక్రయించామని చెప్పారు. దసరా ఉత్సవాలు 9 రోజులు నిర్వహించినప్పటికీ మరో ఆరు రోజులపాటు భవానీల తాకిడి కనిపించిందన్నారు. 3,400 మంది పోలీసు సిబ్బందితో ఉత్సవాలలో భద్రతను పర్యవేక్షించారన్నారు.

**15లక్షల మంది భక్తులు..**

ఉత్సవాలలో టికెట్లు, పూజలు, హుండీల ద్వారా రూ.14.71 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఇక ఖర్చుల విషయానికి వస్తే సుమారు ఇంజినీరింగ్ వర్కులకే రూ. 7.5 కోట్ల మేర ఖర్చు అయిందన్నారు. ఉత్సవాలలో మొత్తంగా 15 లక్షల మంది విచ్చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజులలో భవానీ దీక్షలకు చక్కటి ఏర్పాట్లను చేయడంతో పాటు భక్తులు, భవానీలందరికీ అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, వైదిక కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అంతర్ రాష్ట్ర సాహిత్యం, సాంస్కృతిక పోటీలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తాజ్‌మహల్ సెట్

గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో 4 రోజుల పాటు జరిగే మౌంట్ ఫోర్ట్ విద్యాసంస్థల 23వ అంతర్ రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక పోటీలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 6వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో హైదరాబాద్, పూణే ప్రావిన్స్ పరిధిలోని 5 రాష్ట్రాల్లో ఉన్న 27 మౌంట్‌ఫోర్ట్ స్కూల్స్‌కు చెందిన 700 మంది విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. సాహిత్య విభాగంలో 33 అంశాలు, సాంస్కృతిక విభాగంలో 16 అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా ఎస్పీ పి. జాషువా ముఖ్య అతిథిగా, సీబీఎస్ఈ ప్రాంతీయ సంచాలకుడు శేఖర్‌చంద్ర గౌరవ అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల నిమిత్తం పాఠశాలలో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్ సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## చందర్లపాడు ఎంపీపీ రాజీనామా



జెడ్పీ సీఈవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న చందర్లపాడు ఎంపీపీ

చందర్లపాడు(నందిగామ టౌన్): అనారోగ్య కారణాల వల్ల తనపై ఉంచిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించలేకపోతుండటంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చందర్లపాడు ఎంపీపీ వేల్పుల ఏసమ్మ పేర్కొన్నారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసుకు గురువారం ఆమె రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యానని చెప్పారు. ఆ తర్వాత శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన రావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ సహకారంతో ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోగా మండల పరిషత్ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గతేడాది నుంచి అనారోగ్యం పాలయ్యానని, ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగిందని వివరించారు. అప్పటి నుంచి బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోతున్నానన్నారు. తన అనారోగ్య సమస్యల దృష్ట్యా తన పదవికి రాజీనామా చేస్తున్నానని దీనిలో ఎవరి బలవంతం, ప్రోద్బలం లేదని, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెలకుదిటి శివనాగేశ్వరరావు ఉన్నారు.

## పారదర్శకంగా పరిష్కారం

- ఈ–క్రాప్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభల నిర్వహణ
- రైతుల నుంచి వచ్చిన 5,383 అభ్యంతరాలకు 5,379 పరిష్కారం
- మరో 4 అభ్యంతరాల్లో సాంకేతిక సమస్యలతో పెండింగ్
- రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు



పెదన మండలం పెనుమల్లిలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ(ఫైల్)

పెదన: కృష్ణా జిల్లాలో ఈ–క్రాప్, ఈ–కేవైసీల ప్రక్రియ పూర్తికావడంతో చివరిగా రైతులకు మరో అవకాశం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ–కేవేసీ చేసుకోని వారితోపాటు రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకునేందుకు వ్యవసాయశాఖాధికారులు ఆర్‌బీకేలు ద్వారా గ్రామ సభలను నిర్వహించింది. ఈ–క్రాప్, ఈ–కేవైసీ ముసాయిదా జాబితాలను ప్రదర్శించి వాటిల్లో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తీసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు అక్టోబర్ 26 నుంచి 29వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలలో గ్రామ సభలు నిర్వహించింది. అత్యధికంగా మొవ్వ మండలం నుంచి 807 అభ్యంతరాలు రాగా, అవనిగడ్డ నుంచి 31 మంది రైతుల నుంచి అభ్యంతరాలు లిఖితపూర్వకంగా అందజేశారు. కృత్తివెన్ను మండలం నుంచి అభ్యంతరాలు ఏమీ రాలేదు. రైతులు తెలిపిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న వ్యవసాయశాఖాధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. 5,383 అర్జీలకు 5,379 పరిష్కరించారు. మిగిలిన నాలుగు అభ్యంతరాలకు సంబంధించి సాంకేతిక సమస్యలతో పెండింగ్‌లో ఉన్నాయి.

**4,13,423 ఎకరాలకు ఈ–క్రాప్ పూర్తి..**

ఖరీఫ్–2023కి సంబంధించి సెప్టెంబర్‌లో వ్యవసాయశాఖ ఈ–క్రాప్ పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,76,393 మంది రైతులుంటే వీరికి సంబంధించి 5,17,393 ఎకరాలున్నాయి. వీటిల్లో ఈ–క్రాప్ 4,13,423 ఎకరాలలో పూర్తి చేశారు. మరో 1.03లక్షల ఎకరాలకు సంబంధించి రైతులు ఈ–క్రాప్ చేయించుకోవడానికి ముందుకు రాలేదు. అలాగే కొందరు రైతులు చనిపోయిన వారు కూడా ఉండటంతో పంట మాత్రం ఈ–క్రాప్ అయిందే తప్ప సదరు రైతు లేకపోవడంతో ఈ–కేవైసీ కాలేదు. అలా చాలా మంది ఈ–కేవైసీలు పెండింగ్‌లో ఉన్నాయి.

**1,62,169 మందికి ఈ–కేవైసీ పూర్తి..**

జిల్లా వ్యాప్తంగా 4,13,423 ఎకరాలను ఈ–క్రాప్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాల్సిందేనని పేర్కొనడంతో 1,62,169 మంది రైతులు తమకు సంబంధించిన 3,98,564 ఎకరాలను ఈ–కేవైసీ చేయించుకున్నారు.

### తుది జాబితాలకు కసరత్తు..



ఈ–క్రాప్, ఈ–కేవైసీలకు సంబంధించి తుది జాబితాలను సిద్ధం చేయడానికి గ్రామసభలను నిర్వహించాం. ఆర్‌బీకేలలో ముసాయిదా జాబితాలను ప్రదర్శించి వాటిల్లో ఏమైనా తప్పులు, అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తీసుకున్నాం. ఈ–క్రాప్, ఈ–కేవైసీలు చేయించుకోవాలని ప్రతి గ్రామంలో వలంటీర్ల ద్వారా, వీఏఏలు సమాచారం ఇచ్చారు. చివరిగా గ్రామసభలు ద్వారా అభ్యంతరాలను తీసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరించాం. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం.

– పద్మావతి, వ్యవసాయశాఖ అధికారి, కృష్ణా జిల్లా

## మూడో దశ సమగ్ర సర్వే పనులు వేగవంతం

### జేసీ సంపత్‌ కుమార్‌ ఆదేశం



గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్‌ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్‌ కలెక్టర్‌ డాక్టర్‌ పి.సంపత్‌ కుమార్‌ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో గురువారం జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌ కుమార్‌ రెవెన్యూ, సర్వే అధికారులతో సమగ్ర భూ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాలో మూడో దశ కింద 100 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టామని, వీటిలో ఇప్పటికే 29 గ్రామాల్లో 13 నోటిఫికేషన్లు జారీచేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్‌ వ్యాలిడేషన్‌, గ్రౌండ్‌ ట్రూతింగ్‌ ప్రక్రియలను త్వరితగతిన పూర్తిచేసి నిర్దేశిత గడువు డిసెంబర్‌ మాసాంతంలోగా పూర్తిచేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. సమావేశంలో సబ్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌, డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావు, ఆర్డీఓలు పి.సాయిబాబా, మాధవి, ఏడీ సర్వే శ్రీనివాస్‌, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 4వ తేదీ నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్‌ డైరెక్టర్‌ ఎ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్‌ అండ్‌ టైలరింగ్‌, డ్రెస్‌ డిజైనింగ్‌, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్‌ పెయింటింగ్‌, స్క్రీన్‌ ప్రింటింగ్‌, బాతిక్‌ ప్రింటింగ్‌, జామ్‌ అండ్‌ జ్యూస్‌ తయారీ, బ్యూటీ కేర్‌, ఎలక్ట్రికల్‌ టెక్నీషియన్‌, ఏసీ,రిఫ్రిజిరేటర్‌ మెకానిజం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్న వారు విజయవాడలోని సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ, 0866–2470420 నంబరులో గానీ సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

# నేడు విద్యార్థులకు సామర్థ్య సర్వే పరీక్ష

- అభ్యసన సామర్థ్యాలపై అంచనా కోసం సర్వే
- ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన 1434 పాఠశాలల్లో...
- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు
- ఇప్పటికే విద్యార్థులకు ప్రాక్టీస్‌ టెస్ట్‌ల నిర్వహణ



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా(ఫైల్‌)



పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు(ఫైల్‌)

కంకిపాడు(పెనమలూరు)/వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాఠశాల విద్యా వ్యవస్థ స్వరూపాన్ని, ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న అభ్యసన ఫలితాలను అంచనా వేసేందుకు దేశవ్యాప్తంగా నవంబర్‌ మూడున స్టేట్‌ ఎడ్యుకేషన్‌ ఎచీవ్‌మెంట్‌ 'సర్వే–2023 (ఎస్‌ఈఏఎస్‌) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్‌ షీట్స్‌ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు వర్క్‌షాప్‌లను కూడా విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయాల్సి ఉండటంతో ఎస్సీఈఆర్టీ మోడల్‌ ప్రశ్నపత్రాలను తయారు చేసి విద్యార్థులతో ప్రాక్టీస్‌ టెస్టు రూపంలో గత నెల 27నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ నిర్వహించాయి.

**సర్వే ఎందుకంటే...**

ఈ సర్వే ఫలితాల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, అభ్యసన అంతరాలను గుర్తించడంతోపాటు అమలవుతున్న విద్యా విధానం, బోధనా అభ్యసనాల్లో లోపాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. విద్యార్థులను తెలుగు/ఇంగ్లిష్‌, గణితంపై పరిజ్ఞానం అంచనా వేసి జాతీయ సగటుతో పోల్చి రాష్ట్రాల సగటుతో ర్యాంక్‌లు ఇవ్వనున్నారు. గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర విద్యా వ్యవస్థలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతో జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్ర సగటు ఎక్కువగా ఉండవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1434 పాఠశాలల్లో పరీక్ష**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 1434 విద్యాసంస్థల్లో 46,573 మంది విద్యార్థులకు పరీక్షలను నిర్వహించి వారి సామర్థ్యాలపై సర్వే చేపడతారు. ఎన్టీఆర్‌ జిల్లాలో 447 ప్రభుత్వ ప్రైవేట్‌ విద్యాసంస్థలకు చెందిన 22,405 మంది విద్యార్థులు పాల్గొనున్నారు. అందులో మూడో తరగతికి చెందిన వారు 7251 మంది, ఆరో తరగతికి చెందిన వారు 7546 మంది, తొమ్మిదో తరగతికి చెందిన వారు 7608 మంది విద్యార్థులు పాల్గొనున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన 987 విద్యాసంస్థలకు చెందిన 24,186 మంది పాల్గొననున్నారు. అందులో మూడో తరగతికి చెందిన 7004 మంది, ఆరో తరగతికి చెందిన 8424 మంది, తొమ్మిదో తరగతికి చెందిన 8140 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

**ఏ తరగతులకు ఎలా...**

సామర్థ్య పరీక్ష ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. లాంగ్వేజ్‌ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 10 ప్రశ్నలు, సాధారణ లాంగ్వేజ్‌లో 10 ప్రశ్నలు ఉంటాయి. 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాల పరీక్షా సమయం ఉంటుంది. ఎఫ్‌ఎల్‌ఎస్‌ లాంగ్వేజ్‌ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 15 ప్రశ్నలు, లాంగ్వేజ్‌ 15 ప్రశ్నలు ప్రశ్నపత్రంలో వస్తాయి. 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల సమయం ఉంటుంది. ఎఫ్‌ఎల్‌ఎస్‌ లాంగ్వేజ్‌ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 20 ప్రశ్నలు, లాంగ్వేజ్‌ 20 ప్రశ్నలు ఉండనున్నాయి. పరీక్ష నిర్వహణకు డిగ్రీ, డైట్‌, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు 1087 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరంతా పరీక్ష కేంద్రాల్లో ఫీల్డ్‌ ఇన్విస్టిగేటర్లు(ఇన్విజిలేటర్లు)గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వీరితో పాటుగా ఎంఈఓలు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలు 47 మందిని ఎంపిక చేసి బ్లాక్‌ లెవల్‌ కోఆర్డినేటర్లుగా నియమించారు.

### సామర్థ్య పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం



స్టేట్‌ ఎడ్యుకేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లకుండా, పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్లాక్‌ లెవల్‌ కోఆర్డినేటర్లు, ఫీల్డ్‌ ఇన్విస్టిగేటర్లకు శిక్షణ అందించాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు సర్వేలో భాగస్వాములు కావాలి.

–తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణాజిల్లా

### మంచి ఫలితాలు వచ్చే విధంగా చర్యలు



గత మూడేళ్లుగా తెలుగుతో పాటు ఇంగ్లిష్‌ మాధ్యమం కలిపి ఉన్న పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీంతో ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌ మీడియంలోనే ఈ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి విద్యార్థికి రెండు ఓఎంఆర్‌ షీట్స్‌ అందిస్తాం. ఎస్సీఈఆర్టీ సూచనల మేరకు పరీక్ష నిర్వహించేలా హెచ్‌ఎంలు కృషి చేయాలి.

–కేవీఎస్‌ కుమార్‌, డీవైఈవో, ఎన్టీఆర్‌ జిల్లా

# కృష్ణా తీరం..సుస్వరాల సాగరం

విజయవాడ నగరం సంగీత, సాహిత్యాల నిలయం. నగరానికి కొండంత అండగా ఇంద్రకీలాద్రి కాపు కాస్తూ ఉంటే, కృష్ణానది పరీవాహక ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తోంది. దీంతో తీర ప్రాంతం సుభిక్షంగా విలసిల్లుతూ వివిధ కళలకు పుట్టినిల్లుగా మారింది. ముఖ్యంగా శాస్త్రీయ సంగీతానికి కేరాఫ్‌ అడ్రస్‌ అయింది. కృష్ణవేణీ తరంగాల సవ్వడులకు పోటీగా సప్తస్వరాలు వినపడుతుంటాయి. సంగీతంలో లబ్ధప్రతిష్టులైన పలువురు సంగీత విద్వాంసులు ఈ నేలపై నడయాడారు. పలు సంగీత సంస్థలు ఏటా ఇక్కడ త్యాగరాజ స్వామి ఉత్సవాలు, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, సుసర్ల దక్షిణామూర్తి, దండమూడి రామ్మోహనరావు, లంకా వెంకటేశ్వర్లు వంటి ప్రముఖుల సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రధానమైన శ్రీ సద్గురు సంగీత సభ గత 30 ఏళ్లుగా వార్షిక సంగీత మహోత్సవాలు నిర్వహిస్తూ దేశ విదేశాలలో తమ ప్రతిభను చాటుకుంటున్న విద్వాంసులతో కచేరీలు నిర్వహిస్తోంది.



విద్వాన్‌ రామకృష్ణమూర్తి కచేరి(ఫైల్‌)



సంగీత ఉత్సవాలకు హాజరైన విద్వాంసులు(ఫైల్‌)

- 4 నుంచి 30వ వార్షిక సంగీత మహోత్సవాలు
- 8 రోజుల పాటు నిర్వహణ
- విఖ్యాత విద్వాంసుల కచేరీలు
- శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట

విజయవాడ కల్చరల్‌: శ్రీ సద్గురు సంగీత సభ 30 ఏళ్ల క్రితం నగరంలో ఊపిరి పోసుకుంది. శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దక్షిణ భారత దేశంలో చెన్నై నగరంలో డిసెంబరు, జనవరి నెలల్లో సంగీత ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. లక్షలాది మంది సంగీత శ్రోతలు కార్యక్రమాలను విజయవంతం చేస్తారు. అక్కడ కచేరీ చేయడమంటే జన్మ సుకృతంగా భావిస్తారు. అదే స్థాయిలో నగరానికి చెందిన శ్రీ సద్గురు సంగీత సభ సంగీత సేవ చేస్తోందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈనెల 4 వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు అత్యంత ప్రతిభావంతులైన విద్వాంసులతో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాల వేదికగా ప్రతిరోజూ సాయంత్రం ఉత్సవాలు నిర్వహిస్తోంది.

**కార్యక్రమాలు ఇలా...**

- 4 వ తేదీ శనివారం అశ్వత్థ నారాయణన్‌ గాత్రం,
- 5 వ తేదీ ఆదివారం అనహిత, అపూర్వ గాత్ర యుగళం
- 6 తేదీ సోమవారం యు.రాజేష్‌ మాండలిన్‌
- 7 వ తేదీ అమృత వెంకటేష్‌ గాత్రం
- 8 వ తేదీ విష్ణుభొట్ల సోదరీమణుల కచేరీ,
- 9 వ తేదీ ఏజే నందిని గాత్రం
- 10 వ తేదీ హైదరాబాద్‌ సోదరులు డి.రాఘవాచారి,డి.శేషాచారిల గాత్ర సంగీతం
- 11 వ తేదీ సంగీత విద్వన్మణి సుమతీ రామ్మోహనరావుకు సంగీత విద్వన్మణి బిరుదు, డాక్టర్‌ చింతా రవి బాలకృష్ణ బృందం భక్త ప్రహ్లాద కూచిపూడి యక్షగానం

### శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట



శ్రీ సద్గురు సంగీత సభ నిర్వహించే సంగీత ఉత్సవాలలో కర్నాటక సంగీతానికి పెద్దపీట వేస్తూ 30 ఏళ్లుగా కచేరీలు నిర్వహిస్తున్నాం. చెన్నైలో ఏటా జరిగే ఉత్సవాలకు దీటుగా ఇక్కడ కచేరీలు ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ జరిగే సంగీత సభలకు వందల సంఖ్యలో విద్వాంసులు హాజరవుతున్నారు.

–పోపూరి గౌరీనాథ్‌, శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి

### నేటి తరానికి తెలియజేసే ప్రయత్నమే...



ఆధునిక యుగంలో చాలా మంది ఇతర సంగీతం పట్ల మక్కువ చూపిస్తున్నారు. శాస్త్రీయ సంగీతం సర్వ, సాహిత్య సమ్మేళనం. దాని విలువలను నేటి తరానికి అందించే ప్రయత్నమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. పేద కళాకారులతో పాటు, ఆర్థికంగా వెనుకపడిన కళాకారులకు ఏటా సహాయం అందిస్తున్నాం.

–టీవీఎస్‌ ప్రకాష్‌, శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు

## గ్రంథాలయ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్‌ కోర్సు శిక్షణ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రావి శారద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర గుర్తింపుతో డిసెంబర్‌ మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సుకు 18 ఏళ్లు నిండిన ఇంటర్మీడియెట్‌ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, 5 నెలల పాటు జరిగే ఈ శిక్షణ తెలుగు, ఇంగ్లిష్‌ మాధ్యమాల్లో ఉంటుందని, ప్రభుత్వ రిజర్వేషన్లు పాటిస్తూ ఇంటర్మీడియెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేస్తామని తెలిపారు. ఇది రెగ్యులర్‌ కోర్సు కాబట్టి అడ్మిషన్‌ పొందిన అభ్యర్థులు ప్రతిరోజూ తరగతులకు రావాలని, శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాలకు ప్రిన్సిపాల్‌, పాతూరి నాగభూషణం స్కూల్‌ ఆఫ్‌ లైబ్రరీ సైన్స్‌, శ్రీ సర్వోత్తమ భవనం, విజయవాడ పేరుతో రూ.10 మనీఆర్డర్‌ పంపాలని, లేదా నేరుగా అభ్యర్థులు నేరుగా వచ్చి రూ.5 చెల్లించి దరఖాస్తు పొందవచ్చని అన్నారు. వివరాలకు 0866–2472313, 9290670671 నంబర్లో సంప్రదించాలని ఆమె కోరారు.

## పాత గొడవల నేపథ్యంలో యువకుల మధ్య ఘర్షణ

కంచికచర్ల: ఏడాది క్రితం ఓ యువతి విషయంలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో మరోసారి ఘర్షణకు దారితీసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందిగామ రూరల్‌ సీఐ ఐవీ నాగేంద్రకుమార్‌ కథనం మేరకు డిగ్రీ పూర్తి చేసిన కంచికచర్లకు చెందిన కె.శ్యామ్‌కుమార్‌, అవినాష్‌ అనే యువకుడు వరసకు అన్నదమ్ములు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన హరీష్‌ కంచికచర్ల మిక్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ పూర్తిచేశాడు. ఏడాది కిందట అవినాష్‌, హరీష్‌ ఇద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమించారు. ఆ అమ్మాయి హరీష్‌తో చనువుగా ఉంటుండటంతో జీర్ణించుకోలేని అవినాష్‌ ఆ విషయాన్ని తన సోదరుడు శ్యామ్‌కుమార్‌తో చెప్పాడు. వారిద్దరూ కలసి హరీష్‌ను చితకబాదారు. ఆ సమయంలో హరీష్‌ ఒక్కడే అవడంతో వారినేమీ చేయలేక మిన్నకుండిపోయాడు. ఇదిలావుండగా మంగళవారం కళాశాలలో బీటెక్‌ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లేందుకు హరీష్‌ వినుకొండ నుంచి కంచికచర్ల వచ్చాడు. నలుగురు స్నేహితులతో కలసి కంచికచర్లలోని ఓ స్నేహితుడి కారును తీసుకున్న హరీష్‌, ఆ కారులో శ్యామ్‌కుమార్‌ను ఎక్కించుకున్నాడు. విజయవాడ వరకు తీసుకువెళ్లి మిగతా నలుగురితో కలిసి శ్యామ్‌కుమార్‌ను చితకబాదాడు. ఆ తర్వాత కారును శ్యామ్‌కుమార్‌కు ఇచ్చి, కంచికచర్లలో అప్పగించమని చెప్పి హరీష్‌ తన స్నేహితులతో కలసి వినుకొండ వెళ్లిపోయాడు. శ్యామ్‌కుమార్‌ కారును కంచికచర్ల తీసుకువచ్చి కారు యజమానికి అప్పగించాడు. తనపై హరీష్‌ దాడి చేసిన విషయం కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. శ్యామ్‌కుమార్‌ ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు సీఐ వివరించారు.

## డార్మిటరీలో వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలోని ఓ డార్మిటరీలో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విశాఖపట్నంకు చెందిన పొలిమేర నూకరాజు అప్పారావు(48) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతను పని నిమిత్తం సోమవారం నగరానికి వచ్చి బస్టాండ్‌ సమీపంలోని బాలాజీ డార్మిటరీలో ఓ బెడ్‌ తీసుకుని ఉంటున్నాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో బెడ్‌ మీద ఉలుకూ పలుకూ లేకుండా ఉండడాన్ని డార్మిటరీ సిబ్బంది గమనించారు. అతనిని పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో–బైక్‌ ఢీకొని ఇద్దరు దుర్మరణం



ప్రమాద స్థలంలో రాజు మృతదేహం

రెడ్డిగూడెం(తిరువూరు): ఆటో–బైక్‌ ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. మండలంలోని ముందడుగు సమీపంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఈశ్ళ రాజు(40), చిట్టూరి ఆదియ్య(65) మైలవరం వైపు నుంచి స్వగ్రామమైన రంగాపురం వస్తుండగా మార్గంమధ్యలోని ముందడుగు స్టేజీ సమీపంలో రెడ్డిగూడెం వైపు నుంచి మైలవరం వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఈశ్ళ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీను సంఘటన స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న ఆదియ్యను జీపులో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. వీరిద్దరి మృతితో రంగాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆటో డ్రైవర్‌ పరారీలో ఉన్నాడని, ఆటోను రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు. పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## బంగారు ఆభరణాల చోరీ పై కేసు

పెనమలూరు: బంగారు ఆభరణాల చోరీ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తాడిగడప విద్యానగర్‌కు చెందిన జి.జయశ్రీ జిమ్‌ ట్రైనర్‌గా పని చేస్తోంది. ఆమె తన మెడలో ఉన్న 24 గ్రాముల బంగారు ఆభరణాలు హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచి ఇంట్లో నిద్ర పోయింది. అయితే అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ కిటికీలో నుంచి హ్యాండ్‌ బ్యాగ్‌ తీసుకుని అందులో బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అలికిడి అవటంతో జయశ్రీ కుటుంబ సభ్యులు లేచి చూడగా దొంగ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# జగనన్న పాలన సామాజిక సాధికారతకు నిదర్శనం

### మంత్రి కారుమూరు నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు

అవనిగడ్డ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను గత పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేయగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, రాజకీయ రిజర్వేషన్ల ద్వారా తలెత్తుకునేలా చేశారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో గురువారం పలువురు మంత్రులు, ఎంపీలతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బడుగు బలహీనవర్గాల పిల్లలకు ఇంగ్లిష్‌ మీడియం విద్య అందిస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ వ్యతిరేకించడం దారుణమన్నారు. మన రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఐక్యరాజ్యసమితి వేదిక మీద అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడితే ఎంతో ముచ్చటేసిందన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ సీఎం చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారు అందుకుంటున్నారని దేశంలోనే ఇదొక సామాజిక సాధికారతకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌ సీపీ రీజనల్‌ కో ఆర్డినేటర్‌ మర్రి రాజశేఖర్‌ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ఆచరణలో అమలు చేసి చూపించిందన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌ సీపీ రీజనల్‌ కోఆర్డినేటర్‌ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

## టీచర్స్‌ సర్టిఫికెట్‌ కోర్సుల ఫలితాలు విడుదల

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన టీచర్స్‌ సర్టిఫికెట్‌ కోర్సు (డ్రాయింగ్‌, హ్యాండ్లూమ్‌, నేవింగ్‌, టైలరింగ్‌, ఎంబ్రాయిడరీ) కోర్సులకు సంబంధించి ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసినట్లు ఎన్టీఆర్‌ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. టీచర్స్‌ సర్టిఫికెట్‌ కోర్సు లోయర్‌, హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షకు సంబంధించిన ఫలితాలు వెలువడినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు ఎన్టీఆర్‌ జిల్లా నుంచి 2,691 మంది హాజరు కాగా, 1,733 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 64.40 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ నుంచి మెమోరాండమ్‌ మార్క్స్‌ లిస్ట్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని వివరించారు. ఉత్తీర్ణులైనవారి సర్టిఫికెట్లు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి ప్రభుత్వ పరీక్షల కార్యాలయం నుంచి వచ్చిన వెంటనే అభ్యర్థులకు అందజేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవ్రగంలో ప్రత్యేక సంక్షిప్త ఓటరు సవరణ కార్యక్రమం–2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 01, 2021 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న ప్రతి వ్యక్తి అర్హులు అయ్యిండి, ఇప్పటి వరకు ఓటు హక్కు పొందని వారి కోసం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తూర్పు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, విజయవాడ సబ్ కలెక్టర్ అతిధి సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి ఎన్నికల బూత్‌లో ప్రత్యేక క్యాంపేయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### సకల మృతుల స్మరణ



గుణదల(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విశ్వాస జీవితంలో విజేతలుగా నిలిచి దేవుని ఆరాధించడం క్రైస్తవ సంప్రదాయమని విజయవాడ పీఠాధిపతులు తెలగతోటి జోషఫ్ రాజారావు అన్నారు. మరణించిన వారిని స్మరించుట కోసం ఏటా నవంబర్ రెండో తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గుణదల పుణ్య క్షేత్రం సమాధుల ఆవరణలో మరణించిన వారి కోసం గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పుణ్య క్షేత్రం రెక్టార్ విచారణ గురువు ఫాదర్ ఏలేటి విలియంజయరాజుస్వామి, పులువురు గురువులు, విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ తరుణంలో సమాధుల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణ సంతరించుకుంది.

### విదేశాల్లో ఇంటర్న్‌షిప్‌కు లయోల విద్యార్థుల ఎంపిక



గుణదల(విజయవాడ తూర్పు): ఆంధ్రా లయోల కాలేజీ హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలోని ఎనిమిది మంది విద్యార్థులు బి.ఎస్.డి.దిలీప్, ఎస్.అజయ్‌దేవరాజ్, డి.వినయ్, టి.రోహిత్, డి.జబీర్, వి.వెంకట్రావు, పి.హరిహరన్ మలేషియా, మారిషస్‌లోని ప్రముఖ హోటల్ ద్వారా ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు కాలేజీ శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ జి.సహాయభాస్కరన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు స్టయిఫండ్, భోజనం, వసతి అందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనల ప్రకారం ఈ విద్యార్థులు ఆరో సెమిస్టర్‌లో ఈ ఇంటర్న్‌షిప్ చేస్తారని చెప్పారు. మలేషియాలోని ఈస్టిన్ హోటల్, మారిషస్‌లోని మారియట్ హోటల్‌లో ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలకు హాజరై విద్యార్థులు ఎంపికయినట్లు తెలిపారు. ఇంటర్న్‌షిప్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, హోటల్ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడి ఎస్.అనిల్ అభినందించారు.

### ఆకట్టుకున్న లేపాక్షి గాంధీ శిల్పబజార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లేపాక్షి గాంధీ శిల్పబజార్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. దేశంలోని హస్తకళలను సంరక్షించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాల నుంచి కలంకారి ప్రింటింగ్, పెయింటింగ్‌లు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేసు అల్లికలు, చెక్కతో తయారు చేసిన వివిధ రకాల కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. చీరలు, తివాచీలు, వివిధ ఆకృతుల లోహ వస్తువులు ప్రదర్శనలో కొలువుతీరాయి. ఈ ప్రదర్శన నవంబరు 9వ రకూ కొనసాగనున్నట్లు లేపాక్షి మేనేజర్ సురేష్ తెలిపారు.

### 4, 5 తేదీల్లో క్రాఫ్ట్ కౌన్సిల్ ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో వసంతం 2023 పేరులో ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ కౌన్సిల్ చైర్‌పర్సన్ ఎస్.రంజన తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కళ్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వసంతం ప్రదర్శనలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొని స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేత కార్మికులు, డిజైనర్లు, హస్తకళాకారులు, గోండు కళాకారులు, తోలు బొమ్మ, ఉదయగిరి, జాటీలు, ఏలూరు తివాచీలు, బంజారా నీడిల్స్ వంటి చేతిపనుల చేసే కళాకారులు ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులు పదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్రాఫ్ట్‌కౌన్సిల్ కార్యదర్శి బి.సుజాత, రశ్మి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి

**దేవినేని అవినాష్**



టిఫిన్, తోపుడు బండ్లు అందజేస్తున్న దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ నాయకులు

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరిగాయని, దళారీ వ్యవస్థను రూపుమాపి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని దమ్ముగా చెప్పే ధైర్యం మాకుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. ఐదో డివిజన్‌లో జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్న నాలుగు కుటుంబాలకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విలువ చేసే రెండు టిఫిన్ బండ్లు, రెండు తోపుడు బండ్లను ఉచితంగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు పేదలకు అండగా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యం ప్రజలతో మమేకమై వారి ప్రతి అడుగులోనూ అండగా ఉంటున్నారన్నారు. నాడు టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తామని, ఎవరైనా ఎస్సీల్లో పుట్టాలని కోరుకుంటారా అని అవహేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. నేడు సీఎం జగన్ నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ వారిలో ఒకరుగా వారి అభివృద్ధి కోసం చేస్తున్న కృషి మన కళ్ల ముందు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఐదో డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్ పార్టీ నాయకులు మట్టా ప్రసాద్, వంకాలపాటి సుందరరావు, శ్రీను, అప్పారావు, రమేష్, వరుణ్, పెద్దరాజా, నటరాజ్, శ్రీ లక్ష్మి, షకీరా తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక బోధనతో మెరుగైన నైపుణ్యాలు



డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభిస్తున్న దృశ్యం

**ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య**

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):సాంకేతికతతో కూడిన బోధన వల్ల యువత మెరుగైన నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చునని రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఐదో నెంబరు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో వి గార్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక బోధనా తరగతి గది (డిజిటల్ క్లాస్ రూమ్)ను నవ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యా బోధన చేయడం ద్వారా యువతలోని నైపుణ్యాలను మరింతగా పదును పెట్టవచ్చునని చెప్పారు. యువతలో నైపుణ్యాలను పెంచడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ క్లాస్ రూం ఏర్పాటుకు రూ.7.24 లక్షలతో వి గార్డ్ సంస్థ నిర్మాణం చేశారని, ఆ సంస్థ సభ్యులను అభినందించారు. వి గార్డ్ సంస్థ ప్రతినిధి పీకే రాజేష్‌ను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు పి.శివశంకర్, వెంకట నారాయణ, జి.బాలసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కనకారావు తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థి దశ నుంచే నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని నారాయణ పాఠశాలల ఏజీఎం మురళీ కిషోర్ చెప్పారు. మొగల్రాజపురంలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాల ఆవరణలో జాతీయ స్థాయిలో జరిగిన వివిధ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు పొందిన నారాయణ విద్యార్థులను గురువారం అభినందించారు. పాఠశాలల ఆర్.ఐ. రామారావు, ప్రిన్సిపాల్ రవి ప్రసాద్, ఉపాధ్యాయులు ర్యాంకులు పొందిన విద్యార్థులను అభినందించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 4వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 6 కేసుల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులను అరెస్టు చేసి న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. 10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కొల్లికిగడ్డ వాణి, బుచ్చిబాబులు భార్యాభర్తలు. బుచ్చిబాబు వైఎస్సార్ కాలనీ రోడ్డులోని అను బార్ అండ్ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. బుచ్చిబాబుకు మద్యం అలవాటు ఉంది. కొంత కాలంగా మద్యం అతిగా తాగుతూ కుటుంబాన్ని సరిగా పట్టించుకోవడం లేదు. దీంతో భార్యాభర్తలిద్దరికి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట బుచ్చిబాబు నాగాయలంకలోని తండ్రి వద్దకు వెళ్లి బుధవారం నగరానికి తిరిగి వచ్చాడు. బార్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బార్‌లోని సిబ్బంది వెంటనే బుచ్చిబాబును ప్రభుత్వాసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే బుచ్చిబాబు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### కేడీసీసీ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన

గన్నవరం: మండలంలోని బుద్దవరం సొసైటీ ఆవరణంలో కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యాన కళాజాత ప్రదర్శన గురువారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి ఆదేశాల మేరకు నాబార్డ్ సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కేడీసీసీ బ్యాంక్ అందజేస్తున్న వివిధ రకాల రుణ సదుపాయలు, పొదుపు ఖాతాల ఆవశ్యకతను కళాకారులు వివరించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు ప్రయోజనాలు గురించి కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా రైతులను చైతన్యవంతులను చేశారు.

### ధ్వజ స్తంభ ప్రతిష్టకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో విరిగిన పాత ధ్వజ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు గురువారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన దాసాంజనేయస్వామి దేవాలయంలో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో పాతది తొలగించి కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పాత ధ్వజ స్తంభం తొలగించేందుకు గానూ కళా వాహన పూజలు, ప్రత్యేక హోమాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## దిశ యాప్‌పై బాలికలకు అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ కె. శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన దిశయాప్‌పై బాలికలు అవగాహన కల్గి ఉండాలని నున్న సీఐ కె.శ్రీనివాసరావు సూచించారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికలకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, మైనం హుస్సేన్, ఉపాధ్యాయులతో కలిసి గురువారం దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుకోని విధంగా ఇబ్బందికి గురైన పరిస్థితిలో దిశయాప్‌ను ఉపయోగించినట్టయితే పోలీసులు మీరు వున్న ప్రదేశానికి వచ్చి ఆపద నుంచి రక్షిస్తారని పేర్కొన్నారు. మొబైల్ ఫోనులో దిశయాప్‌ను ఎలా డౌన్‌లోడు చేసుకోవాలో వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి బాలికలకు వివరించారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా అలాంటి వారి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## ట్రాఫిక్ రద్దీ కూడళ్ల పరిశీలన



అయోధ్యనగర్‌లో ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశానుసారం నగర పాలక సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులు ట్రాఫిక్ పోలీసులు బృందంగా ఏర్పడి గురువారం రద్దీ కూడళ్లను పరిశీలించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. తరచూ ప్రమాదాలు జరిగే అయోధ్యనగర్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవకాశాలను పరిశీలించారు. అన్ని విభాగాల సిబ్బంది కలిసి సమన్వయంతో ఒక నిర్ణయం తీసుకుని దానికి అనుగుణంగా ట్రాఫిక్ నివారణ చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ గుర్నాథం, 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**గుంటూరు లాంఫామ్ శాస్త్రవేత్త శిరీష**



పెనుగొలనులో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త శిరీష

పెనుగొలను(గంపలగూడెం): మిరప సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు లాంఫామ్ శాస్త్రవేత్త కే శిరీష రైతులకు సూచించారు. మిరప పరిశోధన సంస్థ, సుగంధ ద్రవ్యాల సంస్థ గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం మండలం పెనుగొలను రైతు భరోసా కేంద్రంలో మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మిరపకు ప్రధానంగా ఎండు, వేరు, కుళ్లు, బొబ్బ, తెగుళ్లు ఆశించాయన్నారు. వీటికి ప్రధాన కారణమైన తెల్లదోమ నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు. మిరప ఎగుమతుల కోసం పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలను శాస్త్రవేత్త కేవీ సౌజన్య వివరించారు. సర్పంచ్ సంగెపు లలిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ, తిరువూరు ఏడీఏ కెనడీ, మండల వ్యవసాయ అధికారి సాయిశ్రీ, తిరువూరు ఉద్యాన శాఖ అధికారి సోహెల్ అహ్మద్, పలువురు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## ఓట్లు నమోదుపై బీఎల్ఓలు దృష్టి పెట్టాలి

పెనమలూరు: యువత ఓట్లు నమోదులో బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బూత్ లెవల్ అధికారులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గంలో ఉన్న 304 పోలింగ్ కేంద్రాకు సంబంధించిన బీఎల్ఓలు 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువత ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను బీఎల్ఓలు విధిగా పాటించాలని తెలిపారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

**4–5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు..**

ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని ఆర్డీఓ రాజు తెలిపారు. బూత్‌లెవల్ అధికారులు పై తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలన్నారు. ఓటు నమోదు చేసుకోవడానికి వచ్చే వారికి తగిన సూచనలు, సలహా ఇచ్చి సహకరించాలని సూచించారు. సదస్సులో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు తహసీల్దార్‌లు కట్టా వెంకటశివయ్య, ప్రసాద్, మస్తాన్, ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగం సిబ్బంది, బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విజిలెన్స్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): ఆహార పదార్థాలు కల్తీ లేకుండా క్షేత్రస్థాయిలో వాటిని అడ్డుకోగలిగితే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాధించవచ్చని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ అధికారి కనక రాజు అన్నారు. రీజనల్ విజిలెన్స్ విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆయన పటమట కోనేరు బసవ పున్నయ్య జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించటంతోపాటు స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా చేయడం, ఆహార పదార్థాల కల్తీ నివారణ, అవినీతి రహిత సమాజ నిర్మాణం, పన్నులు, రుసుములు సక్రమంగా చెల్లించడం, సహజ వనరులు సంరక్షణ మొదలైన అంశాలపై విజిలెన్స్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. బాల్యం నుంచే విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం 'అవినీతి వద్దు – నిజాయతీ ముద్దు' 'చేయి చేయి కలుపుదాం – అవినీతిని తరిమేద్దాం' అంటూ నినాదాలు చేస్తూ పటమట రైతుబజారు నుంచి బందరురోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమసాగర్, పలువురు ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## అవినీతికి తావులేకుండా సేవలు

**ఆప్కాబ్ పర్సన్ ఇన్ చార్జి మల్లెల ఝాన్సీ రాణి**



సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల ఝాన్సీ రాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అవినీతికి తావు లేకుండా ప్రజలకు మరింత సేవ చేయాలని ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీ రాణి అన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. బ్యాంక్ ఎండీ డాక్టర్ ఆర్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు విధివిధానాలకు కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. ప్రగతి సాధనకు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో అవినీతి లేని సమాజాన్ని సాధించడంలోనూ తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందితో ప్రమాణం చేయించారు. సీజీఎం బి.రామచంద్రయ్య, సీజీఎం ఎస్.వెంకటరత్నం, జనరల్ మేనేజర్ పి.ఎస్ మణి, సీహెచ్ సుబ్బారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి కార్తీక మాసోత్సవాలు



భీమనవారిపేటలో అర్ధనారీశ్వర స్వామి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని గంగా అన్నపూర్ణ సమేత శమీ కాశీ విశ్వేశ్వరస్వామి సన్నిధిలో 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి రోజు మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సాయంత్రం ఆకాశదీపం, దీపోత్సవం, పౌర్ణమి జ్వాలాతోరణం నిర్వహించేందుకు ఆలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. భీమనవారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో 14వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పేర్కొన్నారు. 20వ తేదీ కార్తీక సోమవారం, 23వ తేదీ గురువారం చిలుక ఏకాదశి, 27వ తేదీ సోమవారం, కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 4వ తేదీ కార్తీక సోమవారం, డిసెంబర్ 8వ తేదీ శుక్రవారం ఏకాదశి, డిసెంబర్ 11వ తేదీ కార్తీక సోమవారం, మాస శివరాత్రి, 12వ తేదీ కార్తీక అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం ఆకాశదీపం, డిసెంబర్ 12వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రుద్రహోమం, మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందన్నారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాస్‌శర్మ పేర్కొన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో ప్రతి రోజు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం ఆకాశ దీపం వెలిగించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలో స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

## కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

**రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ**



కడియాల వారి వీధిలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. 24వ డివిజన్ సీతారామపురం కడియాల వారి వీధిలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి మల్లాది విష్ణు భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రతి డివిజన్‌లో కనీస అవసరాలు తీర్చడానికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాగా, నేటి ప్రభుత్వం పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏ డివిజన్‌కు వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, ఏఈ వెంకటేష్ , స్థానిక నేతలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పచ్చదనం



పోరంకి వద్ద జాతీయ రహదారి పక్కనే పచ్చదనంతో ఉన్న చెట్లు

పెనమలూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంది. పోరంకి సెంటర్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి బందరు రోడ్డు డివైడర్ మధ్యలో పచ్చదనంతో చెట్లు ఉండటంతో ప్రయాణికులు ఎంతో ఆహ్లాదం పొందుతున్నారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి మండల పరిధిలో కానూరు నుంచి గోసాల వరకు విస్తరించి ఉంది. అయితే పోరంకి–పెనమలూరు డివైడర్ మధ్యలో కొందరు పర్యావరణ ప్రేమికులు అధికారుల సహకారంతో మొక్కలు నాటారు. అవి ఇప్పుడు పెద్ద చెట్లుగా ఎదిగి ప్రయాణీలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రీనరీతో రహదారి ఆకట్టుకుంటోంది. ఎండ సమయంలో ప్రయాణీలకు నీడనిస్తున్నాయి. రాత్రి సమయంలో ఎదురెదురుగా వాహనలు వచ్చే సమయంలో హెడ్‌లైట్ల కాంతి కళ్లల్లో పడకుండా చెట్లు అడ్డుకుంటున్నాయి. జాతీయ రహదారి పక్కన చెట్లు ఉండటంతో కాలుష్య నివారణకు సైతం ఉపయోగపడుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. కానూరు నుంచి గోసాల వరకు నిత్యం ట్రాఫిక్ ఉండటంతో ఈ ప్రాంతం వరకు డివైడర్ మధ్యలో మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మేలు చేకూరుతుంది.

- హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ 10.28లక్షలు వచ్చినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఈవో సన్యాసిరావు పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు గురువారం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష


గ్రేటర్ విశాఖలోని అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది


పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరానికి వైద్యపరీక్షలకు వచ్చిన స్థానికులు


కాకినాడ జిల్లా తూరంగి నాలుగో సచివాలయం పరిధి పగడాలపేటలో రోగుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది


శ్రీకాకుళం జిల్లా మందస మండలం అంబుగాంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వృద్ధుడికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు


చిత్తూరులోని సంజయ్‌గాంధీ నగర్‌లో వైద్యసేవల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న స్థానికులు

# ఇద్దరు ఎంఈవోలకు సమాన విధులు

**పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు**

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ పాఠశాల విద్యను పటిష్టం చేయడంలో భాగంగా మండల స్థాయిలో ఇద్దరు ఎంఈవో పోస్టులను భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై స్పష్టతనిచ్చింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు (జీవో 89) జారీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా 679 మంది మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈవో-2)ను నియమించిన విషయం తెలిసిందే. గతంలో ఉన్న 666 మంది మండల విద్యాశాఖాధికారులను ఎంఈవో-1గా మార్చింది. అయితే, వారి మధ్య పని విభజన నిర్ధారించడంతో పాటు ఎవరు ఏ విధులు చేపట్టాలో స్పష్టం చేస్తూ జాబ్‌చార్ట్‌ను సైతం ఇచ్చారు. ఇందులో ఎంఈవో-1, ఎంఈవో-2కు సమానమైన బాధ్యతలు అప్పగించారు. ఇందులో విద్యా సంబంధమైన, పరిపాలనా సంబంధమైన విధులను స్పష్టంగా పేర్కొన్నారు.

**విధులు, బాధ్యతలు ఇలా..**

**ఎంఈవో-1**

ఎ. విద్యాసంబంధ విధులు:
- పాఠశాలల తనిఖీ, సందర్శన
- ఉపాధ్యాయులకు శిక్షణ
- నాణ్యమైన కార్యక్రమాలు
- అంచనాలు

బి. అడ్మినిస్ట్రేటివ్ విధులు:
- పాఠశాలల స్థాపన, గుర్తింపు
- పాఠశాలలను బలోపేతం చేయడం
- టీచర్స్ సర్వీస్ మ్యాటర్స్

సి. అధికారులు కేటాయించిన ఇతర విధులు

**ఎంఈవో-2**

ఎ. విద్యాసంబంధ విధులు:
- పాఠశాలల సంసిద్ధత, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లు, బడి బయట పిల్లల మెయిన్ స్ట్రీమింగ్, ఒకేషనల్ ఎడ్యుకేషన్, ప్రత్యేక అవసరాలు గల పిల్లల అంశాలు, చైల్డ్ డేటాబేస్, యూడైస్ నిర్వహణ
- కో-కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ (ఎస్‌జీఎఫ్, సైన్స్ ఎగ్జిబిషన్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, బీఎస్అండ్‌జీ)

బి. అడ్మినిస్ట్రేటివ్ విధులు (పథకాలు)
- స్కూల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ (నాడు-నేడు), డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లెర్నింగ్ మెటీరియల్ టు స్టూడెంట్స్(కేవీకే)
- మిడ్ డే మీల్స్ ప్రోగ్రామ్ (జగనన్న గోరుముద్ద)
గ్రాంట్స్ టు స్కూల్స్, స్కూలు శానిటేషన్ (స్కూల్ నిర్వహణ ఫండ్, టాయిలెట్ నిర్వహణ ఫండ్)
- డైరెక్ట్ బెనిఫిట్ బదిలీలు /అమ్మఒడి
- పాఠశాల భద్రత- విద్యార్థి భద్రత, బాలికల భద్రత కోసం ప్రచారం

సి. అధికారులు కేటాయించిన ఇతర విధులు

# ఇది పేదల సంక్షేమ రాజ్యం

**సీఎం వైఎస్ జగన్‌తోనే ఇది సాధ్యమైంది**

- మరే రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం
- సంక్షేమ పథకాల్లో మూడింట రెండొంతులు బడుగు, బలహీన వర్గాలకే
- అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకే పెద్ద పీట
- విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు
- పేదోడు ఇంగ్లిషు మీడియం చదవకూడదా?
- మాడుగుల సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు


అనకాపల్లి జిల్లా మాడుగుల వద్ద జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం


మాడుగుల సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన. వేదికపై డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, ముత్యాలనాయుడు, మంత్రి బొత్స, ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

**సాక్షి, అనకాపల్లి:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో పేదల సంక్షేమ రాజ్యం వచ్చిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా గురువారం అనకాపల్లి జిల్లా మాడుగుల వద్ద జరిగిన బహిరంగ సభలో వేలాది ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు రాష్ట్రంలో అందుతున్న సంక్షేమం మరే రాష్ట్రంలోనూ అందడం లేదని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇందులో మూడింట రెండు వంతులు బడుగు, బలహీన వర్గాలకే అందుతున్నాయని తెలిపారు. మంత్రి పదవులు, నామినేటెడ్ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకే సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేస్తున్నారని, దీనివల్ల సామాజిక సాధికారత సాధ్యమైందని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. జనవరి ఒకటి నుంచి ప్రభుత్వం సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతున్నారని చెప్పారు. రెండు వేళ్లు చూపించే చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలకు వృద్ధులు ఇకపై మూడు వేళ్లు చూపించాలని అన్నారు. పేదల ఉన్నతి కోసం సీఎం జగన్ ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే అలీబాబా 40 దొంగలు హేళన చేశారని, చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి మనవళ్లు మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదవచ్చా అని నిలదీశారు. ఇదీ పేదలపై వారికి ఉన్న ప్రేమ అని అన్నారు.

**సీఎం జగన్ పాలనలో నేరుగా లబ్ధి: డిప్యూటీ సీఎం రాజన్నదొర**

చంద్రబాబు పాలనలో పేదల కోసం అరకొరగా ఖర్చు చేశారని, అందులోనూ అధికభాగం టీడీపీ నేతలే తినేసేవారని, సీఎం జగన్ పాలనలో ప్రతి పేదవాడికి నేతలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధి జరుగుతోందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చెప్పారు. బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా ఇంతలా అభివృద్ధి చెందుతున్నారంటే అందుకు జగనన్న సంక్షేమ పాలనే కారణమని తెలిపారు. టీడీపీ హయాంలో పేదలకు ఖర్చు చేసిన దానికి మూడు రెట్లు సీఎం జగన్ వెచ్చిస్తున్నారని చెప్పారు. గతంలో అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ మన ముందుకు వస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

**అవినీతి రహిత సంక్షేమ పాలన: మంత్రి ధర్మాన**

రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యమైందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు చెప్పారు. రోడ్ వేస్తేనో, బిల్డింగ్ కడితేనో అభివృద్ధి కాదని, పేదవాడి జీవన ప్రమాణాలు పెరగాలని, సీఎం జగన్ ఇదే చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పథకాలను హేళన చేసిన చంద్రబాబే ఇంతకంటే ఎక్కువ పథకాలు ఇస్తానని అంటున్నారన్నారు. సమాజాభివృద్ధికి విద్య ఎంత అవసరమో సీఎం జగన్‌కు తెలుసునని, అందుకే ప్రతి పేద పిల్లవాడికి యూనిఫారం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, అంతర్జాతీయ స్థాయి ఇంగ్లిష్ మీడియం చదువు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనలో టీడీపీ నేతలు ప్రజల సొమ్ము వారి ఖాతాల్లో వేసుకున్నారని, సీఎంగా వైఎస్ జగన్ వచ్చాక పథకాల సొమ్ము ప్రజల ఖాతాల్లో వేస్తున్నారని, అప్పటికీ ఇప్పటికీ తేడా ప్రజలు గమనించాలని కోరారు. అవినీతి జరిగిందని చంద్రబాబు కూడా ఏనాడూ అసెంబ్లీలో ప్రశ్నించలేకపోవడమే వైఎస్ జగన్ స్వచ్ఛమైన పాలనకు నిదర్శనమని చెప్పారు. దొంగ కంపెనీలు క్రియేట్ చేసి స్కిల్ పేరిట అవినీతి చేసి జైలు పాలైన చంద్రబాబు తప్పు చేయలేదంటే ఎవరు నమ్ముతారన్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**మీ మనవడు ఈ విషయం అడగలేదా?: మంత్రి గుడివాడ**

'స్కిల్ కుంభకోణంలో అడ్డంగా దొరికి రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లిన చంద్రబాబు మనవడు తాతేడని అడిగితే విదేశాలకు వెళ్లారని చెప్పామని బాబు సతీమణి భువనేశ్వరి ఇటీవల ఒక సభలో చెప్పారు. మరి తాత విడుదలైనప్పుడు అదే మనవడిని రాజమండ్రి సెంట్రల్ జైలు వద్దకు తీసుకెళ్లారు. విదేశాలకు వెళ్లిన తాత ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రావాలి కదా.. జైలు నుంచి ఎందుకు వచ్చావు తాతా అని మనవడు అడగలేదా' అంటూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సభలో చమత్కరించారు. చంద్రబాబుకు ఇటీవల జనసేన అనే ఒక ఖరీదైన చేతికర్ర దొరికిందన్నారు. ఎన్ని కోట్లు పెట్టినా ప్రజల అభిమానాన్ని మాత్రం వారు కొనలేరని అన్నారు.

## దేశంలో సామాజిక సాధికారత

# సాధించిన తొలి సీఎం జగన్

- అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత
- పేదలకు ఉన్నతస్థాయి విద్య, వైద్యాన్ని చేరువ చేశారు
- ప్రతి పేద పిల్లవాడు చదువుకోవడానికి అన్ని వనరులు సమకూరుస్తున్నారు
- నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి చరిత్ర సృష్టించారు
- చంద్రబాబు ఒక్క బీసీనీ రాజ్యసభకు పంపలేదు
- ఆయన సామాజిక వర్గానికి చెందిన వారికే పదవులు అమ్ముకున్నారు
- అవనిగడ్డ సామాజిక సాధికార సభలో మంత్రి జోగి రమేష్


కృష్ణాజిల్లా అవనిగడ్డలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

**అవనిగడ్డ:** స్వాతంత్య్రం వచ్చిన తరువాత దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా మన రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయం చేసి సామాజిక సాధికారత సాధించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన సామాజిక సాధికార సభలో మంత్రి మాట్లాడారు. అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతూ పేదలకు ఉన్నతస్థాయి విద్య, వైద్యాన్ని చేరువ చేశారని చెప్పారు. ప్రతి పేద పిల్లవాడికి ఫీజుల నుంచి చదువుకోవడానికి అవసరమైన అన్ని వనరులు సీఎం జగన్ సమకూరుస్తున్నారని అన్నారు. గతంలో చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని, వందల కోట్లు తీసుకొని ఆయన సామాజిక వర్గానికి చెందిన వారికే పదవులు అమ్ముకున్నారని విమర్శించారు. సీఎం జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి చరిత్ర సృష్టించారని చెప్పారు. గతంలో చంద్రబాబు బీసీల తోక కట్ చేస్తానని అన్నారని, ఎస్సీల్లో పుడతారని ఎవరు కోరుకుంటారని హీనంగా మాట్లాడారన్నారు. 2019 ఎన్నికల్లో ఆ బీసీలు, ఎస్సీలే చంద్రబాబు తోక కట్‌చేశారని చెప్పారు. కాపుల ఆరాధ్య దైవమైన వంగవీటి మోహనరంగాను పొట్టన పెట్టుకున్న చంద్రబాబుకే పవన్‌కళ్యాణ్ వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు.

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా యాదవులకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్కువ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చారన్నారు. పౌష్టికాహారం సూచీలో 24వ స్థానం నుంచి 8వ స్థానానికి తెచ్చారని, పేదరికాన్ని 15 నుంచి 6 శాతానికి తగ్గించిన ఘనత కూడా సీఎం జగన్‌దే అని అన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ గతంలో ఎందరో మేధావులు సామాజిక న్యాయం కోసం ఎన్నో ఉద్యమాలు చేసినా సాధ్యం కాలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దానిని సాధ్యం చేసి చూపించారని చెప్పారు. రూ.2.40 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాల్లో జమ చేయడం, లక్షలాది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు, నాడు – నేడు ద్వారా విద్య, వైద్య రంగాలను ఆధునికంగా తీర్చిదిద్దారని తెలిపారు. చంద్రబాబు రాజకీయాలను కలుషితం చేశారని, సీఎం జగన్ సమూలంగా ప్రక్షాళన చేసి, పేదల సంక్షేమానికి పాటుపడుతున్నారని చెప్పారు.

బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి విద్య, అత్యాధునిక వైద్యం, అవినీతి రహిత సంక్షేమం ద్వారా పేదల ఇళ్లల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. మాజీ సీఎం చంద్రబాబు పేదల ఇళ్లలో దీపాలు ఆర్పే వ్యక్తి అని అన్నారు. చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఎన్నో అవమానాలకు గురిచేసి, జైలుకి పంపించారని, అదే వర్గాలను సీఎం జగన్ అక్కున చేర్చుకొని, పార్లమెంట్‌కు పంపించారని చెప్పారు. పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య రాకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారని చెప్పారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా కోర్టుల ద్వారా అడ్డుపడిన ఘనుడు కూడా చంద్రబాబే అన్నారు. సీఎం జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతారన్నారు.


బస్సు యాత్రలో పాల్గొన్న మంత్రులు జోగి రమేష్, కారుమూరి, మేరుగ, ఎంపీలు మోపిదేవి, సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యేలు కృష్ణప్రసాద్, అనిల్‌కుమార్ తదితరులు

గతంలో చాలా మంది నాయకులు పేదరికాన్ని తగ్గిస్తామని మాటలే చెప్పారని, సీఎం జగన్ దానిని ఆచరణలో చేసి చూపించారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ప్రశంసించారు. సీఎం జగన్ రూ.2.40 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాల్లో జమ చేయడం ద్వారా పేద కుటుంబాలను బలోపేతం చేశారని చెప్పారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ సామాజిక సాధికారత సాధించిన ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి ఓసీకి రిజర్వ్ అయినప్పటికీ, బీసీ అయిన తనకు ఆ సీటు ఇచ్చి సీఎం వైఎస్ జగన్ సామాజిక సాధికారతకు అసలైన అర్థం చెప్పారని కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చెప్పారు. 22ఎ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించడంతో పాటు అడిగిన వెంటనే కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు మేలు జరిగింది
- బడుగు వర్గాలకు చెందిన ఐదుగురిని డిప్యూటీ సీఎంలను చేసిన ఘనత సీఎం జగన్‌దే
- 1931 తర్వాత మళ్లీ ఇప్పుడే బీసీ కులగణనకు సీఎం జగన్ నిర్ణయం
- చిత్తూరు సామాజిక సాధికార సభలో మంత్రి చెల్లుబోయిన


చిత్తూరులో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం


చిత్తూరు సభా వేదికపై ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు

**సాక్షి, చిత్తూరు:** నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ అణగారిన వర్గాలను అక్కున చేర్చుకుని అన్నింటిలోనూ అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమైందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ చెప్పారు. సామాజిక సాధికారత సాధించిన తరువాతే ప్రజల వద్దకు బస్సు యాత్ర ద్వారా వస్తున్నామన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం చిత్తూరు నగరంలో అశేష జనం మధ్య జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని పథకాలు, అన్ని రంగాల్లో సామాజిక న్యాయాన్ని పాటించి, అన్ని వర్గాలకు మేలు చేశారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురిని డిప్యూటీ సీఎంలను చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 1931 తర్వాత బీసీ కులగణన జరగలేదని, మళ్లీ ఇప్పుడే సీఎం జగన్ దేశ చరిత్రలో నిలిచిపోయేలా బీసీ కులగణనకు పచ్చ జెండా ఊపారని కొనియాడారు. టీడీపీ పాలనలో సామాజిక న్యాయం ఎండమావిగా ఉండేదన్నారు. పైగా, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలను చంద్రబాబు సహా టీడీపీ నేతలు చులకన చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని స్థానాలనూ వైఎస్సార్‌సీపీ గెలవడం తథ్యమని చెప్పారు.

**మైనారిటీలను మోసం చేసిన టీడీపీ: అంజాద్ బాషా**

డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో మైనారిటీలకు తీరని మోసం చేశారని విమర్శించారు. సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని బాధ్యతగా భావించి అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని, ఇందుకు తానే ప్రత్యక్ష సాక్ష్యమని అన్నారు. మైనారిటీ వర్గానికి చెందిన తనను డిప్యూటీ సీఎంను చేశారని, ఇది చరిత్రలో నిలిచిపోయే విషయమన్నారు. ఎన్నికలకు మూడు నెలల ముందు మాత్రమే చంద్రబాబుకు మైనారిటీలు గుర్తుకొచ్చి, మొక్కుబడిగా ఓ మంత్రి పదవి ఇచ్చారని చెప్పారు. అందుకు భిన్నంగా సీఎం జగన్ మొదటి కేబినెట్‌లోనే మైనారిటీ సామాజికవర్గానికి అవకాశం కల్పించారని తెలిపారు. మైనారిటీ మహిళను శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌ను చేశారన్నారు. టీడీపీ పాలనలో మైనారిటీల సంక్షేమానికి కేవలం రూ.2,665 కోట్లే ఖర్చు చేశారని, సీఎం జగన్ పాలనలో ఈ నాలుగున్నరేళ్లలో ఏకంగా రూ.23,176 కోట్లు మైనారిటీల సంక్షేమానికి ఖర్చు చేశారని చెప్పారు.

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. బీసీ పార్టీగా డప్పు వాయించుకునే టీడీపీ బీసీలను దగా చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో బీసీలను వాడుకొని, తరువాత తీసి పడేసేదని అన్నారు. వైఎస్ జగన్ రాకతో బీసీలకు మహర్దశ పట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితోపాటు సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలందరూ అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**బడుగుల అభివృద్ధికి సీఎం జగన్ నిరంతర కృషి: డిప్యూటీ సీఎం నారాయణస్వామి**

డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగనన్న నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ సమానత్వం పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టి చంద్రబాబు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసులను తీవ్రంగా గాయపరిచి వారిని కనీసం పరామర్శించలేదని చెప్పారు. పైగా, చిత్తూరు జిల్లా ఎస్పీ, పోలీసుల అంతు చూస్తామని నారా లోకేశ్ అనడం దుర్మార్గమన్నారు.

## అవనిగడ్డలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం



డయాలసిస్ కేంద్రంలో మంత్రులు జోగి రమేశ్, కారుమూరి, తదితరులు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవనిగడ్డకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని మంత్రులు జోగి రమేశ్, కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ కేంద్రం, రూ.3.20 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మంత్రులు, ఎంపీలు నందిగం సురేశ్, మోపిదేవి వెంకటరమణ, ఆళ్ళ అయోధ్య రామిరెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం వారు డయాలసిస్ పేషెంట్లతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ పేదల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోలేదని, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి జోగి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్యాకేజీకి సై అన్నది చంద్రబాబే..

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



రాజంపేట టౌన్: ఏపీకి ప్రత్యేక హోదాకు బదులు కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటే అంగీకరించింది అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇచ్చి రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించిందని ఆమె తెలిపారు. రాయలసీమలో కరువు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం సరైంది కాదన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ బాధితులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోలేదని ఆరోపించారు. పరిశ్రమలు లేకపోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదని పురందేశ్వరి అన్నారు. అనంతరం ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె దిశానిర్దేశం చేశారు. పలువురు బీజేపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



ఒంగోలు రాజీవ్‌నగర్‌లో వృద్ధురాలు వి.కామాక్షమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగలక్ష్మి



తిరుపతి రుయా ఆస్పత్రిలో మౌలా సాహెబ్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కోకిల



విజయనగరం జిల్లా వన్నలిలో ఎస్.దుర్గారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాకోటి సంతు



కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకిలో వృద్ధురాలు కిలారు సుశీలాదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పి.శోభన



శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిలో వృద్ధుడు నారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాటమయ్య



కర్నూలు జిల్లా మల్కాపురంలో వడ్ల లక్ష్మమ్మ, వడ్ల ఈరమ్మలకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కళ్యాణ్ కుమార్



గుంటూరులో సాజిదాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్రవంతి



కాకినాడలోని ఓ ఆస్పత్రిలో బొత్తుల పద్మారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుంచే వీరబాబు



నెల్లూరు కేన్సర్ ఆస్పత్రిలో పర్వతాల శీనయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మల్లీశ్వరి



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వృద్ధురాలు ఓలేటి ధనమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఎం.వెంకటేష్



వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం నల్లినాగయ్యపల్లెలో శాంతమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీలేఖ

# ఆదాయంతోపాటు అభివృద్ధి

## టీడీపీ హయాంతో పోలిస్తే అప్పులూ తక్కువే.. జీఎస్‌డీపీ పెరిగింది: ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పటికీ గత సర్కారు హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే ఆదాయం పెరగడంతోపాటు అభివృద్ధి జరిగిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. టీడీపీ హయాం కంటే ఇప్పుడే రాష్ట్ర స్థూల ఉత్పత్తి అధికంగా నమోదైందని, గత ప్రభుత్వంతో పోల్చితే అప్పులు కూడా ఇప్పుడే తక్కువని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ సంక్షేమానికి గత సర్కారు కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో రెట్లు అధికంగా వ్యయం చేసిందని గణాంకాలతో సహా బహిర్గతం చేశారు. మంత్రి బుగ్గన గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. అప్పులు, ఆదాయం, వృద్ధిపై టీడీపీ నేత యనమల రామకృష్ణుడు లేఖలు ద్వారా చేస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. ఒకసారి రూ.పది లక్షల కోట్లు మరోసారి రూ.11 లక్షల కోట్లు, ఇంకోసారి రూ.నాలుగున్నర లక్షల కోట్లు అంటూ యనమల తన లేఖల్లోనే పరస్పర విరుద్ధ గణాంకాలను పేర్కొనటాన్ని గుర్తు చేశారు. కొత్తగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి లాంటి వారు ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేయడంపై స్పందిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్బీఐకి కూడా ఇదే వర్తిస్తుందా? అని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి మనకు రావాల్సిన విద్యుత్ బకాయిలపై ఆమె కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేంద్ర ఆర్థిక శాఖ, కాగ్, ఆర్బీఐ వెల్లడించిన గణాంకాలే వాస్తవాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు దఫాలు ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో సైతం ప్రకటించిందని గుర్తు చేశారు. ఖర్చులు పెరిగినప్పటికీ ఏ సంక్షేమ పథకాన్ని ఆపకుండా నిరాటంకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అప్పులు, రాష్ట్ర ఆదాయం, స్థూల ఉత్పత్తిపై తాను చెబుతున్న లెక్కల్లో తప్పులుంటే చెప్పాలని యనమలకు సవాల్ విసిరారు. స్కిల్ స్కామ్‌కు సంబంధించి రూ.250 కోట్లకు లెక్కలు కనిపించడం లేదని బుగ్గన వెల్లడించారు. ఎలాంటి అంచనాలు లేకుండా రూ.370 కోట్లకు నామినేషన్‌పై డిజైన్ టెక్‌కు ఇచ్చారని, ఈ స్కామ్ 2017లోనే జీఎస్టీ ఇంటిలిజెన్స్ డీజీ విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు. సెబీ, ఈడీ కూడా దీనిపై విచారణ చేశాయన్నారు.

### ఎవరి హయాంలో అప్పులు ఎలా?

2018-19 నాటికి (టీడీపీ హయాంలో) రూ.2,57,210 లక్షల కోట్లు

2021-22 నాటికి (వైఎస్సార్‌సీపీ హయాంలో) రూ.3,93,718 లక్షల కోట్లు

మూడేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో పెరిగిన అప్పులు రూ.1,36,500 కోట్లు

సగటున ఏడాదికి రూ.45,500 కోట్లు అప్పులు

### టీడీపీ హయాంలో ఆదాయం ఇలా

| ఆర్థిక ఏడాది | ఆదాయం (కోట్లలో) |
|---|---|
| 2014-15 | 90,570 |
| 2015-16 | 88,650 |
| 2016-17 | 98,980 |
| 2017-18 | 1,05,060 |
| 2018-19 | 1,14,650 |

టీడీపీ హయాంలో సగటు వార్షిక ఆదాయ వృద్ధి కేవలం 6 శాతం

### వైఎస్సార్‌సీపీ పాలనలో ఆదాయం పెరుగుదల

| ఆర్థిక ఏడాది | ఆదాయం (కోట్లలో) |
|---|---|
| 2019-20 | 1,11,030 |
| 2020-21 | 1,17,135 |
| 2021-22 | 1,50,550 |
| 2022-23 | 1,76,450 |

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల హయాంలో సగటు వార్షిక ఆదాయ వృద్ధి 16.7 శాతం

- టీడీపీ హయాంలో ఎస్సీ ఉప ప్రణాళిక కింద రూ.33,032 కోట్లు వ్యయం
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఎస్సీల సంక్షేమానికి రూ.74,249 కోట్లు వ్యయం.
- టీడీపీ హయాంలో ఎస్టీ ఉప ప్రణాళిక కింద రూ.11,400 కోట్లు వ్యయం
- వైఎస్సార్ సీపీ పాలనలో ఎస్టీల సంక్షేమానికి రూ.25,323 కోట్లు వ్యయం
- టీడీపీ హయాంలో బీసీ సంక్షేమానికి రూ.30,970 కోట్లు వ్యయం
- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలో బీసీ సంక్షేమానికి చేసిన వ్యయం రూ.1,12,960 కోట్లు
- మైనారిటీలకు టీడీపీ హయాంలో వ్యయం సున్నా
- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలో మైనారిటీల సంక్షేమానికి చేసిన వ్యయం రూ.11,157 కోట్లు
- చంద్రబాబు హయాంలో విద్యుత్ బకాయిలు డిస్కమ్‌లకు చెల్లింపు రూ.20,165 కోట్లు
- వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగేళ్లలో రూ.57,417 కోట్లు చెల్లింపు

### టీడీపీ హయాంలో గ్యారెంటీ, నాన్‌గ్యారెంటీ అప్పుల పెరుగుదల ఇలా

- 2014 నాటికి గ్యారెంటీ అప్పులు రూ.13,247 కోట్లు
- 2019 టీడీపీ దిగిపోయే సమయానికి రూ.57,687 కోట్లు
- 2014 నాటికి నాన్ గ్యారెంటీ అప్పులు రూ.22,000 కోట్లు
- 2019 టీడీపీ దిగిపోయే సమయానికి రూ.66,664 కోట్లు

### వైఎస్సార్‌సీపీ వచ్చాక నాలుగేళ్లలో గ్యారెంటీ, నాన్ గ్యారెంటీ అప్పులు

- వైఎస్సార్ సీపీ హయాంలో గ్యారెంటీ అప్పులు రూ.1,18,000 కోట్లు
- నాన్ గ్యారెంటీ అప్పులు రూ.83,000 కోట్లు

### బాబు హయాంలో ఓవర్ డ్రాఫ్ట్ 2018-19లో 74.3 శాతం వినియోగం

- వైఎస్సార్‌సీపీ పాలనలో అనుమతించిన రోజుల్లో 2019-20లో 39.5 శాతం వినియోగం
- 2020-21లో అనుమతించిన రోజుల్లో 51.5 శాతమే ఓవర్ డ్రాఫ్ట్ వినియోగం
- 2014-15లో ద్రవ్యలోటు మూడు శాతానికి అనుమతిస్తే 3.95 శాతానికి చేరింది
- 2018-19లో మూడు శాతానికే అనుమతి ఉంటే 4.06 శాతానికి చేరింది.
- ఇప్పుడు 2021-22లో 4.5 శాతానికి అనుమతి ఉంటే ద్రవ్యలోటు కేవలం 2.01 శాతమే ఉంది.
- టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు రూ.1,62,828 కోట్లను అసెంబ్లీ అనుమతి లేకుండా అధికంగా వ్యయం చేసినట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది.

### టీడీపీ హయాంలో అప్పుల పెరుగుదల ఇలా

- 2014 నాటికి అప్పు రూ.1,34,600 లక్షల కోట్లు
- 2019 మే నాటికి మొత్తం అప్పు రూ.3,28,700 లక్షల కోట్లు.. అంటే అప్పుల పెరుగుదల 19.55 శాతం

### వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పుల పెరుగుదల ఇలా

- 2022-23 నాటికి మొత్తం అప్పు రూ.4,99,895 లక్షల కోట్లు. అంటే అప్పు పెరుగుదల శాతం 15.46 శాతమే
- టీడీపీ హయాంలో ఐదేళ్లలో మూలధన వ్యయం రూ.76,139 కోట్లు. సగటు వార్షిక



మూల ధన వ్యయం రూ.15,227 కోట్లే

- వైఎస్సార్‌సీపీ హయాంలో మూడేళ్లలో మూల ధన వ్యయం రూ.55,086 కోట్లు. సగటు వార్షిక మూల ధన వ్యయం రూ.18,362 కోట్లు
- టీడీపీ హయాంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదల రూ.34,73,477 లక్షల కోట్లు. ఏడాదికి సగటు పెరుగుదల రూ.6,95,695 లక్షల కోట్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదల రూ.43,34,192 లక్షల కోట్లు. ఏడాదికి సగటు పెరుగుదల రూ.10,83,548 లక్షల కోట్లు.

# మీరు సుద్దులు చెబితే ఎలా!?

## రుషికొండపై పర్యాటక శాఖ నిర్మాణాలపై రామోజీ విషపు రాతలు

- అన్ని రకాల అనుమతులతో పర్యాటక శాఖ భవన నిర్మాణాలు చేపడుతున్నా నానాయాగీ
- అన్యాయం, అక్రమం అంటూ గగ్గోలు
- 61 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతులుంటే, 9.88 ఎకరాల్లోనే ప్రాజెక్టుకు ప్రతిపాదన
- పైగా ఇందులో కూడా భవనాలు కట్టింది కేవలం 1.84 ఎకరాల్లోనే..
- అలాగే, ఏడు బ్లాకుల నిర్మాణానికి అనుమతులివ్వగా, కట్టింది నాలుగు బ్లాక్‌లే..
- అసలు ఇక్కడ భవనాలు కట్టింది టీడీపీ హయాంలోనే..

సాక్షి, అమరావతి

విశాఖ అభివృద్ధి అంటే రామోజీరావును ఎక్కడలేని ఆవేశం ఆవహిస్తుంది. అంతేకాదు.. ఆందోళన, ఆవేదన.. అక్కసు కూడా. అందుకే ఈ మధ్య తరచూ ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఈ విషయంలో ఎక్కడలేని విషం కక్కుతున్నారు. విశాఖలో భూ కబ్జాలంటూ నిత్యం అడ్డగోలు రాతలు రాస్తున్నారు. ప్రభుత్వాన్ని, వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి మరీ నానా రోత రాతలు రాసిపారేస్తున్నారు. ప్రతిరోజూ ఇలా పచ్చి అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మేస్తారన్నది ఆయన గుడ్డి విశ్వాసం. 'ఈనాడు' ఆవిర్భావం నుంచి రామోజీరావు ఎంచుకున్న మార్గం కూడా ఇదే. కానీ, ఇప్పుడు ఆయన అనుకుంటున్న రోజులు కావు కదా.. ఆయన ఒకటంటే సోషల్ మీడియా ఆయన్ను పది అంటూ నగ్నంగా నిలబెడుతోంది. అయినా ఇవేవీ పట్టని ఆయన ఉత్తరాంధ్ర బాగుపడకూడదన్న దురుద్దేశంతో.. నిస్సిగ్గుగా విశాఖపై చెలరేగిపోతున్నారు. తాజాగా.. రుషికొండ మీద పర్యాటక శాఖ కట్టడాలపై రామోజీ బాధ వర్ణనాతీతం. తన ఆత్మబంధువు చంద్రబాబు హయాంలో అడ్డగోలుగా కబ్జాలు జరిగితే నోరెత్తని ఆయన.. ఇప్పుడు అన్ని అనుమతులతో రుషికొండలో పర్యాటక శాఖ నిర్మాణాలు చేస్తుంటే పెడబొబ్బలు పెడుతున్నారు. నిజానికి.. విశాఖలో భూకబ్జాలు చేసిందెవరు? ఆ భూముల్ని కబ్జాదారుల నుంచి కాపాడిందెవరు? రుషికొండపై రామోజీ చేస్తున్న రచ్చలో నిజమెంత? ఒకసారి చూద్దాం..



రుషికొండ సమీపంలోని మరొక కొండ మీద హెమా వెల్‌నెస్ హోటల్

సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి చెందడం రామోజీకి అస్సలు నచ్చడంలేదు. అందులోను కొన్ని దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర, విశాఖ నగరాభివృద్ధి అంటేనే ఆయన గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి తన విషపత్రికలో అడ్డగోలు కథనాల పరంపరను అచ్చేస్తున్నారు. నిజానికి.. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్షా సమావేశాలు నిర్వహించడానికి, నిశిత పర్యవేక్షణకు ముఖ్యమంత్రి, ఇతర అధికారులకు క్యాంపు కార్యాలయాలు సహా వసతి ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ప్రభుత్వానికి తన సిఫార్సులను నివేదించింది. విశాఖ నగరంలోని అనేక ప్రభుత్వ, ప్రైవేటు, ఇతరత్రా భవనాలను పరిశీలించి కమిటీ తమ సిఫార్సులను అందజేసింది. ముఖ్యమంత్రికి భద్రత, పరిపాలనా అవసరాలు, క్యాంపు కార్యాలయం, వసతి ఒకే ప్రాంగణంలో ఉండడం, సరిపడా పార్కింగ్, సమీపంలోనే హెలిపాడ్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రుషికొండ వద్ద నిర్మించిన టూరిజం రిసార్టులు సానుకూలంగా ఉన్నాయని కమిటీ తేల్చింది. పైగా.. ముఖ్యమంత్రి రాకపోకల కారణంగా నగర వాసులకు ఇబ్బందులు రాకుండా, ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఉండేందుకు ఈ నిర్ణయానికి వచ్చామని కూడా తెలిపింది. ముగ్గురు సీనియర్ అధికారులు సభ్యులుగా ఉన్న కమిటీ ఇలా నివేదిక ఇచ్చిందో లేదోం రామోజీరావు వెంటనే తన పైత్యానికి పదును పెట్టారు. 'వేదికపై సుద్దులు..ం తీరంలో ఘోరాలు' అంటూ గురువారం ఈనాడులో గగ్గోలు పెట్టారు. రుషికొండ వద్ద పర్యాటక శాఖ నిర్మించిన భవనాలు అక్రమమని, నిబంధనలకు విరుద్ధమని తీర్పు కూడా ఇచ్చేశారు.

### అన్ని అనుమతులతో..

వాస్తవానికి.. రుషికొండలో అన్ని రకాల అనుమతులతో పర్యాటక శాఖ భవన నిర్మాణాలు చేపడుతోంది. ఉదా..

- కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ నుంచి సీఆర్‌జెడ్ అనుమతులు తీసుకుంది..
- ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సిఫార్సులు తీసుకోవడంతో పాటు.. నిర్మాణంలో భాగంగా, అనుమతి ఉన్న ప్రాంతంలో చెట్లు తొలగించేందుకు, అంతకుమించి పెద్దసంఖ్యలో కొత్తగా మొక్కలు నాటేందుకు అటవీశాఖ అనుమతి నుంచి అనుమతులు సైతం ఉన్నాయి..
- జీవీఎంసీ నుంచి ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ లభించడంతో పాటు, భవనాల డిజైన్లకు ఆమోదం ఉంది..

..ఇలా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో పాటు, చట్ట ప్రకారం నిబంధనలను అనుసరించి అన్ని రకాల అనుమతులతో పర్యాటక శాఖ భవనాలను నిర్మించింది.

- ఇక రుషికొండ వద్ద ప్రభుత్వ భూమిలో ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టు కోసం ప్రతిపాదించింది కేవలం 3 శాతం మాత్రమే.
- 61 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతులుంటే, 9.88 ఎకరాల్లోనే ప్రాజెక్టు కోసం ప్రతిపాదించారు. ఇందులో కూడా భవనాలు కట్టింది కేవలం 1.84 ఎకరాల్లో మాత్రమే..
- అలాగే, ఏడు బ్లాకుల నిర్మాణానికి అనుమతులివ్వగా, కట్టింది నాలుగు బ్లాక్‌లే..

### కట్టడాలు ఈరోజు ప్రారంభించినవేం కాదు..

రుషికొండ మీద కట్టడాలు 1984లోనే ప్రారంభమయ్యాయి. 1989 నాటికి క్రమంగా 12 బ్లాకులు నిర్మించారు. అంటే రుషికొండను తొలిచింది, నిర్మాణాల కోసం అక్కడ చెట్లను నరికివేసింది టీడీపీ ప్రభుత్వమే. సముద్రతీరంలో వాతావరణ పరిస్థితులతో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కట్టిన ఈ భవనాలన్నీ దెబ్బతిన్నాయి. అందుకే ఈ ప్రభుత్వం వాటిని తీసివేసి కొత్తగా రిసార్టులను నిర్మించింది. మరి 1984లో కట్టిన నిర్మాణాలతో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది లేదా? అప్పుడు రుషికొండను తవ్వి, అక్కడున్న చెట్లను నరికి ఈ నిర్మాణాలు చేయలేదా? ఇప్పుడు ప్రశ్నిస్తున్న వాళ్లంతా అప్పుడేమయ్యారు? అంటే టీడీపీ ప్రభుత్వం చేస్తే కరెక్టు, వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేస్తే తప్పు అవుతుందా.. రామోజీ?

### బాలకృష్ణ వియ్యంకుడి కబ్జాలపై మౌనం..

మరోవైపు.. టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ వియ్యంకుడుగా చంద్రబాబుకు బంధువైన మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి అడ్డగోలుగా విశాఖలో భూకబ్జాకు పాల్పడితే కనీసం ఒక్క ముక్క వార్త కూడా ఈనాడులో రాయలేదు. ఎందుకంటే ఎంవీవీఎస్ మూర్తి టీడీపీ పెద్దల బంధువు కావడమే. విశాఖ నగరంలో ఎండాడ, రుషికొండ గ్రామాల పరిధిలో అత్యంత విలువైన ప్రాంతంలో ఏకంగా 38.6 ఎకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా మూర్తి స్వాహా చేసేశారు. అప్పటి సీఎం చంద్రబాబు సైతం నోరు మెదపలేదు. విశేషం ఏమిటంటే.. ఈ కబ్జా అంతా రుషికొండకు సరిగ్గా ఎదురుగానే.. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ కబ్జాలపై ఉక్కుపాదం మోపింది. మొదటి విడతలో 19.39 ఎకరాలను, రెండో విడతలో 4.74 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. మొత్తంగా 24.13 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. కోర్టు స్టే ఇవ్వడంతో మిగిలిన భూముల స్వాధీన ప్రక్రియకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది.

### రుషికొండలో గీతం కాలేజీ పేరిట చేసిన భూముల కబ్జా

- గులాబీరంగులో ఉన్న 19.39 ఎకరాల కబ్జా భూమిని మొదటివిడతగా ఈ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- ఆకుపచ్చ రంగులో 4.74 ఎకరాల కబ్జా భూమిని రెండో విడతగా స్వాధీనం చేసుకుంది.
- ఎరుపు రంగు గళ్లతో ఉన్న భూమి ఇంకా కబ్జాలో ఉంది. కబ్జాచేసిన ఈ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను స్పష్టంగా చూడొచ్చు.




రుషికొండలో గీతం కాలేజీ పేరిట చేసిన భూముల కబ్జాకు సంబంధించిన చిత్రం


### రామోజీ గ'లీజు'తనం ఇదీ..

వాస్తవానికి.. ఈనాడుకు విశాఖ నడిబొడ్డున సీతమ్మధారలో భూమిని లీజుకు ఇస్తే, చంద్రబాబు రాజకీయ అండ చూసుకుని ఏకంగా కబ్జా చేయడానికే రామోజీ యత్నించారు. లీజుకిచ్చిన భూమి కొంత రోడ్డు విస్తరణలో పోవడంతో విశాఖ నగర కార్పొరేషన్ భూసేకరణ పరిహారాన్ని ఇస్తే, ఆ భూమి తనది కాకపోయినా పరిహారాన్ని మాత్రం రామోజీ కాజేశారు. చివరకు.. సుప్రీంకోర్టు ఆదేశాలతో అక్కడ నుంచి కార్యాలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి రామోజీ ఇవాళ సుద్దులు చెబుతున్నారు.

## ఏ కొండ మీద ఏముంది?



కొండమీద మిలీనియం టవర్




రామానాయుడు స్టూడియో

- విశాఖ నగరంలో చాలా నిర్మాణాలన్నీ కూడా కొండల మీదే ఉన్నాయి. ఏఏ కొండ మీద ఏమేం ఉన్నాయంటే..
- డాల్ఫిన్ హిల్ మీద పెద్ద సంఖ్యలో నేవీ సిబ్బంది క్వార్టర్లు నిర్మించారు. ఇవి పూర్తిగా కొండమీదే ఉన్నాయి.
- సర్క్యూట్ హౌస్‌గా పిలిచే గవర్నర్ బంగ్లా కూడా కొండ మీదే ఉంది.
- ఐటీ హిల్స్ ప్రాంతాన్ని చూస్తే దాదాపు అన్ని భవనాలు కొండల మీదే ఉన్నాయి. మిలీనియం టవర్స్ ఉండేది ఈ కొండమీదే.
- రామానాయుడు స్టూడియోస్ మొత్తం కొండల మీదే ఉంది.
- ఇక రుషికొండకు సమీపంలో ఉన్న హెమా వెల్నెస్ సెంటర్ కూడా పూర్తిగా కొండమీదే నిర్మించారు.



1984-89 మధ్య చేసిన నిర్మాణాలు



రుషికొండ సమీపంలోని కొండలమీద పలు భవనాలు

## రామోజీ.. మీరుండేది కొండ మీదేనని మర్చిపోయారా!?



ఫిలింసిటీలో కొండపై రామోజీరావు నివాసం

రుషికొండ మీద ఏదో జరిగిపోతోందంటూ గగ్గోలు పెడుతున్న రామోజీరావు నిజానికి ఎక్కడుంటున్నారు? ఆయన కట్టిన ఫిల్మ్‌సిటీ ఎక్కడుంది? ఆ ఫిల్మ్ సిటీలో వివిధ నిర్మాణాలు వేటి మీద చేశారు? వీటిని ఒక్కసారి పరిశీలిస్తే గురవింద సామెత గుర్తుకొస్తుంది. రామోజీరావు ఉంటున్న నివాసం పూర్తిగా కొండమీదే కట్టారు. అవి పర్యావరణ ఉల్లంఘనలు కావా? ఫిల్మ్‌సిటీ పేరిట ఈ పెద్ద మనిషి పదుల కొద్దీ అసైన్డ్, సీలింగ్ భూములు కబ్జాచేసిన వ్యవహారాలు మర్చిపోతే ఎలా? ఇక ఫిల్మ్‌సిటీ నిర్మాణాలను పరిశీలిస్తే అన్నీ గుట్టల మీద కట్టినవే. కాదంటారా రామోజీ..

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 490 | 64,081 |
| నిఫ్టీ ▲ | 144 | 19,133 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 13,260 | ▲ 199 |
| డోజోన్స్ | 33,721 | ▲ 446 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,447 | ▲ 104 |
| డాక్స్ | 15,144 | ▲ 220 |
| షాంఘై | 3,009 | ▲ 14 |
| నికాయ్ | 31,950 | ▲ 348 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 61,092 ▲ | 80 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 60,847 ▲ | 79 |
| వెండి (కిలో) | 71,684 ▲ | 700 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 82.49 | 84.26 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 99.73 | 101.94 |
| € | యూరో | ఒకటి | 86.78 | 89.19 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 54.27 | 55.87 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 51.63 | 54.39 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 59.12 | 60.98 |
| SAR | సౌదీ రియాల్ | ఫాయిన్‌టెన్ | 21.23 | 22.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఫాయిన్‌టెన్ | 21.87 | 23.49 |
| ¥ | చైనా యువాన్ | ఫాయిన్‌టెన్ | 10.23 | 12.29 |

# పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

## బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్‌ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

# కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

**51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు**

**ముంబై:** సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్ఠంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్ఠమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

# ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్లు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్లు అజియో ప్రకటించింది.

# దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



**ముంబై:** విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

**మరిన్ని వివరాలు..**

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

## గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

**రూ. 63,000 కోట్ల ఒప్పందం**

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

# మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

**ముంబై:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటో కార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

# లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్‌ఆర్ అమ్మకాలు జూమ్




**న్యూఢిల్లీ:** ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

**ఇకపై మరింత దూకుడు:** తాజా సమీక్షా కాలంలో జేఎల్‌ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

# ర్యాలీలు, మీటింగులుండవ్!

## బ్యానర్లు, నినాదాలు అస్సలుండవు • మిజోరంలో ప్రచారం రూటే వేరు

ఎన్నికలంటేనే బోలెడంత హడావుడి, ప్రచారం, సభలు, సందడి. మరీ ముఖ్యంగా మన దేశంలోనైతే ఆ ఊపే వేరు. కానీ మిజోరంలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించదు. పార్టీల ర్యాలీలు, భారీ బహిరంగ సభలు, రోడ్లను బ్లాక్ చేసేయడం వంటివి కాగడా వేసి వెదికినా ఎక్కడా కనిపించవు. అసలు రోడ్లపై గానీ, మరెక్కడైనా నినాదాలు విన్పించడం, బ్యానర్లు కన్పించడం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు!

**ప్రచారమంతా చర్చి ఆధ్వర్యంలోనే...**

మిజోరంలో అత్యంత బలమైనది చర్చి వ్యవస్థ. రాష్ట్రంలో పార్టీల ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆసాంతం చర్చి ఆధ్వర్యంలో నడిచే మిజో పీపుల్స్ ఫోరం (ఎంపీఎఫ్) చర్చి కనుసన్నల్లోనే జరుగుతుంది. గత మూడు ఎన్నికల నుంచీ ఇది మరింతగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.



**ఏం చేస్తుంది?**

- ఎంపీఎఫ్ అసెంబ్లీ స్థానాలవారీగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది.
- ఆ నియోజకవర్గంలోని అందరు అభ్యర్థులూ అక్కడికే వస్తారు.
- తమ విధానాలు, పథకాలు తదితరాలను ఒక్కొక్కరుగా ప్రజల ముందు పెడతారు.
- ఇందుకు ఒక్కొక్కరికి 20 నిమిషాలు టైం కేటాయిస్తారు.
- ఏ గొడవలకు, ఉద్రిక్తతలకు తావులేకుండా కార్యక్రమం సాగుతుంది.

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఇలాగే సాగాలంటూ చట్టం తెస్తే బాగుంటుందేమో కదా!

**పంచతంత్రం**



అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు రెండు ప్రత్యేక రికార్డులున్నాయి. రెండు మహిళలకు సంబంధించినవే కావడం విశేషం. అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిస్తే, అత్యల్ప ప్రాతినిధ్యమున్న రాష్ట్రంగా మిజోరం చెత్త రికార్డును మూటగట్టుకుంది. దాని చరిత్రలో ఇప్పటిదాకా ఎమ్మెల్యేలైన మహిళల సంఖ్య కేవలం నాలుగే! ప్రస్తుత మిజోరం అసెంబ్లీలోనైతే ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేరు! అంతేకాదు, 2014 ఉప ఎన్నికలో నెగ్గిన వన్లాల్‌వాంపుయ్ చోంగ్తూను మినహాయిస్తే గత 27 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు! ఇక లోక్‌సభకైతే మిజోరం చరిత్రలోనే ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎన్నికవలేదు! ఇక ఇప్పటిదాకా ఇద్దరంటే ఇద్దరు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు!

- మిజోరం అసెంబ్లీలో కానరాని స్త్రీలు
- దేశంలోకెల్లా అత్యల్ప ప్రాతినిధ్యం
- ఇప్పటిదాకా నలుగురే మహిళా ఎమ్మెల్యేలు
- లోక్‌సభకైతే మహిళల ప్రాతినిధ్యం సున్నా

# మహిళలకు మొండిచెయ్యే

**ఆది నుంచీ...**

కేంద్రపాలిత ప్రాంతం హోదాలో మిజోరంలో 1972లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేవలం నలుగురు మహిళలు మాత్రమే పోటీ చేశారు. వారిలో ఒక్కరూ నెగ్గకపోగా డిపాజిట్లు కూడా కోల్పోయారు. 1978లో ఎల్.థన్‌మావీ రూపంలో మిజోరంలో తొలిసారి ఒక మహిళ ఎమ్మెల్యేగా నెగ్గింది. ఆమెకు పడ్డ మొత్తం ఓట్లెన్నో తెలుసా? కేవలం 1,824. కేవలం 119 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారామె! అన్నట్టు, ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక మహిళ కూడా ఆమే. అనంతరం ఏడాది లోపే మళ్లీ జరిగిన ఎన్నికల్లోనూ నలుగురు పురుష అభ్యర్థులతో తలపడి కేవలం 42 ఓట్ల మెజారిటీతో మళ్లీ గెలిచారామె. ఆ ఎన్నికల్లో బరిలో దిగిన మరో ఇద్దరు మహిళలు డిపాజిట్ కోల్పోయారు. 1987లో మిజోరం రాష్ట్రంగా మారాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు మహిళలు పోటీ పడ్డారు. ఎంఎన్ఎఫ్ తరఫున లాల్‌హ్లంపుయ్ మర్ ఐజ్వాల్ నార్త్-1 నుంచి కేవలం 306 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అనంతరం లాల్‌డెంగా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. మంత్రి అయిన తొలి మిజో మహిళగా రికార్డు సృష్టించారు. అనంతరం 1989, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురేసి మహిళలు పోటీ చేసినా ఓటమి చవిచూశారు. 1998లో 10 మంది, 2003లో ఏడుగురు, 2008లో 9 మంది, 2013లో ఆరుగురు మహిళలు పోటీ చేసినా ఒక్కరూ నెగ్గలేదు. అలా 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2014లో ఉప ఎన్నికలో నెగ్గిన చోంగ్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అయితే ఆమెకు దక్కింది... మత్స్య, సహకార శాఖలు! కానీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో అత్యధికంగా 18 మంది మహిళలు పోటీ చేసినా ఒక్కరూ గెలుపు ముఖం చూడలేకపోయారు. పైగా ఏకంగా 16 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

**ఈసారి...**

- ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఇద్దరేసి మహిళలకు టికెట్లివ్వగా
- బీజేపీ ముగ్గురికిచ్చింది. మొత్తమ్మీద ఈసారి 16 మంది మహిళలు ఎన్నికల బరిలో దిగారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

**ఎందుకిలా...?**

మిజోరంలో చట్టసభల్లో మహిళలకు అత్యల్ప ప్రాతినిధ్యానికి అక్కడి పితృస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని చెబుతారు. పరిశీలిస్తే అది నిజమేననిపిస్తుంది కూడా. క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నా మిజోరం ప్రధానంగా గిరిజన రాష్ట్రం. సహజంగానే అక్కడ మహిళలకు ఇల్లు దాటికి బయటికి వెళ్లడాన్ని అంతగా ఇష్టపడరు.





ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంప్రదాయక డోలు వాయిస్తున్న జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురీ నియోజకవర్గంలోని ఖుత్గావ్ పట్టణంలో తీసిందీ ఫొటో

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

## కాంగ్రెస్ ఉన్నచోట అభివృద్ధి ఉండదు

**కాంకేర్:** వారసత్వ రాజకీయాలు, అవినీతి, బంధుప్రీతికి మారుపేరైన కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అవినీతికి పాల్పడుతోందంటూ సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ప్రధాని మోదీ..రాష్ట్రాన్ని దోచుకున్న వారిని ఏమాత్రం ఉపేక్షించరాదన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళను ఎంపిక చేయగా దానిని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ద్రౌపదీ ముర్ము ఎన్నికనుద్దేశించి ప్రధాని చెప్పారు. ఇలాంటి వైఖరి కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి గిరిజనుడూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను మీరు శిక్షిస్తారా అని ప్రధాని ప్రశ్నించగా అవును అంటూ జనం బదులిచ్చారు. ఇతర వెనుకబడిన కులాని(ఓబీసీ)కి చెందినందునే 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తనను దూషించిందని తెలిపారు. కేంద్రంలో అధికారం కోల్పోయాక పార్టీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో అవినీతితో ఖజానా నింపుకుంటోందని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చ లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సీఎం బఘేల్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని కాంగ్రెస్ కమిటీ కార్యాలయంగా మార్చేసి, ప్రభుత్వంలో పెద్దల పిల్లలు, బంధువులకు ఉద్యోగాలిచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే బస్తర్ ప్రాంతంలోని పేదలు, దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజన కుటుంబాలకు హత్యలు, నేరాలు, హింస తప్ప ఏం లాభం కలిగింది? అని ప్రశ్నించారు. 'అందుకే, రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఎంత శక్తిమంతులైనప్పటికీ వదలరాదు. దోచుకున్నదంతా వారి నుంచి కక్కిస్తాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నచోట అభివృద్ధి ఉండదు' అని మోదీ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మోదీ, బీజేపీ చేసుకుంటాయని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని వేగవంతం చేసి, సుసంపన్నమైన ఛత్తీస్‌గఢ్‌కు పునాది వేస్తాం. రాష్ట్రాన్ని వచ్చే అయిదేళ్లలో దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం' అని ప్రధాని ప్రకటించారు.

## మెజారిటీ రాకున్నా సరే, బీజేపీని మాత్రం కలుపుకోం: జెడ్‌పీఎం

**ఐజ్వాల్:** ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంలో తమ పార్టీ విఫలమైనప్పటికీ, బీజేపీ మద్దతు మాత్రం తీసుకోబోమని జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) కుండబద్దలు కొట్టింది. జెడ్‌పీఎం వర్కింగ్ చైర్మన్ కె.సప్తంగ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు కొత్త ప్రభుత్వం, కొత్త పాలనా విధానం రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారు సంకీర్ణప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. ఎన్నికల తర్వాత మా పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా, బీజేపీ మద్దతు తీసుకోవడం, ఆ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు' అని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జట్టుకట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత జెడ్‌పీఎం, అధికార ఎంఎన్ఎఫ్‌లలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీతో చేతులు కలుపుతామంటూ బీజేపీ చేసిన ప్రకటనపై పైవిధంగా సప్తంగ స్పందించారు. ఈ నెల 7న జరగనున్న ఎన్నికల్లో తమదే గెలుపని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.